అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 14-11-2024 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 265 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు వెల : 6.50

దలాల్ స్ట్రీట్‌కు ద్రవ్యోల్బణం సెగ

సెన్సెక్స్ 1000 పాయింట్ల పతనం



రూ. 6.8 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో సానుకూల సంకేతాలు కానరావడం లేదు. వరుసగా ఐదో రోజూ నేల చూపులు చూశాయి. అక్టోబర్‌లో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ (సీపీఐ) 6.21 శాతానికి ఎగిసి 14 మాసాల గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ ప్రభావం బుధవారం దలాల్ స్ట్రీట్‌పై తీవ్రంగా పడింది. బీఎస్ఈ సెన్సెక్స్ 984.23 పాయింట్లు లేదా 1.25 శాతం పతనమై 77,690.95కు పడిపోయింది. ఇంట్రాడేలో ఏకంగా 1,142 పాయింట్లు లేదా 1.45 శాతం క్షీణించింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.5.41 లక్షల కోట్లు ఆవిరై.. రూ.429.92 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. మంగళవారం సెషన్‌లోనూ రూ.3 లక్షల కోట్లు హరించుకుపోయింది. గడిచిన ఐదు సెషన్లలో ఏకంగా రూ.23 లక్షల కోట్ల సంపద ఆవిరయ్యింది. బీఎస్ఈ బాటలోనే ఎన్ఎస్ఈ నిఫ్టీ 324 పాయింట్లు కోల్పోయి 23,559 వద్ద ముగిసింది. కార్పొరేట్ సంస్థల ...11లో



గుర్తిస్తాం..శిక్షిస్తాం



వికారాబాద్ ఘటనపై పొంగులేటి వ్యాఖ్యలు 3లో..

- రైతుల పేరుతో పింక్ కలర్స్ దౌర్జన్యం
- ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు బీఆర్ఎస్ కుట్ర
- త్వరలో కొత్త ఓఆర్ఆర్ చట్టం
- దేశానికే రోల్ మోడల్
- 'ధరణి'ని విదేశీ కంపెనీల నుంచి విడిపించాం
- ప్రతి ధాన్యపు గింజా కొంటాం

ప్రజాకవి కాళోజీ

నిత్య స్మరణీయుడు

సీఎం రేవంత్ రెడ్డి

వర్థంతి సందర్భంగా నివాళులు

వివరాలు 11లో



కులగణన సర్వేలో వ్యక్తిగత వివరాలు

సేకరించొద్దు

ప్రజల సందేహాలను అఖిలపక్షంలో ప్రభుత్వం నివృత్తి చేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే పేరుతో వ్యక్తిగత వివరాలు సేకరించడం తగదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. దేశ జనాభా లెక్కల్లో కులగణన చేర్చాలనే చర్చ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నదని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సర్వే పత్రంలో కులంతోపాటు ఆస్తులు, రాజకీయ, వ్యవసాయ భూములకు సంబంధించిన వ్యక్తిగత వివరాలతో కూడిన ప్రశ్నలున్నాయని వివరించారు. ఆ వివరాలు ఇవ్వడానికి పలు అనుమానాలు, వ్యతిరేకత ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు. అటువంటి ప్రశ్నలను మినహాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. వ్యక్తిగత ప్రశ్నలకు సంబంధించిన వివరాలు వెల్లడించడానికి ప్రజలు విముఖత వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని చోట్ల ఎదురు తిరుగుతున్నట్టు, దాడులు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయని తెలిపారు. రేషన్ కార్డులు తొలగించడానికి, సంక్షేమ పథకాలు రద్దు చేయడానికే ఈ సర్వే చేస్తున్నారంటూ ప్రజల్లో సందేహాలు రేకెత్తుతున్నాయని పేర్కొన్నారు. కొన్ని చోట్ల సర్వే చేస్తున్న వారిని వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లను అనుమానించే సందర్భాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. అందువల్ల పై అంశాలపై ప్రభుత్వం స్పందించి, అఖిలపక్ష సమావేశం నిర్వహించి సందేహాలను నివృత్తి చేయాలని కోరారు.

బుల్డోజర్ న్యాయం

ఈ ఆదేశాలు దేశం మొత్తానికి వర్తింపు

రాజ్యాంగ విరుద్ధం..

అధికారులు జడ్జిల్లా మారి నిందితుల ఆస్తులు కూల్చివేస్తారా?

'బుల్డోజర్ న్యాయం' పేరుతో వ్యక్తుల ఇండ్లు, ఆస్తులు కూల్చివేయడంపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారులు న్యాయమూర్తుల్లా మారి నిందితుల ఆస్తులను కూల్చే నిర్ణయం సరికాదంటూ సుప్రీం మండిపడింది. కేవలం ఓ కేసులో నిందితులు, దోషులుగా ఉన్నంత మాత్రాన ఆ వ్యక్తుల ఆస్తులను ధ్వంసం చేయడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. ఇక మీదట ఇలాంటివి కుదరదని తేల్చి చెప్పింది. కూల్చివేతలకు, మతానికి లింక్ పెట్టడం సబబు కాదని స్పష్టం చేసింది. ఇది ఏ ఒక్క రాష్ట్రానికో కాదని, ఈ ఆదేశాలు మొత్తం దేశానికి సంబంధించినవి అని కోర్టు పేర్కొంది. ఆస్తుల కూల్చివేతపై మార్గదర్శకాలను రూపొందించాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై సుదీర్ఘంగా విచారణ జరిపిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ కెవి విశ్వనాథన్ కూడిన ధర్మాసనం బుధవారం సంచలన తీర్పును వెలువరించింది. ఈ మేరకు కీలక మార్గదర్శకాలను వెలువరించింది.

- నిందితులు, దోషుల ఆస్తులు ధ్వంసం చేస్తారా?
- అక్రమ కూల్చివేతలకు అధికారులదే బాధ్యత
- బాధితులకు వారే పరిహారం చెల్లించాలి
- బుల్డోజర్ న్యాయంపై సుప్రీం సంచలన తీర్పు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

"ప్రతి కుటుంబం సొంతింటిని కలిగి ఉండాలని ఎన్నో కలలు కంటుంది. నేరానికి శిక్ష కింద వారి ఆస్తులను లాక్కుని ధ్వంసం చేసే హక్కు అధికారులకు ఉంటుందా? అనేది ఇక్కడ ముఖ్యమైన ప్రశ్న. చట్టబద్ధమైన పాలన ప్రజాస్వామ్య ప్రభుత్వానికి పునాది. నిందితుల నేరం రుజువు కాక ముందే వారిని శిక్షించే విధానాన్ని న్యాయవ్యవస్థ హర్షించదు" అని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. "ప్రజల ఆస్తులను ఏ కారణం చేత ధ్వంసం చేయరాదు. రాష్ట్రాల ఏకపక్ష చర్యల నుంచి వ్యక్తులకు రక్షణ కల్పించే విధంగా రాజ్యాంగం వారికి కొన్ని హక్కులను ఇచ్చింది. ఆస్తులను తీసి వేసేముందు వ్యక్తులకు సమాచారం ఇవ్వాల్సిన చట్ట నియమం ఒకటి ఉంది. రాష్ట్రాలు కానీ, దాని ఎగ్జిక్యూటివ్ వ్యవస్థలు కానీ మితిమీరిన చర్యలు తీసుకోవడానికి వీల్లేదు. నిరంకుశత్వంతో నిందితులు, దోషుల హక్కులను రాష్ట్రాలు ఉల్లంఘించరాదు. ఏ అధికారి అయినా ...11లో

కూల్చివేతలు చేపట్టే అధికారం ఎవరికీ లేదు

"కేవలం ఆరోపణల ఆధారంగా వ్యక్తులను దోషులుగా ప్రకటించలేం. వారి ఆస్తులకు నష్టం కలిగిస్తే అది న్యాయ వ్యవస్థను ధిక్కరించడం కిందకే వస్తుంది. అధికారులు న్యాయమూర్తులుగా మారి నిందితుల ఆస్తులను కూల్చివేసే నిర్ణయాన్ని తీసుకోకూడదు. ప్రతి వ్యక్తికి ఇంటి ద్వారా ఆశ్రయం పొందే హక్కు ఉంది. దానిని తొలగిస్తే ఆర్టికల్ 19 ప్రకారం ప్రాథమిక హక్కును ఉల్లంఘించిన నేరం కిందకు వస్తుంది" అని ధర్మాసనం నొక్కి చెప్పింది. "రాత్రిపూట మహిళలను, పిల్లలను వీధుల్లో నిలబడేలా చేయడం ఆమోదించదగినది కాదు. ముందస్తు షోకాజ్ నోటీసు లేకుండా, నోటీసులు అందజేసిన నాటి నుంచి 15 రోజుల్లోపు కూల్చివేతలు చేపట్టే అధికారం ఎవరికీ లేదు" అని స్పష్టం చేసింది. కూల్చివేత ప్రక్రియలను వీడియో తీయాలని ఆదేశించింది. ప్రభుత్వ భూమిలో అనధికారికంగా నిర్మాణాలు ...11లో

లగచర్ల ఘటనలో అరెస్టుల పర్వం

అదుపులో మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, మరో నలుగురు





- కొడంగల్ కోర్టులో హాజరు ,14 రోజుల రిమాండ్
- ఏ 1గా పట్నం నరేందర్ రెడ్డి :
- మల్టీ జోన్ 2 ఐజీ వి. సత్యనారాయణ
- సురేష్‌తో పాటు 46మంది నిందితుల
- గాలింపునకు ప్రత్యేక బృందాలు

నవతెలంగాణ-కొడంగల్/వికారాబాద్ కలెక్టరేట్

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో లగచర్ల ఘటన.. అలజడులు సృష్టిస్తోంది. బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అరెస్ట్‌తో దాడి ఘటన చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పలు గ్రామాల్లో అరెస్టులు కొనసాగుతున్నాయి. మొత్తంగా 21మందిని 14 రోజులపాటు రిమాండ్‌కు తరలించారు. కలెక్టర్‌తో పాటుగా అధికారులపై దాడి అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. పోలీసులు ఉన్నతాధికారులు స్వయంగా ఈ ఘటన పైన విచారణ చేస్తున్నారు. కాగా, ఘటనతో ప్రత్యక్ష సంబంధం ఉన్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన నిందితుడు సురేష్ పరారీలో ఉన్నాడని పోలీసులు చెబుతున్నారు. అతను బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి ప్రధాన అనుచరుడు కావడంతో మాజీ ఎమ్మెల్యేపై పోలీస్ ఉన్నతాధికారులు నిఘా పెట్టారు. బుధవారం నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేసి దాడి ఘటనలో ఏ1 నిందితునిగా చేర్చారు. అయితే, రిమాండ్ రిపోర్టులో.. ఈ ఘటన వెనుక ఉన్న ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. బీఆర్ఎస్ ముఖ్యనాయకులపైనా ఆరోపణలు రావడంతో వారి పేర్లు పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. కాగా, గ్రామంలో ఇప్పటికీ ఇంటర్‌నెట్ రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్ల, పోలేపల్లిలో ఈ నెల 11న ఫార్మా విలేజ్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లిన జిల్లా కలెక్టర్, ఇతర అధికారులపై గ్రామస్తులు దాడికి పాల్పడ్డ విషయం తెలిసిందే. కాగా, లగచర్ల గ్రామ శివార్లలో.. గ్రామ సభ ఏర్పాటు చేయగా.. గ్రామానికి వచ్చి గ్రామస్తులతో మాట్లాడాలని అధికారులను తీసుకెళ్లిన సురేష్ అనే వ్యక్తి పరారీలో ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి బీఆర్ఎస్ నేతలతోపాటు దాదాపు 46మందిని నిందితులుగా గుర్తించిన పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు. మంగళవారం ...10లో

రైతు భరోసా అందేనా..?

గంపెడాశలో రైతులు



- రబీ సీజన్‌కు సిద్ధం
- వరి నార్లు పోసేందుకు పనులు ప్రారంభం
- ఖరీఫ్ పత్తి, వడ్లు అమ్ముడుబోని వైనం
- పంట సాగుకు పైసల్లేక అన్నదాతల ఆందోళన
- రాష్ట్రంలో 74.58 లక్షల మంది పట్టాదారులు
- 90 శాతం సన్న, చిన్నకారు రైతులే
- 10 ఎకరాల్లోపు రైతులు 60,93,433 మంది..

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

"అధికారంలోకి రాగానే రైతు బంధు కింద ఎకరాకు ఏడాదికి రూ.15 వేల రైతు భరోసా ఇస్తాం. రైతులకే కాదు.. కౌలుదారులకు సైతం ఇస్తాం. గ్రామీణ వ్యవసాయ కూలీలకు సైతం ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తాం" ఇదీ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోంది.. ఇప్పటి వరకు 'రైతు భరోసా' రైతులకు అందలేదు. పట్టాదారులకే కాదు కౌలుదారులకూ రైతు భరోసా అందలేదు. ఖరీఫ్ సీజన్ పంటలొచ్చి దిగుబడులు మార్కెట్లల్లో మగ్గుతున్నాయి. రబీ పంటల సాగుకు సన్నద్ధమవుతున్న అన్నదాతల చేతుల్లో చిల్లిగవ్వలేక రైతు భరోసా కోసం గంపెడాశతో ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక యాసంగి, ఖరీఫ్ రెండు సీజన్లు ముగిశాయి. ముచ్చటగా తిరిగి మూడో సీజన్‌గా యాసంగి (రబీ) సమయమొచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో గత రబీ సీజన్‌లో రైతు బంధు డబ్బుల్ని పాత పద్ధతిలోనే ఇచ్చారు. ప్రస్తుతం రైతులు పండించిన పంట దిగుబడులు మార్కెట్‌లో కొనుగోళ్లు లేక మగ్గుతున్నాయి. పంట అమ్ముకోలేక, అమ్మినా పైకం చేతికందక అయోమయ పరిస్థితిల్లో రైతులు ఉన్నారు. ఇదిలా ఉండగానే మళ్లీ యాసంగి వరి నార్లు పోయడం, దుక్కులు దున్నడం, విత్తనాలు, ఎరువుల్ని సమకూర్చుకునే పనిలో పడ్డారు. సర్కార్ ఇస్తామన్న భరోసా డబ్బులొస్తే పెట్టుబడులకు తిప్పలు తప్పుతాయని భావిస్తున్నారు.

10 ఎకరాల్లోపు 60.93 లక్షల మంది పట్టాదారులు

రాష్ట్రంలో రైతు భరోసా అమలు కోసం ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించింది. పలుమార్లు సమావేశమైన కమిటీ రైతు భరోసా అమలు కోసం సమగ్ర సమాచారం కోసం వ్యవసాయ శాఖ నుంచి నివేదికలు తెప్పించుకుంది. వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం రాష్ట్రంలో 157.43 లక్షల ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. అందులో ప్రతి ఏటా 152.51 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నట్టు నివేదికలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 74.58 లక్షల మంది పట్టాదారులుండగా వీరిలో 90 శాతం మంది సన్న, చిన్నకారు రైతులే ఉన్నారు. భూమి కలిగిన వారి లెక్కల్ని పరిశీలిస్తే.. 5 ఎకరాల్లోపు ఉన్న రైతులు 56,10,667 (90.3 శాతం) ఉన్నారు. 5-10 ఎకరాల్లోపు భూములన్న రైతులు 4,82,766 మంది (7.80 శాతం) ఉన్నారు. 10 నుంచి 54 ఎకరాల్లోపు ఉన్న రైతులు 1,16,722 (1.80 శాతం) ఉన్నారు.

11 విడతల్లో గత ప్రభుత్వం..

గత ప్రభుత్వంలో 11 విడతల్లో రైతు బంధు కింద పెట్టుబడి సాయాన్ని అందించినట్టు అధికారిక ...11లో

ముగిసిన తొలి విడత పోలింగ్



- జార్ఖండ్‌లో 64.86 శాతం
- వాయనాడ్ లోక్‌సభకు 60.79 శాతం ఓటింగ్
- 10 రాష్ట్రాల్లోని 31 అసెంబ్లీ స్థానాల బైపోల్స్‌కు భారీగా ఓటర్లు

11లో..

యువతి దారుణ హత్య



- పత్తి చేనులో పూడ్చి పెట్టిన ప్రేమికుడు
- ఆర్థిక లావాదేవీలే కారణం..?
- భద్రాద్రి జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి

11లో..

లగచర్ల ఘటనకు సీఎం బాధ్యుడు



పట్నం నరేందర్‌రెడ్డి టెర్రరిస్టా? లేక దేశద్రోహా?

- ఆయన్ను ఎందుకు అరెస్టు చేశారు?
- అది అరెస్టు కాదు.. కిడ్నాప్
- నరేందర్‌తోపాటు 16 మంది రైతులను వెంటనే విడుదల చేయాలి : విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్లే కొడంగల్ (లగచర్ల) ఘటన సంభవించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. అంతేతప్ప దాంట్లో కుట్ర కోణమేమీ లేదని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి తదితరులతో కలిసి కేటీఆర్ మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో ముచ్చర్లలో ఫార్మా క్లస్టర్ ఏర్పాటుకు నిర్ణయించామని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. హైదరాబాద్ ఫార్మాసిటీ పేరిట ఎనిమిదేండ్లు కష్టపడి 14 వేల ఎకరాలను సేకరించామని తెలిపారు. అయితే అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న రేవంత్, భట్టి ...11లో



ఎవర్నీ వదలం

కలెక్టర్‌పై దాడి బీఆర్ఎస్ కుట్రే

- కేసుల నుంచి తప్పించుకొనేందుకే కేటీఆర్ ఢిల్లీ టూర్
- మహారాష్ట్రలో బీజేపీకి అనుకూలంగా బీఆర్ఎస్ వ్యవహారం : డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

లగచర్లలో కలెక్టర్‌పై దాడి బీఆర్ఎస్ కుట్రే అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టంచేశారు. ఈ కేసులో ఎవర్నీ వదిలేది లేదని తేల్చిచెప్పారు. ప్రధాన నిందితుడి ఫోన్ నుంచి బీఆర్ఎస్ నేతలకు కాల్స్ వెళ్ళాయనీ, వాట్సాప్ చాటింగ్‌ను కూడా పోలీసులు గుర్తిస్తున్నారని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లగచర్లలో కుట్రపూరితంగా ముందస్తు ప్రణాళిక ప్రకారం బీఆర్ఎస్ అరాచక శక్తులు అమాయక దళిత, గిరిజన రైతులను రెచ్చగొట్టి దాడులకు పాల్పడ్డాయని తెలిపారు. కాల్‌డేటాలో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన అభ్యర్థి ఉన్నట్టు తెలుస్తుందనీ, దీనిపై పోలీసు విచారణ కొనసాగుతున్నదని వివరించారు. ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని, పరిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. పదేండ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ దీనిపై ఎందుకు నోరు మెదపట్లేదని ప్రశ్నించారు. కనీసం ఆయన బాధ్యత కలిగిన ప్రతిపక్ష నాయకుడిగా కూడా ప్రజల్లోకి రావట్లేదని ఆక్షేపించారు. ఫార్ములా ఈ- రేస్ కేసు నుంచి తప్పించుకోవడానికి కేటీఆర్ ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దలను కలిసి ఒప్పందం చేసుకున్నాడని ఆరోపించారు. దానిలో భాగంగానే మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటు వేయాలని కేటీఆర్ చెప్తున్నారనీ, ఇది బీజేపీతో కుదిరిన ఒప్పందంలో భాగమేనని చెప్పారు. రాష్ట్ర గవర్నర్‌పై సంపూర్ణ విశ్వాసం ఉందనీ, ఫార్ములా ఈ-రేస్ కేసు విచారణలో ఆయన ప్రజా ప్రభుత్వానికి సహకరిస్తారని ఆశిస్తున్నామని అన్నారు. గవర్నర్ తిరస్కరిస్తే చట్టం ప్రకారం ఏం చేయాలో అదేవిధంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

గూడ్స్ రైలు బోల్తా..
54 రైళ్లు దారి మళ్లింపు



పెద్దపల్లిలో అదుపుతప్పిన బోగీలు

- మూడు లైన్ల పట్టాలు ధ్వంసం
- తప్పిన పెను ప్రమాదం
- 50 లోకల్ ట్రైయిన్స్ రద్దు
- ఢిల్లీ, చైన్నయ్ మార్గంలో రాకపోకలకు అంతరాయం
- గురువారానికి పట్టాల పునరుద్ధరణ పనులు పూర్తి

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్ సమీపంలోని కన్నాల రైల్వే గేటుకు కొద్ది దూరంలో మంగళవారం రాత్రి గూడ్స్ రైలు పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. కర్నాటకలో బల్లారి నుంచి యూపీలోని గజియాబాద్‌కు 44బోగీల స్టీల్ లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు అదుపు తప్పి బోల్తాపడింది. బోగీల మధ్య కనెక్షన్లు తెగిపోవడంతో 11 బోగీలు ఒకదానిపై మరొకటి పట్టాలపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ప్రమాదంలో లోకోపైలెట్, గాడ్ ప్రాణాలతో బయటపడ్డారు. దేశ రాజధానికి వెళ్లే ప్రధాన రైలుమార్గం కావడం, మూడు లైన్ల పట్టాలూ దెబ్బతినడం.. ఆ సమయంలో ప్యాసింజర్ రైళ్లు రాకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. వెంటనే దక్షిణ మధ్య రైల్వే 50 లోకల్ రైళ్లను రద్దు చేసింది. మరో 54 రైళ్లను దారి మళ్లించింది. అధిక లోడ్ కారణమా? లేక పట్టాల మెయింటెనెన్స్ లోపాలా అన్న కోణంలో రైల్వే అధికారులు విచారిస్తున్నారు.

బల్లారి నుంచి యూపీలోని గజియాబాద్‌కు ఐరన్ కాయిల్స్ లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు పెద్దపల్లి - రామగుండం రైల్వే లైన్ మార్గంలోని 282/38, 282/34 కిలోమీటర్ల మధ్యన అదుపు తప్పి బోల్తాపడింది. మూడు పట్టాలు దెబ్బతిని బోగీలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఆస్తి నష్టం తప్ప ప్రాణ నష్టం చోటుచేసుకోలేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ లైన్‌లో ప్యాసింజర్ రైలు వస్తే భారీ ప్రాణ నష్టమే సంభవించేది. ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని కలుపుతూ వెళ్లే ప్రధాన రైలు మార్గం కావడంతో ఈ పెద్దపల్లి లైన్ నుంచే పెద్దఎత్తున రైళ్ల రాకపోకలు ఉంటాయి. ఈ క్రమంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధ, గురువారాల్లో నడిచే 50 రైళ్లను రద్దు చేశారు. దూరప్రాంతాలకు వెళ్లే మరో 54 రైళ్లను విజయవాడ, మంచిర్యాల, నిజామాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్ల మీదుగా దారి మళ్లించారు. నర్సాపూర్ - సికింద్రాబాద్, సికింద్రాబాద్- నాగపూర్, హైదరాబాద్ - సిర్పూర్ కాగజ్‌నగర్, సిర్పూర్ టౌన్ - కరీంనగర్, కరీంనగర్ - బోధన్, సిర్పూర్ టౌన్ - భద్రాచలం రోడ్, బల్లార్షా - కాజీపేట, కాచిగూడ - కరీంనగర్ రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా పెద్దపల్లి, రామగుండం స్టేషన్ల నుంచి ప్రయాణికులు తిరుగు ప్రయాణమయ్యేందుకు ఆర్టీసీ బస్టాండ్లలో సరిపడా బస్సులు లేక ముప్పుతిప్పలు పడ్డారు.

అధిక లోడ్ కారణమా? మెయింటనెన్స్ లోపమా?

గూడ్స్ రైల్ బోగీల్లో స్టీల్ వైండింగ్ లోడింగ్ చేసే సమయంలో ప్రమాదాలు జరగకుండా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోలేదని, కనీసం సాంకేతిక విభాగం ఈ అంశాన్ని పట్టించుకోలేదనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ కారణంగానే గూడ్స్ రైల్ ప్రమాదానికి గురైతే మాత్రం కచ్చితంగా లోడింగ్ సమయంలో రైల్వే యంత్రాంగం నిర్లక్ష్యమే స్పష్టమవుతుంది. మరోవైపు ప్రధాన రైల్వే లైను కావడంతో ఈ లైన్‌లోని ట్రాక్‌ల సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో ఏకధాటిగా కురిసిన వర్షాల వల్ల ట్రాక్ కింది భాగంలో నీటి నిలువలు చేరడంతో కుంగుబాటుకు గురై ఉంటుందా? లేక ట్రాక్ ఇరుపక్కల వాటర్ స్టోరేజ్ వల్ల దెబ్బతిని ఉంటుందా? నీరు నిల్వ ఉండి ట్రాక్ దెబ్బతింటే అధికారులు గుర్తించకుండా నిర్లక్ష్యం వహించారా? అన్న విషయాన్ని కూడా తెలుసుకునే పనిలో రైల్వే అధికారులు నిమగ్నమయ్యారు.

పునరుద్ధరణకు మరో 24గంటలు

ట్రాక్ పనులను పునరుద్ధరించే పనిలో రైల్వే యంత్రాంగం నిమగ్నమైంది. మంగళవారం అర్ధరాత్రి ఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతులు మొదలెట్టింది. అప్పటికే పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సింగరేణి సంస్థతో మాట్లాడి భారీ క్రేన్లను తెప్పించి పనులు ప్రారంభించారు. ఘటనాస్థలంలో ధ్వంసమైన మూడు ప్రధాన రైల్వే ట్రాక్‌లను పునరుద్ధరించేందుకు వాటిపై ఉన్న బోగీలను తీయడంలో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్టీల్ వైండింగ్ అధిక బరువు ఉండటంతో క్రేన్లతో తొలగించేందుకు ఆలస్యమవుతోంది. ఈ ఘటన గురించి తెలియగానే నాగపూర్ ఎన్నికల ప్రచారంలో ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మంగళవారం రాత్రి రైల్వే అధికారులకు ఫోన్ చేసి ఆరా తీశారు. ట్రాక్‌ల పునరుద్ధరణకు గురువారం సాయంత్రం వరకు వేచి చూడాల్సిందేనని రైల్వే టెక్నికల్ అధికారులు నివేదిక ఇచ్చినట్టు తెలుస్తోంది. అయితే, బుధవారం సాయంత్రం కల్లా ఒక్క ట్రాక్ మీదుగా అయినా రైళ్ల రాకపోకలు కొనసాగించేలా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నట్టు అధికారులు మీడియా తో తెలిపారు. ఘటనా స్థలంలో నెలకొన్న పరిస్థితిని చూస్తే గురువారం కూడా పునరుద్ధరణ పూర్తయ్యేలా కనిపించడం లేదు.

నేటి మధ్యాహ్నంలోపు లైన్లు పునరుద్ధరిస్తాం

క్రెయిన్లు, ప్రొక్లెయిన్స్ సాయంతో ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టాం. బుధవారం సాయంత్రం ఆరు గంటల్లోపు దెబ్బతిన్న మూడు లైన్లలో ఒకటి అందుబాటులోకి తీసుకొచ్చాం. మిగిలిన రెండు లైన్లను గురువారం ఉదయం 11గంటల్లోపు పునరుద్ధరిస్తాం. ఇప్పటివరకు 50లోకల్ రైళ్లను రద్దు చేశాం. దూర ప్రాంతాలకు వెళ్లే 53 రైళ్లను దారి మళ్లించాం.



అరుణ్‌కమార్ జైన్, సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్

అధికారులపై దాడి ఘటనలో ఎంతటి వారైనా ఉపేక్షించం

- కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి
- రైతులను ఇబ్బంది పెడితే మిల్లర్లపై ఎస్మా ప్రయోగిస్తాం
- పత్తి కొనుగోళ్లపై స్పందించని కేంద్ర మంత్రులు : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌పై దాడి ఘటనపై సమగ్ర విచారణ జరుపుతున్నామని, దీని వెనుక ఎంత పెద్దవారు ఉన్నా వదిలి పెట్టేది లేదని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్‌పై దాడిని తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ నాయకుడు.. పలు కేసుల్లో నిందితునిగా ఉన్న సురేష్ పథకం ప్రకారం అధికారులపై దాడి చేయడం సిగ్గు చేటన్నారు. ఒక ప్రణాళిక ప్రకారం కలెక్టర్‌ను పిలిపించి దాడికి పాల్పడ్డారని చెప్పారు. కాళేశ్వరం, మల్లన్న సాగర్, కొండపోచమ్మ వంటి అవసరం లేని ప్రాజెక్టులకు భూసేకరణ జరిగినప్పుడు ప్రజలకు ఇబ్బంది కలిగినా ప్రభుత్వాన్ని బతిమిలాడారే తప్ప ఏ రోజూ దాడులకు పాల్పడలేదని గుర్తు చేశారు. అలాంటిది ఈ రోజు జిల్లా కలెక్టర్‌పై దాడికి దిగడం దురదృష్టకరమన్నారు. ఉద్యోగులు, టీచర్లు, మేధావులందరూ ఈ దాడిని తీవ్రంగా ఖండించాలన్నారు.



రైతులను ఇబ్బంది పెడితే ఎస్మా

కొందరు స్వార్థపరులైన మిల్లర్ల కారణంగా ధాన్యం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇబ్బంది పెట్టే మిల్లర్లపై ఎస్మా కేసులు పెడతామని మంత్రి హెచ్చరించారు. సహకరించే మిల్లర్లను ప్రోత్సహిస్తామన్నారు. ఇప్పటికే 60 నుంచి 70శాతం ధాన్యాన్ని కొనుగోలు చేశామని, వారం రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పారు. నామమాత్రం 10శాతం బ్యాంక్ గ్యారంటీతో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వం మిల్లర్లతో చెప్పినా, వారు రైతులకు సహకరించకుండా ఇబ్బందులు పెడుతున్నారని, అలాంటి వారిపై అవసరమైతే ఎస్మా కేసులు పెడతామని అన్నారు. పత్తి కొనుగోళ్లపై రైతులు ఇబ్బందులు పడుతున్నా కేంద్ర మంత్రులెవరూ ఈ విషయంపై మాట్లాడం లేదని విమర్శించారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై దాడి చేసినవారికి తాము అండగా ఉంటామనేలా బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధినేతగా ఉన్న కేసీఆర్ ఈ ఘటనపై ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

- వరి కోత కోసి 20 రోజులైనా కొనడం లేదంటూ రైతుల రాస్తారోకో



నవతెలంగాణ-రామాయంపేట

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఇప్పుడు కొంటాం, అప్పుడు కొంటామంటూ కాలయాపన చేస్తూ, ధాన్యం కొనడం లేదని రైతులు రోడ్డెక్కారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామానికి చెందిన రైతులు వరి ధాన్యం కొనడం లేదని నిరసిస్తూ బుధవారం తొనిగండ్ల బస్టాండ్ వద్ద మెదక్- సిద్దిపేట జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ధాన్యం కొనుగోలు చేయాలని రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు పది రోజులు గడుస్తున్నా ఇప్పుడు కొంటాం, అప్పుడు కొంటాం అంటూ మాయమాటలు చెప్పి మోసం చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు.

చెట్ల పొదల్లో పసికందు

నవతెలంగాణ-కొండపాక

అప్పుడే పుట్టిన పసికందును గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు పక్కన చెట్ల పొదల మధ్య కవర్లో చుట్టి వదిలి వెళ్లారు. ఈ హృదయ విదారక ఘటన సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో బుధవారం మధ్యాహ్నం వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దుద్దెడ గ్రామంలోని దర్గాకు వెళ్ళే దారిలో రోడ్డు పక్కన చెట్ల పొదల మధ్య చిన్నారి ఏడుపు కేకలు విన్న పశువుల కాపర్లు పసికందును గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న గ్రామస్తులు 108కు సమాచారం ఇచ్చారు. అప్పటికే గ్రామస్తులు ఆ పసికందును దగ్గరకు తీసుకొని సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం 108 మెడికల్ టెక్నీషియన్ మహేందర్ అంబులెన్స్‌లో పసికందును చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుర్తిస్తాం..శిక్షిస్తాం



- వికారాబాద్ ఘటనపై పొంగులేటి వ్యాఖ్యలు
- రైతుల పేరుతో పింక్ కలర్స్ దౌర్జన్యం
- ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు బీఆర్ఎస్ కుట్ర
- త్వరలో కొత్త ఓఆర్ఆర్ చట్టం
- దేశానికే రోల్ మోడల్
- 'ధరణి'ని విదేశీ కంపెనీల నుంచి విడిపించాం
- ప్రతి ధాన్యపు గింజా కొంటాం
- మహిళా యాజమానికి ఇందిరమ్మ ఇల్లు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వికారాబాద్ ఘటన వెనుక ఉన్న కుట్రదారులను గుర్తిస్తామనీ, దాడికి పాల్పడిన ప్రతి ఒక్కరినీ చట్ట ప్రకారం శిక్షిస్తామని సమాచార, పౌర సంబంధాల, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. లగచర్ల ఘటనపై కాస్త ఓపిక పడతే ఒక్కొక్కటిగా అన్ని విషయాలూ బయట కొస్తాయన్నారు. ఆ తర్వాత నిందితులను మీడియా ముందు ప్రవేశ పెడతామని చెప్పారు. ప్రతిపక్షం మాదిరిగా తాము తొందర పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రైతుల పేరుతో కొందరు పింక్ కలర్స్ ముసుగు వేసుకుని అధికారులపై దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ ఘటన వెనక ఎవరున్నారో బయటపెడతామని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. భూములు, ఇండ్ల సమస్యలు, హౌసింగ్ బోర్డు, ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యోగ, ఉపాధి సమస్యలపై మంత్రి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని భూ సమస్యలపై 20మంది కలెక్టర్లతో మాట్లాడారు. ఇద్దరు ఎస్పీలతో నేరుగా మాట్లాడి బాధితుల సమస్యలను వివరించారు. ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున గాంధీభవన్‌కు వచ్చి పలు సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడారు. రైతులకు ఇబ్బందికరంగా మారిన ధరణి పోర్టల్‌ను విదేశీ కంపెనీ నుంచి విడిపించామని చెప్పారు. అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న నూతన ఆర్ఓఆర్ చట్టం దేశానికే రోల్ మోడల్ కాబోతున్నదని చెప్పారు. త్వరలో ఉద్యోగ నియామకాలను చేపడతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కొంతమంది కుట్రలు చేస్తున్నారనీ, అలాంటి వారి ఆగడాలు సాగనివ్వబోమని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్లు అంటే ఇందిరమ్మ రాజ్యమనీ, అర్హులైన ప్రతి పేదవాడికీ ఇల్లు ఇచ్చే కార్యక్రమం ప్రారంభించామన్నారు. బీఆర్ఎస్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ఆశ పెట్టి గత పదేండ్లపాటు ఎన్నికల్లో గెలిచిందనీ, కానీ వారికి ఇంతవరకూ ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పేదలకు 24 లక్షల ఇండ్లు కట్టిస్తామన్నారు. గ్రామ సభలు నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. లబ్దిదారులు నాలుగు వందల చదరపు అడుగుల జాగాలో ఇల్లు కట్టుకోవాలని సూచించారు. మొదటి విడతలో స్థలం ఉన్నవారికి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు ఇస్తుందన్నారు. విడతల వారీగా రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇస్తామనీ, అది మహిళా యజమాని పేరిట ఇవ్వాలనేది కాంగ్రెస్ లక్ష్యమన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో తొండాట ఆడబోమన్నారు. రైతు రుణమాఫీ కింద రూ.2 లక్షల చొప్పున ఇంకా కొంత మంది రైతులకు అందించాల్సి ఉందని చెప్పారు. మిగిలిన అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ చేస్తామన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇబ్బందుల్లో ఉన్న మాట వాస్తవమేననీ, అభివృద్ధి సంక్షేమం రెండు కండ్లుగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని చెప్పారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంది. ప్రతిపక్షాలు ధర్నాలు, నిరసనలు చేయాల్సిన అవసరం లేదు. అధికారంలో ఉన్నప్పుడు అన్నదాతలను జైళ్లలో పెట్టినవారు ఇప్పుడు పచ్చ కండువా వేసుకుని వారి వద్దకే వెళ్లి మద్దతు ఇస్తున్నామని చెబుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతన్నలను జైళ్లలో పెట్టి ఇప్పుడు ధర్నాలు, నిరాహార దీక్షలు, పోరాటాలు అంటూ వారిని మోసం చేస్తున్నారు. ధరణి చట్టంతో అనేక ఇబ్బందులు పడ్డామని రైతులు, భూ యజమానులు చెప్పిన విషయం గుర్తు లేదా?' అని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ మాత్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసే కార్యక్రమాన్ని చేపట్టిందని విమర్శించారు. అబద్ధాలు, అవాస్తవాలు ప్రచారం చేస్తూ ప్రజలను రెచ్చగొడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవు పలికారు.

వంట నూనె మంట

- రెండు నెలల్లో లీటర్‌కు రూ.40 పెంపు
- ప్రతి నెలా రెండుసార్లు పెరుగుదల

కేంద్ర ప్రభుత్వం 24 శాతం ఎక్సైజ్ డ్యూటీ విధింపు



హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా దేశంలో వంట నూనెల ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఒకేసారి 24 శాతం ఎక్సైజ్ డ్యూటీ పెంచడంతో వీటి ధరలకు అడ్డూ అదుపు లేకుండా ఉంది.ప్రతి 15 రోజులకు ఒకసారి టారీఫ్‌ను కేంద్ర ప్రభుత్వం పెంచుకుంటూపోతోంది. రెండు నెలల్లో లీటర్‌కు రూ.40 వరకు ధర పెరిగింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో విదేశాల నుంచి ముడి చమురు దిగుమతులు తగ్గడం కూడా ఒక కారణమని చెప్తున్నారు. ఇది ఇలానే కొనసాగితే మరికొద్ది రోజుల్లో లీటర్ వంట నూనె రెండు వందల మార్కు దాటే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. సార్వత్రిక ఎన్నికల తర్వాత నిత్యావసర ధరలు నియంత్రణలో లేకుండాపోయాయి. పప్పులు, నూనె, బియ్యం ఒక్కటేమిటి ప్రతి వస్తువు ధర పెరుగుతూనే ఉంది. ముఖ్యంగా వంట నూనెల ధరలకు రెక్కలొచ్చాయి. గత మార్చిలో లీటర్ పామాయిల్ రూ.90, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.105 ఉండేది. ప్రస్తుతం పామాయిల్ ధర రూ.137కు, సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర రూ.145కు చేరుకుంది. కేంద్ర ప్రభుత్వం మలేషియా నూనె ధరల ప్రకారం ధరల మార్కెట్ టారీఫ్ ప్రకటిస్తోంది. ప్రతి 15 రోజుల ఒకసారి టారీఫ్‌ను సవరిస్తోంది. ఈ నెల ఒకటో తేదీ నుంచి లీటర్ పామాయిల్ ధర రూ.18, సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర రూ.30 పెరిగింది. రెండు నెలల్లో పామాయిల్ ధర రూ.40, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.45 ధర పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 15న టారీఫ్‌ను మరోసారి సవరించనుండడంతో మళ్లీ ధర ఎంత పెరగనుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. మలేషియా నుంచి వంట నూనెల ముడిసరుకు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా ముత్తుకూరుకు అధికంగా వస్తుంటుంది. యుద్ధం నేపథ్యంలో ఇప్పుడు ఇది తగ్గిందని చెప్తున్నారు. ముత్తుకూరు మండలం పంటపాళెం వద్ద ఎనిమిది పామాయిల్ పరిశ్రమలు ఉన్నాయి. విదేశాల నుంచి ఓడల ద్వారా వస్తున్న ముడిసరుకు ఇక్కడ నుంచి పైప్‌లైన్ల ద్వారా ఫ్యాక్టరీలకు, అక్కడి నుంచి ప్యాకెట్లు, డబ్బాల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్నాటక తదితర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ప్రతి రోజూ సుమారు వంద లారీలు ఇక్కడ నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్తుంటాయి. యుద్ధం నేపథ్యంలో ఓడల్లో నూనె ముడిసరుకులు తక్కువగా వస్తున్నాయని చెప్తున్నారు. మలేషియా నుంచి ఒక్కో ఓడలో సుమారు రూ.700 నుంచి రూ.800 కోట్ల విలువైన ముడిసరుకు దిగుమతి అవుతుంటుంది. దీనికి బీమా చేయిస్తుంటారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఆయిల్ కంపెనీలు బీమా క్లెయిమ్ చేసుకుంటుంటాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి బీమా కంపెనీలు ఆయిల్ ఓడల బీమాకు అంగీకరించడం లేదని సమాచారం. ముడిసరుకు రవాణా రిస్కును ఆయిల్ కంపెనీలే భరించాల్సి వస్తుండడంతో దిగుమతులు కూడా తగ్గినట్లు చెప్తున్నారు. దీనివల్ల కూడా నూనె ధరలు పెరుగుతున్నాయని అంటున్నారు. వంట నూనెల ధరలు పెరగడంతో భోజనం, క్యాటరింగ్ ధరలు భారీగా పెరిగాయి.

గతంలో ఎప్పుడు ఇంత భారీగా పెరగలేదు

గతంలో ఇంత భారీ స్థాయిలో వంట నూనెల ధరలు పెరగలేదు. కేంద్ర ప్రభుత్వం 24 శాతం ఎక్సైజ్ డ్యూటీ పెంచింది. ప్రతి నెలా రెండుసార్లు టారీఫ్‌లు పెంచుతోంది. ఈ నెల 15న మరోసారి ధరలు పెరిగే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వానికీ, వ్యాపారులకూ ఈ పెరుగుదలలో ఎలాంటి సంబంధమూ లేదు. నూనెల ధరలు ఎంత వరకు వెళతాయో తెలియడం లేదు.

- సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఎడిబుల్ ఆయిల్ అసోసియేషన్

కలెక్టర్, సిబ్బందిపై దాడికి నిరసనగా

నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలు

ఉద్యోగ జేఏసీ చైర్మెన్ జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ శ్రీనివాసరావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్ లింగయ్య నాయక్, కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ సీసీ నరేందర్, ఇతర సిబ్బంది మీద జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు చెప్పారు.

ఈ దాడికి నిరసనగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు వారు ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లోని టీఎన్జీవో భవన్‌లో ఉద్యోగ జేఏసీ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ దోషులను బేషరతుగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలనీ, బోజన విరామ సమయంలో నిరసన చేపట్టాలని చెప్పారు. దోషులు ఎంతటి వారైనప్పటికీ చట్ట పరిధిలో శిక్షలు విధించాలని అన్నారు. జిల్లా అత్యున్నత అధికారైన కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న సందర్భంలో జరిగిన దాడి పట్ల ప్రభుత్వం తప్పకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాసేవలో ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నప్పటికీ వాటిని ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించుకునే మార్గం చూడాలి తప్ప, చట్టాన్ని తమ చేతిలోకి తీసుకుని విధులు నిర్వహిస్తున్న అధికారుల మీద దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. సమాజంలో ఇలాంటి చర్యలను పౌర సమాజం, రాజకీయ పక్షాలు, ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరముందన్నారు. రాష్ట్రంలో మళ్లీ ఇటువంటి సంఘటనలు పునరావృతం అయితే భవిష్యత్తులో 10 లక్షల ఉద్యోగుల కుటుంబాలకు నాయకత్వం వహించే 206 ఉద్యోగ సంఘాల భాగస్వామ్యంతో ఉన్న ఉద్యోగుల జేఏసీ తగు ఉద్యమ కార్యాచరణకు పిలుపు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నదని చెప్పారు.

తెలంగాణ ఉద్యోగులకు ఉద్యమాలు కొత్త కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ జేఏసీ కోచైర్మెన్లు చావ రవి, వంగ రవీందర్‌రెడ్డి, నాగిరెడ్డి, జి జ్ఞానేశ్వర్, డిప్యూటీ సెక్రెటరీ జనరల్స్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ, ఎ సత్యనారాయణ, నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, కె వెంకటేశ్వర్లు, బి శ్యామ్, ముత్యాల సత్యనారాయణగౌడ్, గంగాధర్, గోల్కొండ సతీశ్, లక్ష్మణ్, కె శ్రీకాంత్, హరికృష్ణ, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మకుంటకు పూర్వవైభవం

- త్వరలో పునరుద్ధరణ పనులు
- ఇండ్ల జోలికెళ్లం: హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- అంబర్‌పేటలో బతుకమ్మకుంట పరిశీలన





నవతెలంగాణ-అంబర్‌పేట/కీసర

హైదరాబాద్ అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మకుంటను పునరుద్ధరించి దానికి పూర్వ వైభవం తీసుకొస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఖాళీ స్థలం చుట్టుపక్కల ఉన్న ఇండ్లకు ఎలాంటి నష్టమూ వాటిల్లకుండా, వాటి జోలికి వెళ్లకుండా కుంటను పునరుద్ధరించి మంచి పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు, అంబర్‌పేట రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులతో కలిసి బుధవారం హైడ్రా కమిషనర్ బతుకమ్మకుంటను సందర్శించారు. మొదట స్థానిక వీకర్ సెక్షన్ వద్దకు వెళ్లి ఇండ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ కూల్చబోమని చెప్పారు. ప్రస్తుతం ఉన్న బతుకమ్మ కుంట 5.15 ఎకరాల్లోనే చెరువును పునరుద్ధరిస్తామని, దాంతో స్థానికులకు వరద ముప్పు తప్పి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని కమిషనర్ చెప్పారు. సర్వేనెంబర్ 563లో 1962-63 ప్రకారం మొత్తం 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మకుంట ఉండేదని, బఫర్‌జోన్‌తో కలిసి మొత్తం వైశాల్యం 16.13 ఎకరాల విస్తీర్ణం అని సర్వే అధికారులు తేల్చారన్నారు. తాజా సర్వే ప్రకారం.. 5.15 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, దాన్ని పునరుద్ధరించేందుకు హైడ్రా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఒకప్పటి ఎర్రకుంటనే కాలక్రమంలో బతుకమ్మకుంటగా మారిందని, రెవెన్యూ రికార్డులు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయని అన్నారు. కాలక్రమంలో బతుకమ్మకుంటలో చెత్త, నిర్మాణ వ్యర్థాలు పోయడంతో చెరువు ఆనవాళ్లు కోల్పోయిందని స్థానికులు కమిషనర్‌కు చెప్పారు. మళ్లీ బతుకమ్మ కుంటకు పూర్వ వైభవం తీసుకురావాలంటూ హైడ్రా కమిషనర్‌కు విన్నవించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు బతుకమ్మకుంట పునరుద్ధరణ పనులు చేపడతామన్నారు. కుంట నీటితో కళకళలాడితే పరిసర ప్రాంతాల్లో పర్యావరణం, భూగర్భ జలాల పెరుగుదలతోపాటు ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని కమిషనర్ తెలిపారు. జేసీబీలతో వెంటనే పనులు మొదలు పెట్టాలని అధికారులకు చెప్పారు. అధికారులు జేసీబీలను తెప్పించి పిచ్చిమొక్కలు, నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించే పనులు ప్రారంభించారు. ఈ పర్యటనలో హైడ్రా డిప్యూటీ కమిషనర్ సుధ, హైడ్రా డిప్యూటీ సిటీ ప్లానర్ రాంరెడ్డి, అంబర్‌పేట సర్కిల్ డీసీ మారుతీ దివాకర్, తహశీల్దార్ వీరాభాయి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సుమిత్రలతో పాటు ఇరిగేషన్ విభాగం అధికారులు ఉన్నారు. కమిషనర్ పర్యటన నేపథ్యంలో పెద్దఎత్తున పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే, తార్నాకలోని ఎర్రకుంట చెరువును కూడా హైడ్రా కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా 5.9 ఎకరాల్లో విస్తరించిన చెరువును పునరుద్ధరించి.. సుందరీకరిస్తే దుర్వాసన, దోమల బెడద తప్పుతుందని కమిషనర్‌ను స్థానికులు కోరారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎర్రకుంటను పరిశీలించి.. పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలంటూ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

నాగారంలో అక్రమ నిర్మాణం కూల్చివేత

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగారం మున్సిపాలిటీలో రోడ్డు స్థలాన్ని కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపట్టారని సమీప కాలనీవాసులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు బుధవారం పోలీసు బలగాలతో వెళ్లి జేసీబీతో అక్రమ నిర్మాణాన్ని కూల్చేశారు. ఈ సందర్భంగా హైడ్రా అధికారులు మాట్లాడుతూ.. రోడ్డు సమస్యను పరిష్కరించాలని ఆయా కాలనీల వాసులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. అన్ని పత్రాలూ పరిశీలించిన అనంతరం రోడ్డు స్థలం ప్రజలు వినియోగించుకునేలా గోడను కూల్చామని చెప్పారు.

దాడులతో ఆత్మస్థైర్యాన్ని

దెబ్బతీయలేరు

వికారాబాద్ ఘటన హేయమైన చర్య

టీజీ ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం రాత్రింబవళ్లు పని చేస్తున్న ఐఏఎస్ అధికారులపై దాడులు చేయడం హేయమైన చర్య అని తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శశాంక్ గోయల్, జయేష్ రంజన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు విధి నిర్వహణలో తమ మనోధైర్యాన్ని దెబ్బతీయలేవని స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లాలో ఏర్పాటు చేస్తున్న ఫార్మా కంపెనీ భూసేకరణ ప్రక్రియలో భాగంగా ప్రజాభిప్రాయానికి కలెక్టర్‌తో పాటు ఉద్యోగులు తమ విధి నిర్వహణలో బాగంగా వెళ్లారనీ, అక్కడి ప్రజలతో తమకెలాంటి వివాదం లేదని తెలిపారు. సమస్యలుంటే శాంతి యుతంగా నిరసన తెలి పాలనీ, హింసకు పాల్పడితే పరిష్కారం కావని స్పష్టం చేశారు. అదే సందర్భంలో వికారాబాద్ ఘటనను తాము తీవ్రంగా తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే పలువురు నిందితులను గుర్తించి చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.

కెఎన్ రాజన్ ఆదర్శ కమ్యూనిస్టు

సీపీఐ(ఎం) ఎంపీల కృషికి ఎంతో తోడ్పాటు

- సంకీర్ణ రాజకీయాల కీలక సమయంలో విశేష కృషి
- అధికారులతో మాట్లాడి ప్రజాసమస్యల పరిష్కారం
- సంస్మరణ సభలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు
- కమ్యూనిస్టుల్లేకుంటే దేశానికి భవిష్యత్ ఉందా? : తమ్మినేని



కెఎన్ రాజన్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, చిత్రంలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్లమెంటరీ వ్యవహారాల ఇన్‌చార్జీగా పనిచేసిన కెఎన్ రాజన్ (79) ఆదర్శ కమ్యూనిస్టు అని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. విలువలు, క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేశారని చెప్పారు. ఈనెల నాలుగో తేదీన సికింద్రాబాద్‌లోని బోయగూడలోని స్వగృహంలో అనారోగ్యంతో ఆయన మరణించిన విషయం తెలిసిందే. కెఎన్ రాజన్ సంస్మరణ సభ బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్ చిత్రపటానికి బివి రాఘవులు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, ఆయన భార్య కెఎన్ ఆశాలత, కూతురు షీలా తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. జోహార్ కెఎన్ రాజన్, అమర్ రహే రాజన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం బివి రాఘవులు మాట్లాడుతూ రాజన్ చనిపోయినపుడు ఢిల్లీలో కేంద్ర కమిటీ సమావేశాలు జరిగాయనీ, సంతాపం తెలిపిందని చెప్పారు. బెంగాల్, కేరళలో పార్టీ నాయకులకు ఆయన ఎక్కువ పరిచయమని అన్నారు. వామపక్ష ఉద్యమం కీలక సమయంలో ఆయన సీపీఐ(ఎం) పార్టీలోకి వచ్చారని గుర్తు చేశారు. ఆదినారాయణతో ఉన్న పరిచయంతో బంధుత్వంగా మారిందన్నారు. ఎమర్జెన్సీ తర్వాత పార్టీ అవసరాల రీత్యా ఆయన పార్లమెంటరీ కార్యాలయంలో పనిచేశారని వివరించారు. 1977 నుంచి 2008 వరకు భారత రాజకీయాల్లో ఎంతో కీలకమైందని చెప్పారు. వామపక్షాలు ముఖ్యపాత్ర పోషించాయని అన్నారు. ఏకపార్టీ పాలన పోయి సంకీర్ణ రాజకీయాలు వచ్చాయని చెప్పారు.

ఆ కాలంలో పార్లమెంటరీ కార్యాలయంలో ఆయన పనిచేశారని గుర్తు చేశారు. పార్టీ కార్యాలయంలో పెద్ద నాయకులుంటారనీ, పార్టీ బలోపేతం, సైద్ధాంతిక అంశాలపై చర్చ జరుగుతుందనీ, ప్రజల తాకిడి తక్కువగా ఉంటుందని వివరించారు. పార్లమెంటరీ కార్యాలయంలో గొప్ప నాయకులుంటారనీ, ప్రజా సమస్యలు అక్కడే ప్రస్తావనకు వస్తాయనీ, ప్రజలు కూడా సమస్యల పరిష్కారం కోసం అక్కడికే వస్తారని అన్నారు. ఈ కాలంలో వామపక్ష ఎంపీలు పార్లమెంటులో 20 మంది నుంచి 60 మంది వరకు పనిచేశారని గుర్తు చేశారు. అంత మంది ఎంపీల అవసరాలను తీర్చడం, ప్రజా సమస్యలపై అధికారులతో సంప్రదించడం, పార్లమెంటులో ప్రస్తావించే అంశాలపై డ్రాఫ్టింగ్ తయారు చేయడం వంటి ముఖ్యమైన పనులు నిర్వహించారని చెప్పారు. పార్టీ ఎంపీలు బాగా పనిచేసిన దాని వెనుక రాజన్ కృషి ఎనలేనిదని అన్నారు. ఉద్యమానికి, సమాజానికి, ప్రజలకు ఎంతో సేవ చేశారని వివరించారు.

హిందూత్వ రాజ్య స్థాపనే బీజేపీ లక్ష్యం : తమ్మినేని

కమ్యూనిస్టులకు భవిష్యత్తు ఉందా?అనే చర్చ జరుగుతున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కమ్యూనిస్టుల్లేకుండా దేశానికి భవిష్యత్తు ఉందా?అని ఆయన ప్రశ్నించారు. రాజకీయాలు దిగజారుతున్నాయనీ, బూర్జువా పార్టీలు అవకాశవాదంతో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకుతీసుకుపోవడం అంత సులువు కాదన్నారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు సైద్ధాంతిక పరిష్కారం చూపాలనీ, ఈ సమయంలోనే కమ్యూనిస్టుల అవసరం ఎక్కువగా ఉందని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లౌకికత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నదనీ, కార్పొరేట్లకు సంపదను ధారాదత్తం చేస్తున్నదని చెప్పారు. ఇలాగే కొనసాగితే దేశ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హిందూత్వ రాజ్యాన్ని స్థాపించడమే బీజేపీ లక్ష్యమన్నారు. రాజ్యాంగాన్ని సవరించి మనుధర్మాన్ని అమలు చేయాలని భావిస్తున్నదని విమర్శించారు. కేంద్రంలో బీజేపీకి సీట్లు తగ్గినా, సంకీర్ణ ప్రభుత్వం ఉన్నా కార్పొరేట్ అనుకూల విధానాల అమల్లో దూకుడు తగ్గలేదన్నారు. చంద్రబాబు, నితీశ్ అమరావతి, బీహార్‌కు నిధుల గురించి ఆలోచిస్తున్నారు తప్ప దేశం గురించి ఆలోచించడం లేదని చెప్పారు. రాష్ట్రంలో ప్రజావ్యతిరేకత ప్రారంభమైందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇతర గ్యారంటీలేవీ అమలు కాలేదని అన్నారు. ఫార్మా సంస్థల వల్లే మూసీ కాలుష్యం అవుతున్నదనీ, సీఎం రేవంత్‌రెడ్డి వాటి జోలికి వెళ్లకుండా పేదల ఇండ్లను కూలుస్తున్నారని విమర్శించారు. కమ్యూనిస్టుల ఎజెండాతో ముందుకు రావాలనీ, అప్పుడే భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయం సోషలిజమేనని అన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి మాట్లాడుతూ కెఎన్ రాజన్ ప్రోత్సాహంతోనే ఆశాలత పార్టీ, మహిళా సంఘంలో ఎదిగారని చెప్పారు. ఆయన అంతర్జాతీయ, జాతీయ అంశాలపై లోతైన అధ్యయనం చేసే వారని గుర్తు చేశారు.

ఆయన ఆశయాల సాధన కోసం ముందుకు సాగాలని కోరారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అభ్యుదయ, కమ్యూనిస్టు భావాల పట్ల రాజన్ ఆకర్షితులయ్యారని చెప్పారు. పార్టీ పట్ల నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేశారని అన్నారు. రాజన్ సతీమణి ఆశాలత మాట్లాడుతూ చివరి వరకు సమాజం కోసమే పనిచేస్తానని చెప్పారు. 'నాన్న నాకు స్ఫూర్తి. ఆయన చనిపోయినా ఆయన ఆశయాలు మనతోనే ఉంటాయి.'అనిరాజన్ కూతురు షీలా అన్నారు. సీపీఐ(ఎం) సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీ డాక్టర్ జి మహేందర్, హెచ్‌సీయూ ప్రొఫెసర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

గురువారం 14 నవంబరు 2024
www.navatelangana.com

సంపాదకీయం

ధాన్యం కొనుగోళ్లేవి?



రైతులు ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటలు సకాలంలో అమ్ముడుపోకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే భయమేస్తున్నది.నాలుగు నెలలపాటు కంటికి రెప్పలా కాపాడుకుని నాలుగు పైసలు ఇంటికి తెచ్చుకోవడానికి ఎన్ని వ్యయప్రయాసలు పడాలో ఒక్క రైతులకే తెలుసు. విత్తనాలు వేసే దగ్గర నుంచి పంట కోత వరకు అప్రమత్తంగా లేకపోతే అంతే సంగతులు. వెనుకట ధాన్యం ఇంట్లోని గుమ్మిలో నిండుగా ఉంటే సంక్రాంతి పండుగ ఘనంగా చేసుకునే ఆనవాయితీ. విత్తనాలు నకిలీ, పురుగు మందులు నకిలీ, ఎరువులు నకిలీ, దానిపైనా అలివిగాని యాంత్రీకరణ రైతును కుంగదీస్తున్నది. అంతా బాగుంది అనుకునేలోపే అకాల వర్షాలు పంటలను కబలిస్తున్నాయి. ఇప్పుడు వానాకాలం. దాదాపు 80 శాతం పంటలు పొలాల నుంచి కళ్లాలకు చేరాయి. రాష్ట్రంలో కొన్ని చోట్ల కోతలు ఇప్పటికే పూర్తికాగా, మరి కొన్ని ఇంకా జరుగుతూనే ఉన్నాయి. సాక్షాత్తు కొనుగోళ్ల విషయంలో సర్కారు ఉమ్మడి జిల్లాల వారిగా ఐఏఎస్ అధికారులను నియమించినా పరిస్థితి చక్కబడలేదు. రైతులు కళ్లాలు, మార్కెట్ యార్డుల దగ్గర రోజుల తరబడి వేచిఉండక తప్పని దుస్థితి.

> ధాన్యం కొనలేమంటూ మిల్లర్లు చేతులెత్తేస్తే ఇటు వ్యవసాయ శాఖ, అటు పౌరసరఫరాల శాఖ ఏం చేస్తున్నట్టు ? యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదా? తగినంత మేర యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత సర్కారుదే కదా? ఇప్పటికే పెట్టుబడులందక ప్రయివేటు వడ్డీలు తెచ్చి అష్టకష్టాలు పడుతున్న రైతాంగాన్ని, ఒకవైపు అకాల వర్షాలు, మరోవైపు కొనుగోళ్లల్లో జరుగుతున్న ఆలస్యం నష్టం చేస్తున్న మాట వాస్తవం కాదా?

వరికోతలు పూర్తయినా కొనుగోళ్ల మాత్రం ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కిలా ఉంది. వ్యవసాయాధికారులు నీమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. పంటల కోతల ప్రారంభం నుంచే కొనుగోళ్లకు సన్నాహాలు చేయాల్సిన సర్కారు, అవి దాదాపు పూర్తయినా వేగం పుంజుకోలేదు. దీంతో కళ్లాలు, మార్కెట్ యార్డుల్లో ధాన్యం వానలకు తడిసి ముద్దవుతున్నది. కొన్నిచోట్ల మొలకెత్తే పరిస్థితి. జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియోకాన్ఫరెన్స్ పెట్టినా, పౌర సరఫరాల శాఖతో మంత్రి సమీక్షలు చేసినా పరిస్థితి కొలిక్కి రాలేదు. కళ్లాలు, మార్కెట్ యార్డుల్లో కనీస సౌకర్యాలు లేవు. రైతులకు సర్కారు సరఫరా చేయాల్సిన టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అవసరాలకు అనుగుణంగా అందుబాటులో లేవు. అలాగే ఒక్కసారి రైతు ధాన్యం విక్రయించాక, దాని బాధ్యత ఇక సర్కారుదే. అక్కడి నుంచి రవాణా చేసుకోవాల్సింది అధికారులే.

ధాన్యం కొనలేమంటూ మిల్లర్లు చేతులెత్తేస్తే ఇటు వ్యవసాయ శాఖ, అటు పౌరసరఫరాల శాఖ ఏం చేస్తున్నట్టు? యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదా? తగినంత మేర యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత సర్కారుదే కదా? ఇప్పటికే పెట్టుబడులందక ప్రయివేటు వడ్డీలు తెచ్చి అష్టకష్టాలు పడుతున్న రైతాంగాన్ని, ఒకవైపు అకాల వర్షాలు, మరోవైపు కోనుగోళ్లల్లో జరుగు తున్న ఆలస్యం నష్టం చేస్తున్న మాట వాస్తవం కాదా? మనది వ్యవ సాయ ప్రధానమైన రాష్ట్రమైనా, రైతులు తమ ఉత్పత్తులను అమ్ము కోవడానికి పడే అవస్థలెన్నో. రాష్ట్రంలోని 276 యార్డులున్నాయి. ప్రధాన కేంద్రాలైన వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, జమ్మికుంట, కేసముద్రం, జగిత్యాల, మహబూబాబాద్ తదితర మార్కెట్లో ద్వారా ఏడాదికి రూ.120 కోట్లు వస్తున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అలాగే ఆయా యార్డుల్లో ధాన్యం నిల్వ కోసం గోదాముల్లేవు. స్థలాలు ఉన్నా నిర్మాణం చేపట్టలేదు. గత బీఆర్ఎస్ సర్కారు పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం అదే పరిస్థితిని కొనసాగిస్తుందా? కేవలం 54 యార్డుల్లోనే ఎలక్ట్రానిక్ తరహా విధానం అమలవుతుండటం గమనార్హం. కొన్ని చోట్ల వే బ్రిడ్జిలు లేవు. మరికొన్ని చోట్ల ఉన్నా, అవి పనిచేయవు. కొనుగోలు కేంద్రాలు ఎన్నున్నా, పని జరగకపోతే రైతలకేంటి ప్రయోజనం? తొలిసారిగా 91.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకు న్నామని ప్రభుత్వం గొప్పగా చెబుతున్నది. కానీ ఆచరణేది ?

రైతులు సున్నిత మనస్కులు అంటూనే కొనుగోళ్లకు సరిగ్గా ఏర్పాట్లు చేయకుండా వారి మనస్సును నొప్పిస్తున్నది. పండిన ప్రతి గింజనూ కొంటామంటూనే అందుకు తగ్గట్టుగా సన్నాహాలు చేయకపోవడం దారుణం. గతంలో అవకతవకలకు పాల్పడిన మిల్లర్లకు ధాన్యం ఇచ్చేది లేదని సర్కారు అంటున్నది, మంచిదే. మరి ప్రత్యామ్నాయ ఏర్పాట్లేవి? కేవలం సన్నాలకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తూ, దొడ్డు బియ్యానికి ఇవ్వకపోవడాన్ని రైతులు తప్పుబడుతున్నారు. అక్టోబరు మొదటి వారంనుంచే కొనుగోలు చేస్తామన్న పౌరసరఫరాల శాఖ మంత్రి, ఇప్పటికీ కొనుగోళ్ల వేగాన్ని పెంచడంలో విఫలమయ్యారు. ఇది నిజంగా రైతులను వంచించడమే.

మతోన్మాదుల కుట్రలను ఓడించిన నెహ్రూ



ఎం.వి.ఎస్ శర్మ

మన జాతిపిత గాంధీజీ హత్యకు పన్నిన కుట్ర వెనుక ఆర్ఎస్ఎస్ హస్తం ఉన్న సంగతి అందరికీ తెలిసినదే. ఐనప్పటికీ అదే ఆర్ఎస్ఎస్ నేతలు గాంధీజీ పట్ల ఎంతో భక్తి నటిస్తారు. ఈ నాటకం గురించి కూడా అందరికీ తెలుసు. గాంధీతో బాటు సర్దార్ పటేల్, సుభాష్ చంద్రబోస్, అంబేద్కర్ తదితర జాతీయోద్యమ నాయకుల పట్ల కూడా హిందూత్వ శక్తులు చాలా గౌరవాన్ని నటిస్తూంటారు. కాని ఒక్క జవహర్‌లాల్ నెహ్రూ విషయంలో మాత్రం విపరీతమైన ద్వేషాన్ని వెళ్లగక్కుతూ వుంటారు. చరిత్రలో నెహ్రూకు సంబంధించిన జ్ఞాపకాలు కూడా ఏవీ మిగల కూడదన్నట్టుగా వ్యవహరిస్తూంటారు.

ఇంత విద్వేషాన్ని కలిగి వుండడానికి కారణం ఏమిటి? తామే సిసలైన దేశభక్తులమని రొమ్ములు బాదు కుంటూ చెప్పుకునే హిందూత్వ వాదులకు మూడు దశాబ్దాలపాటు బ్రిటిష్ పాలకులతో పోరాడిన నెహ్రూ పట్ల- అందులో తొమ్మిదేండ్లపాటు బ్రిటిష్ జైళ్లలో మగ్గిన నెహ్రూ పట్ల ఈ ద్వేషం ఎందుకు? ఇది తెలియాలంటే స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలో హిందూ, ముస్లిం మతోన్మాదులు ఆ స్వతంత్రాన్ని వమ్ము చేయడానికి పన్నిన కుట్రలేమిటో తెలియాలి. ఆ కుట్రలను వమ్ము చేసి జాతీయోద్యమ స్ఫూర్తికి అనుగుణంగా లౌకికతత్వాన్ని స్థిరపరచిన నెహ్రూ పాత్ర ఏమిటో తెలియాలి.


భారత దేశానికి స్వాతంత్ర్యం ఇవ్వనున్నట్టు అప్పటి బ్రిటిష్ ప్రధాని అట్లీ 1946 ఆగస్టులో ప్రకటించారు. అప్పటి నుంచీ 1952 వరకూ ఆరేండ్లపాటు హిందూ, ముస్లిం మతోన్మాద శక్తులు, సంస్థలు చేయని దురాగతం అంటూ లేదు.

1946 సెప్టెంబర్‌లో నెహ్రూ ప్రధానిగా ఒక మధ్యంతర ప్రభుత్వం ఏర్పడింది. ఒక నెల తిరక్కుండానే బెంగాల్ ప్రాంతంలోని నవాఖలిలో భారీ ఎత్తున హింసాకాండ చెలరేగింది. ప్రత్యేక పాకిస్తాన్ కావాలన్న డిమాండ్‌తో ముస్లింలీగ్ ప్రత్యక్ష కార్యాచరణకు పిలుపునిచ్చింది (ఈ పిలుపును ఆర్ఎస్ఎస్ ఏనాడూ వ్యతిరేకించలేదు. పైగా హిందువులకు వేరే రాజ్యం కావాలంటూ అదే ద్విజాతి సిద్ధాంతాన్ని బలపరిచింది. మతాలు వేరైనా మతోన్మాదులు మాత్రం ఒకరినొకరు బలపరుచుకుంటూ వుంటారన్నదానికి ఇదే ఉదాహరణ). ముస్లింలీగ్ నాయకత్వంలో నడుస్తున్న బెంగాల్ ప్రొవిన్షియల్ ప్రభుత్వం ఈ అల్లర్లను అణచివేయడానికి ఏ విధమైన శ్రద్ధా కనబరచలేదు. నవాఖలిలో హిందువుల మీద జరిగిన హింసాకాండకు ప్రతీకారంగా అన్నట్టు పొరుగునే ఉన్న బీహార్‌లో పెద్ద ఎత్తున ముస్లింల మీద దాడులు జరిగాయి. ఈ దాడుల వెనుక ఆర్ఎస్ఎస్‌దే ప్రధాన పాత్రఅని వేరే చెప్పనక్కరలేదు.

> ఎన్నికల్లో ప్రజలను నెహ్రూ కోరిన తీర్పు చాలా ప్రధానమైనది. దేశ రాజ్యాంగ స్ఫూర్తిని, మౌలిక సూత్రాలను కాపాడుకోవడమా లేక విద్వేష రాజకీయాలకు దేశాన్ని బలి చేయడమా అన్న ప్రశ్నకు ప్రజలు స్పష్టంగా ఇచ్చిన తీర్పు లౌకిక భారతదేశానికి బలమైన పునాది వేసింది. మతోన్మాదానికి, మత విశ్వాసాలకు సంబంధం లేదని, మత విశ్వాసాలు ప్రాచీనమైనవైతే, మతోన్మాదం ఆధునిక రాజ కీయ పెడధోరణి అని నెహ్రూ స్పష్టం చేశారు. జాతీయోద్యమాన్ని దెబ్బ తీయడానికి సామ్రాజ్యవాద శక్తులు మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తాయని, ఆ మద్దతు అందనినాడు మతోన్మాద శక్తులు పేకమేడల్లా కూలిపోతాయని చెప్పారు. నేడు కూడా మతోన్మాద శక్తులు ప్రపంచంలో వివిధ దేశాల్లో బలంగా ముందుకు రావడం వెనుక కార్పొరేట్ శక్తుల ప్రోద్బలం ఉందన్నది స్పష్టంగానే మనందరికీ కనిపిస్తోంది.

మహాత్ముడు 1946 నవంబర్ 6న స్వయంగా నవాఖలి పర్యటించారు. అప్పటి నుంచీ మత ఘర్షణలు చెలరేగుతున్న ప్రాంతాలన్నింటానాలుగు మాసాలపాటు, 1947 మార్చి 4 వరకూ పర్యటిస్తూనే వున్నారు. కాలినడకన కల్లోలిత ప్రాంత గ్రామాలలో తిరిగారు. నెహ్రూ కూడా నవంబర్ 1946లో బీహార్ అంతా పర్యటించారు. నెహ్రూతో బాటు సర్దార్ పటేల్, రాజేంద్రప్రసాద్, మౌలానా ఆజాద్, ఆచార్య కృప లానీ, జయప్రకాశ్ నారాయణ వంటి ఇతర జాతీయ నేతలందరూ మతోన్మాద ప్రమా దం నుండి దేశాన్ని కాపాడుకోవడానికి రంగంలోకి ప్రత్యక్షంగా దిగారు. దానితో బాటు నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వ నేతగా అధికార యంత్రాంగాన్ని పూర్తిగా రంగం లోకి దించి పరిస్థితిని అదుపు చేయడానికి సర్వ శక్తులనూ ఒడ్డారు. "హిందూ- ముస్లిం ఘర్షణలు జరిగే ప్రదేశంలో నేను ప్రత్యక్షంగా అడ్డుగా నిల బడ తాను. హిందూ, ముస్లిం సోదరులు ఒకరినొకరు చంపుకునే ముందు వాళ్లు నా శవం మీదుగా నడిచిపోవలసిందే" అని నెహ్రూ ప్రకటించారు.

బ్రిటిష్ ప్రభుత్వం మతోన్మాద శక్తులకు ఆజ్యం పోయడానికే అన్నట్టు దేశాన్ని మత ప్రాతిపదికన చీల్చడానికే నిర్ణయించింది.దాని పర్యవసానంగా ఇటు బెంగాల్ నుంచి, అటు పశ్చిమ పంజాబ్ నుంచి శరణార్థులు లక్షలాదిగా భారతదేశంలోకి తల దాచుకోడానికి రాసాగారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో హింసాకాండ చెలరేగింది. 1947 ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో నెహ్రూ "దేశంలో శాంతి, సామ రస్యాలను నెలకొల్పడం ఈ ప్రభుత్వపు మొదటి బాధ్యత. అందుకోసం మతో న్మాద శక్తులను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తాం....దేశం ఏదో ఒక మతం పాలనలో నడవాల నుకోవడం చాలా తప్పు. మన మువ్వన్నెల జెండాకు తలొంచి గౌరవించేవారందరూ, వారే మత విశ్వాసాలను కలిగి వున్నప్పటికీ, ఏ కులానికి చెందినవారైనప్పటికీ, సమాన హక్కులను కలిగి వుంటారు" అని ప్రకటించారు. ఆ వెంటనే నెహ్రూ ఘర్షణలు జరిగిన ప్రాంతాలన్నింటినీ ప్రత్యక్షంగా సందర్శించారు (నేటికీ మణిపూర్‌ను సందర్శించ డానికి సాహసించని మోడీ స్థాయి ఏపాటిదో చూడండి).



> ప్రభుత్వ కార్యకలాపాల్లో, ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు వంటి సందర్భాల్లో మతపరమైన తంతులు ఏవీ ఉండరాదని నెహ్రూ ప్రక టించారు. తాను ఆచ రణలో పాటించారు. వ్యక్తిగత మత విశ్వాసాలను రాజకీయాలలోకి రానివ్వలేదు. ఆ తర్వాత కాలంలో మత విశ్వాసాలను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలనే దుర్గ కాంగ్రెస్ పార్టీతో సహా బూర్జువా పార్టీలన్నింటిలోనూ క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఈ అవకాశవాదమే మతోన్మాద శక్తులకు ఊతమిస్తోంది. భారతదేశ లౌకిక, ప్రజాస్వామ్య పునాదులను, రాజ్యాంగ మౌలిక విలువలను కాపాడు కోవ దానికి నేడు కృషి చేస్తున్నవారదంరికీ నెహ్రూ నిర్వహించిన పాత్ర స్ఫూర్తి దాయ కంగా ఉంటుంది. అందుకే అది మతోన్మాద శక్తులకు కన్నెర్రగా కూడా ఉంటుంది.

కొద్ది కాలంలోనే మత ఘర్షణలు నిలిచిపోయి పరిస్థితి అదుపులోకి వచ్చింది. గాడ్సే ఇంతలోనే మహాత్ముడిని పొట్టన పెట్టు కున్నాడు. "గాంధీజీ హత్య వెనుక ఉన్నది ఒక రిద్దరు వ్యక్తులు మాత్రమే కాదు. ఒక పెద్ద సంస్థ ఉంది" అని నెహ్రూ ప్రకటించారు. 1948 ఫిబ్రవరి 5న రాష్ట్రాల ముఖ్యమంత్రులకు రాసిన లేఖలో దేశంలో వివిధ ప్రాంతాల్లో అనేకమంది ప్రముఖులను హత్యలు చేసి అల్లకల్లోలాన్ని సృష్టించి దేశాన్ని అస్థిరతపాలు చేసి అధికారాన్ని చేజిక్కించు కోవాలనే కుట్ర సాగుతోందంటూ నెహ్రూ హెచ్చరించారు.

ఉప ప్రధాని, హోం శాఖామాత్యులు అయిన సర్దార్‌పటేల్ ఈ కుట్రను ఛేదించడంలో నెహ్రూకు పూర్తి అండదండలిచ్చారు. ఆర్ఎస్ఎస్‌ను నిషేధించారు.

> 1947 ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో నెహ్రూ "దేశంలో శాంతి, సామరస్యాలను నెలకొల్పడం ఈ ప్రభుత్వపు మొదటి బాధ్యత. అందుకోసం మతోన్మాద శక్తులను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తాం....దేశం ఏదో ఒక మతం పాలనలో నడవాలనుకోవడం చాలా తప్పు. మన మువ్వన్నెల జెండాకు తలొంచి గౌరవించేవారందరూ, వారే మత విశ్వాసాలను కలిగివున్నప్పటికీ, ఏ కులానికి చెందినవారైనప్పటికీ, సమాన హక్కులను కలిగి వుంటారు" అని ప్రకటించారు. ఆ వెంటనే నెహ్రూ ఘర్షణలు జరిగిన ప్రాంతాలన్నింటినీ ప్రత్యక్షంగా సందర్శించారు (నేటికీ మణిపూర్‌ను సందర్శించ డానికి సాహసించని మోడీ స్థాయి ఏపాటిదో చూడండి).

25వేల మంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను జైళ్లలో పెట్టారు. 1949లో తమకు, రాజకీయాలకు ఎటు వంటి సంబంధం లేదంటూ ఆర్ఎస్ఎస్ రాతపూర్వకంగా ఇచ్చిన వివరణ తర్వాత ఆర్ఎస్ఎస్ మీద నిషేధాన్ని ఎత్తివేశారు (తమ ఆర్ఎస్ఎస్ మూలాలను మోడీతో సహా అనేకులు బహిరంగంగా ప్రకటించుకోవడం బట్టి ఆనాటి వివరణ ఎంత బూటకమో తేటతెల్లమౌతోంది).

ఆ తర్వాత 1951-52 కాలంలో మొదటి సాధారణ ఎన్నికల పూర్వ రంగంలో నెహ్రూ పోషించిన పాత్ర చాలా కీలకమైనది. "ముస్లిం పాకిస్తాన్"కు ప్రతిగా "హిందూ రాష్ట్ర" నినాదాన్ని మతోన్మాదులు ఈ ఎన్నికలలో ముందుకు తెచ్చారు. దానిని సవాలుగా తీసుకున్న నెహ్రూ జాతీయోద్యమ స్ఫూర్తికి అనుగుణంగా భారతదేశం లౌకిక రాజ్యంగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజలు హిందూ రాష్ట్రను కోరుతున్నారా, లేక లౌకిక భారతాన్ని కోరు తున్నారా తేల్చి చెప్పాలని ఆ ఎన్నికలను దాదాపు ఒక రిఫరెండం మాదిరిగా మార్చారు.

ఆ ఎన్నికలలో దాదాపు 40వే కిలోమీటర్ల మేరకు నెహ్రూ ప్రయాణించారు. సభల్లో నెహ్రూ సుమారు 3 కోట్ల50 లక్షల మందిని ఉద్దేశించి ప్రత్యక్షంగా ప్రసంగించారు. అప్పటి జనాభాలో అది దాదాపు పదో వంతు. హిందూ రాష్ట్ర నినాదాన్ని సమర్ధించిన జనసంఘం, హిందూ మహాసభ, రామరాజ్య పరిషత్ కూటమి మొత్తానికి ఆ ఎన్నికల్లో కేవలం పదే పది సీట్లు దక్కాయి. అప్పటి లోక్ సభ బలం 489. మతోన్మాద కూటమికి కేవలం ఆరు శాతం ఓట్లు మాత్రమే దక్కాయి.

ఎన్నికల్లో ప్రజలను నెహ్రూ కోరిన తీర్పు చాలా ప్రధానమైనది. దేశ రాజ్యాంగ స్ఫూర్తిని, మౌలిక సూత్రాలను కాపాడుకోవడమా లేక విద్వేష రాజకీయాలకు దేశాన్ని బలి చేయడమా అన్న ప్రశ్నకు ప్రజలు స్పష్టంగా ఇచ్చిన తీర్పు లౌకిక భారతదేశానికి బలమైన పునాది వేసింది. మతోన్మాదానికి, మత విశ్వాసాలకు సంబంధం లేదని, మత విశ్వాసాలు ప్రాచీనమైనవైతే, మతోన్మాదం ఆధునిక రాజకీయ పెడధోరణి అని నెహ్రూ స్పష్టం చేశారు. జాతీయోద్యమాన్ని దెబ్బ తీయడానికి సామ్రాజ్యవాద శక్తులు మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తాయని, ఆ మద్దతు అందనినాడు మతోన్మాద శక్తులు పేకమేడల్లా కూలిపోతాయని చెప్పారు. నేడు కూడా మతోన్మాద శక్తులు ప్రపంచంలో వివిధ దేశాల్లో బలంగా ముందుకు రావడం వెనుక కార్పొరేట్ శక్తుల ప్రోద్బలం ఉందన్నది స్పష్టంగానే మనందరికీ కనిపిస్తోంది.

ప్రభుత్వ కార్యకలాపాల్లో, ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు వంటి సందర్భాల్లో మతపరమైన తంతులు ఏవీ ఉండరాదని నెహ్రూ ప్రక టించారు. తాను ఆచరణలో పాటించారు. వ్యక్తిగత మత విశ్వాసాలను రాజకీయాలలోకి రానివ్వలేదు. ఆ తర్వాత కాలంలో మత విశ్వాసాలను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలనే దుర్గ కాంగ్రెస్ పార్టీతో సహా బూర్జువా పార్టీలన్నింటిలోనూ క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఈ అవకాశవాదమే మతోన్మాద శక్తులకు ఊతమిస్తోంది. భారతదేశ లౌకిక, ప్రజాస్వామ్య పునాదులను, రాజ్యాంగ మౌలిక విలువలను కాపాడుకోవడానికి నేడు కృషి చేస్తున్నవారదంరికీ నెహ్రూ నిర్వహించిన పాత్ర స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. అందుకే అది మతోన్మాద శక్తులకు కన్నెర్రగా కూడా ఉంటుంది.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై మోడీ వ్యూహమేంటి?



బి.గంగారావు
9490098792

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై 'చంద్రబాబు-పవన్' కూటమి ప్రభుత్వ వైఖరి రోజుకొక విధంగా మారుతున్నది. ప్రయివేటీకరణ ఉపసంహరించుకు న్నారన్నారు. సొంత గనుల కేటాయిస్తున్నారన్నారు. సెయిల్‌లో విలీనం కోసం కేంద్ర బీజేపీపై ఒత్తిడి చేయడం మానేసి ఆర్థిక ప్యాకేజీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై కార్మికులు పెట్టుకున్న నమ్మకం సన్నగిల్లుతున్నది. రెండోవైపు కేంద్ర బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విధానం నుండి వెనక్కి తగ్గకపోగా కార్మికులపై దాడి ఎక్కుపెట్టింది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో 'చంద్రబాబు-పవన్' ద్వయం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోను ప్రయివేటీకరణ కానివ్వమని, మా కూటమిని గెలిపిస్తే స్టీల్‌ప్లాంట్‌కు సొంత ముడి ఇనుప గనులు కేటాయి స్తామని లేదా సెయిల్‌లో విలీనం చేస్తామని చెప్పారు. కూటమి అధి కారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటింది. ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి పలు మార్లు కేంద్ర స్టీల్‌మంత్రి, ఆర్థికమంత్రి, ప్రధానమంత్రితో చర్చలు జరిపారు. అయినా ఇప్పటివరకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం మాత్రం ప్లాంట్ ప్రయివేటీకరణను ఉపసంహరిస్తున్నట్లు ప్రకటన చేయలేదు. ముఖ్యమంత్రి కూడా దీనిపై ఒత్తిడి చేయటం లేదు. తాజాగా ఆర్థిక ప్యాకేజీని ముందుకు తీసుకొస్తున్నారు. ప్లాంట్ పూర్తి స్థాయిలో నడవాలంటే తప్పని సరిగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాల్సిందే. అప్పుల భారం తగ్గించాల్సిందే. కానీ ప్రయివేటీకరణ ఉపసంహరిస్తున్నాం అనే ప్రకటన చేయకుండా ఆర్థిక ప్యాకేజీనే ముందుకు తీసుకురావటం వల్ల ప్లాంట్ సమస్యకి శాశ్వత పరిష్కారం లభించదు. ప్లాంట్‌కి వచ్చిన సమ స్యలన్నీ ప్రయివేటీకరణ నిర్ణయం వల్లే. ప్రయివేటీకరణ ఉప సంహరిస్తేనే అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వకుండా దాచిపెడుతున్నది.

ఇటీవల చంద్రబాబు స్టీల్‌ప్లాంట్‌పై మాట్లాడిన మాటలు బీజేపీ వాదనలను మరింత బలపర్చేవిగా ఉన్నాయి. గత మూడేళ్ల నుండి బీజేపీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై అనేక విధాలుగా దుష్ప్రచారం చేస్తున్నది. ఇప్పుడు చంద్రబాబు స్టీల్‌ప్లాంట్‌పై వేస్తున్న ప్రశ్నలు, చేస్తున్న వాదనలు ఇలాంటివే. ప్రయివేటు స్టీల్‌ప్లాంట్లకి లాభాలు వస్తుండగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు నష్టాలు వస్తున్నాయి? అప్పులు ఎందుకు పెరుగుతున్నాయి? గతంలో ప్లాంట్ బిఐఎఫ్ఆర్‌కి వెళ్లినప్పుడు ఆర్థిక సహాయం అందించాం! మళ్లీ ఇప్పుడు ఎందుకు ఇవ్వాల్సి వస్తున్నది? ఎంతకాలం ఇలా ఇస్తాం? ప్రతిసారీ సెంటిమెంట్ ముందుకు తీసుకొస్తున్నారు. సెంటిమెంటు ఎంతోకాలం పని చేయదు. ప్లాంట్ సొంత కాళ్లపై నిలబడాలి..అని చంద్రబాబు మాట్లాడారు. ఇవన్నీ ఆయనకు తెలియనివి కావు. ఎందుకు మళ్లీ వీటిని తెరపైకి తెస్తున్నారు? ఎన్నికలకు ముందు ఈ వాదనలు ఎందుకు చేయలేదు? అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పల్లవి ఎందుకెత్తుకున్నారు? వీటిని కావాలనే పథకం ప్రకారం ముఖ్యమంత్రి ముందుకు తీసుకొస్తున్నారు. బీజేపీ కూడా విశాఖ స్టీల్‌ప్లాంట్ నష్టాల్లో కూరుకు పోయిందని, ఇది నష్టాల కంపెనీ అని, దీన్ని ఎంత మాత్రం ప్రభుత్వరంగంలో ఉంచకూడదని ప్రచారం చేసింది. మొత్తంగా ఇది నష్టాల పరిశ్రమ అనే భావన కల్పించాలనే లక్ష్యంతో తెలుగుదేశం కూటమి, కేంద్ర బీజేపీ ప్రభుత్వం కలిసి ఈ వాదనలను ముందుకు తీసుకొస్తున్నాయి.

కేంద్ర, ఏపీ రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు తెస్తున్న వాదనలన్నీ పూర్తిగా దురుద్దేశంతో కూడుకున్నవి. వాస్తవంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ నష్టాల పరిశ్రమ కాదు. ఇప్పటి వరకు మొత్తం రూ.12,900 కోట్ల లాభాలు పొందింది. 2018-19లో కూడా లాభాలు పొందింది. 2021-22లో అయితే అత్యధిక టర్నోవర్‌తో లాభాలు గడించి రికార్డు సృష్టించింది. ఇదే ఏడాది విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్ముతున్నట్లు బీజేపీ ప్రభుత్వం ప్రకటన చేసింది. ఇక్కడినుండి ప్లాంట్‌ను దెబ్బతీసే కుట్రలు ప్రారంభమయ్యాయి. 73 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని వినియోగం లోకి రానివ్వకుండా ఉత్పత్తి పెరుగుదలను అడ్డుకుంది. ఉత్పత్తికి కీలకమైన 3వ బ్లాస్ట్ ఫర్నేస్‌ను అర్ధాంతరంగా మూసేసింది. ముడిసరుకు, వర్కింగ్ క్యాపిటల్ సమస్యని సృష్టించి మరో బ్లాస్ట్ ఫర్నేస్‌ను కూడా మూసేసి ప్లాంట్‌ని నష్టాల్లోకి నెట్టింది.

అప్పులు ఎందుకు పెరిగాయి? సొంత లాభాల రిజర్వు నిధులతో పాటు బ్యాంకుల నుండి మరో రూ.12 వేల కోట్లు అప్పులు తీసుకొని ప్లాంట్‌ని 34 లక్షల టన్నుల నుండి 73 లక్షల టన్నుల సామర్థ్యానికి విస్తరించింది. ఈ విస్తరణ వల్ల అదనంగా 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించబడ్డాయి. అయితే కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రయివేటీకరణ వైఖరి వల్ల పూర్తి సామర్థ్యం వినియోగంలోకి రాలేదు. ఫలితంగా అప్పులు పెరిగాయి.

మరో ముఖ్యమైనది స్టీల్‌ప్లాంట్‌కి సొంత ముడి ఇనుప గనులు లేవు. దేశంలో అన్ని ప్రయివేటు, ప్రభుత్వ పరిశ్రమలకు సొంత ముడి ఇనుప గనులు కేటాయించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించిన తరువాత దేశంలో జరిగిన ప్రయివేటు స్టీల్‌ప్లాంట్లకు కూడా ఇనుప గనులు కేటాయించారు. విశాఖ స్టీల్‌ప్లాంటుకు మాత్రం ముడి ఇనుప గనులు, బొగ్గు గనులు కేటాయించకుండా వివక్షత చూపుతూ వస్తున్నారు. ఫలితంగా స్టీల్‌ప్లాంట్‌పై ఏడాదికి కనీసం రూ.3 వేల కోట్ల అదనపు భారం ముడి ఇనుప గనుల వ్యయం మీదే పడుతున్నది. ప్రతిటన్ను ముడి ఇనుముపై రూ.5వేల నుండి 8 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఫలితంగా ఉత్పత్తి ఖర్చులు పెరిగి స్టీల్‌ప్లాంట్ నష్టాలు చవిచూస్తున్నది. ఈ కఠోర వాస్తవాలన్ని 'తెలుగుదేశం-జనసేన' కూటమి ప్రభుత్వ కండ్లముందు కనిపిస్తున్నవే. కాని కార్మికులు ఎక్కువమంది ఉన్నారని, పని చేయడం లేదని, అందువల్లే నష్టాలు వస్తున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారు.

2000 సంవత్సరంలో ప్లాంట్‌కి కేంద్ర ప్రభుత్వం క్యాపిటల్ రీస్ట్రక్చరింగ్ కింద సహాయం అందించింది. ఏదో దయాదాక్షిణ్యంగా ఇస్తున్నట్టు వీరి ప్రచారం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.2937 కోట్ల సొమ్మును తిరిగి చెల్లించటంతోపాటు ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి పన్నులు, డివిడెండ్ల ద్వారా రూ.58 వేల కోట్లు తిరిగి చెల్లించిన వాస్తవాలను కప్పిపుచ్చి ప్లాంట్‌పై దుష్ప్రచారానికి ఒడిగట్టారు. ఇది ప్రభుత్వ కంపెనీ అని, దీనివల్ల ప్రాంతీయ అభివృద్ధి జరుగుతున్నదని, ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నదనే, ఒక మహా నగరానికి ఆర్థిక జీవనాడిగా ఉందనే వాస్తవాలని ప్రజల నుండి తొలగించటానికి ఈ ప్రచారాన్ని ముందుకు తెస్తున్నారు. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ విలువ రూ. 3 లక్షల కోట్లు పైనే ఉంది. మరో కోటి 20 లక్షల టన్నుల సామర్థ్య విస్తరణకు, 50 వేల మందికి అదనంగా ఉద్యోగాలు కల్పించడానికి అవకాశాలున్నాయి. దేశంలో సముద్ర తీరం, పోర్టు కనెక్టివిటి ఉన్న ఏకైక స్టీల్‌ప్లాంట్ కూడా ఇదొక్కటే. ఇటువంటి శక్తివంతమైన ప్రజాభివృద్ధి స్టీల్‌ప్లాంట్‌ని ధ్వంసం చేయటం దేశద్రోహమే అవుతుంది.



> ప్లాంట్ రక్షణ, ప్యాకేజీ చర్చల పేర చంద్రబాబు-పవన్ కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తున్నది. ఈ వ్యూహంలో ప్రయివేటీకరణ ఉపసంహరణ, సొంత గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనం, అప్పులపై మారటోరియం, నిర్వాసితులకు ఉపాధి, ప్రస్తుతం ఉన్న ఉద్యోగులకు రక్షణ వంటి కీలకమైన చర్యలు మసకబారిపోతున్నాయి. ఈ వ్యూహం విశాఖ స్టీల్ ప్లాంట్ భవిష్యత్తుకి తీవ్ర నష్టం. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బీజేపీపై ఒత్తిడి పెంచి తక్షణం ప్రయివేటీకరణను ఉప సంహరిస్తూ, ప్లాంట్‌ని సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటన చేయించాలి. లేకుంటే నాటి ఉమ్మడి రాష్ట్రంలో 'విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు' అని నినదించింది. జైళ్ల పాలైన యువత త్యాగాలు వృథా అవుతాయి.

ఈ నేపథ్యంలో విశాఖ స్టీల్‌ను సెయిల్‌లో విలీనం చేయటమే శాశ్వత పరిష్కారం. ఇది అందరి డిమాండ్. 'చంద్రబాబు-పవన్'లు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పదేపదే చెబుతూ వచ్చింది కూడా ఇదే. ఎందుకు సెయిల్‌లో విలీనం చేయాలి? స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) అనేది ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సంస్థ. ఈ సంస్థ కింద భారతదేశంలో ప్రభుత్వ స్టీల్ కంపెనీలైన భిలాయి, బొకారో, దుర్గాపూర్, రూర్కెలా, ఇస్కో తదితర అన్ని సెయిల్ కిందే ఉన్నాయి. ఒక్క వైజాగ్ స్టీల్‌ప్లాంట్ మాత్రమే సెయిల్ బయట ఉంది. ప్రారం భంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ కూడా సెయిల్‌లోనే ఉన్నా 1982లో దీనిని సెయిల్ నుండి విడదీశారు. ఆ సందర్భంగా బైలదిల్లాలోని 4, 5 బ్లాక్‌ల ఇనుప గనులు ఇస్తామని, ముడి ఇనుప ఖనిజం నిరంతరాయంగా సరఫరా చేస్తామని అప్పటి కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. సెయిల్‌లో ఉద్యోగులకు ఉన్న సదుపాయాలన్ని విశాఖ స్టీల్‌లో కూడా అమలు చేస్తామనే భరోసా కూడా ఇచ్చారు. కానీ ఇచ్చిన హామీ ప్రకారం సొంత ముడి ఇనుప గనులు కేటాయించలేదు. ఈ పరిస్థితుల్లో తిరిగి సెయిల్‌లో విలీనం చేయటమే సరైన పరిష్కారం. సెయిల్ దగ్గర పెద్ద ఎత్తున ముడి ఇనుప గనులు ఉన్నాయి. దీంతో స్టీల్‌ప్లాంట్‌కి ముడి ఇనుప గనుల సమస్య పరిష్కారం అవుతుంది.

కేంద్ర స్టీల్ సహాయ మంత్రి, ఏపీ బీజేపీకి చెందిన శ్రీనివాసవర్మ కొత్త పల్లవి అందుకున్నారు. సెయిల్‌లో విలీనం చేయటానికి టెక్నికల్ సమస్యలు ఉన్నాయని, 35 శాతం వాటాలు అమ్మబడ్డాయని అంటున్నారు. అంటే సెయిల్‌లో విలీనానికి బీజేపీ అంగీకరించటం లేదని తేలిపోతున్నది. అందువల్లే చంద్రబాబు సెయిల్‌లో విలీనంపై ఒత్తిడి చేయటం లేదని అనుకోవాల్సి వస్తున్నది.ఎన్డీయే సర్కార్ నిలబడి ఉండటానికి ప్రధాన ఊతకర్ర చంద్రబాబే. కార్మికులపై పెద్దఎత్తున దాడి జరుగుతున్నా చప్పుడు చేయడం లేదంటే మోడీసర్కార్‌కు వంతపాడుతున్నట్టేగా.

ప్లాంట్ రక్షణ, ప్యాకేజీ చర్చల పేర చంద్రబాబు-పవన్ కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తున్నది. ఈ వ్యూహంలో ప్రయివేటీకరణ ఉపసంహరణ, సొంత గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనం, అప్పులపై మారటోరియం, నిర్వాసితులకు ఉపాధి, ప్రస్తుతం ఉన్న ఉద్యోగులకు రక్షణ వంటి కీలకమైన చర్యలు మసకబారిపోతున్నాయి. ఈ వ్యూహం విశాఖ స్టీల్ ప్లాంట్ భవిష్యత్తుకి తీవ్ర నష్టం. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బీజేపీపై ఒత్తిడి పెంచి తక్షణం ప్రయివేటీకరణను ఉప సంహరిస్తూ, ప్లాంట్‌ని సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటన చేయించాలి. లేకుంటే నాటి ఉమ్మడి రాష్ట్రంలో 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' అని నినదించింది. జైళ్ల పాలైన యువత త్యాగాలు వృథా అవుతాయి.

మండల స్పెషల్ ఆఫీసర్‌గా గంగాధర్

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లి మండల స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా సహకార అధికారి జీ.గంగాధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కే.నవీన్‌బాబు స్పెషల్ ఆఫీసర్‌గా పని చేశారు. అయన స్థానంలో డీసీవో గంగాధర్ నియమితులైనారు. ఎంపీడీవో సురేందర్, సూపరింటెండెంట్ రమేష్‌లు స్పెషల్ ఆఫీసర్‌కు స్వాగతం పలికారు. అనంతరం సింగరేణి, విశ్వనాథపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వసతలు కల్పించి తప్పనిసరిగా ఓపెన్ చేసి ఉండాలని ఆదేశించారు. కేంద్రాలలో సిబ్బంది లేకుంటే కలెక్టర్‌కు నివేదిక ఇచ్చి చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. స్పెషల్ ఆఫీస వెంట సొసైటీ కార్యదర్శి బొల్లు హన్మంతరావు, ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, సీసీలు చైతన్య, సొందు, గౌసియా తదితరులు ఉన్నారు.

నీటిని నిలుపుదల చేసి..వరి పంటలను కాపాడాలి

అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలి : రైతుల డిమాండ్

నవతెలంగాణ-ఎర్రుపాలెం



కట్లేరు ప్రాజెక్టు కుడి కాలువ గేట్లు సరిగా పనిచేయకపోవడం వలన నీరు లీకేజై కోతకు వచ్చిన వరి పంట పొలాలలో నీళ్ల నిలిచాయని రైతులు ఆగ్రహిస్తున్నారు. ఎర్రుపాలెం మండలంలో గల కట్టలేరు ప్రాజెక్టు గేట్లు మరమ్మతులు చేయకపోవడం వలన గేట్లు నుండి కట్లేరు ప్రాజెక్ట్ లో గల నీళ్ల లీకేజీ అవుతున్నాయని లీకేజీ అయిన నీళ్ల కాలువల ద్వారా పంట పొలాలలోకి చేరుతున్నాయని రైతులు తెలిపారు. ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట కోత కోయడానికి సిద్ధమవుతున్న తరుణంలో పంట పొలాలలో నీళ్ల నిలువ ఉండటం వలన వరి పంట కోత కోయటానికి వీలు కావడం లేదని తెలిపారు. కట్లేరు ప్రాజెక్టు గేట్లు మరమ్మతులు చేసి లీక్ అవుతున్న నీటిని నిలుపుదల చేసి వరి పంట కోసుకోవటానికి అనుకూలమైన పరిస్థితిని కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి నీళ్ల లీకేజీని నిలుపుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

అమరవీరుల ఆశయ సాధన కోసం కృషి చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముత్తగూడెం గ్రామంలో అమరజీవి చిన్న మొలకయ్య 39 వర్ధంతిని బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా మొలకయ్య స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేల్పుల జానయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. పార్టీ ఎదుగుదలలో అగ్రభాగాన నిలిచి పనిచేస్తుంటే ఓర్వలేని కొంతమంది రివిజనిస్టులు దారి కాచి పథకం ప్రకారం మొలకయ్యను హత్య చేయడం దారుణమన్నారు. మొలకయ్య ఆశయ సాధన కొరకు ముత్తగూడెం యువత కృషి చేయాలని కోరారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు, వర్గ పోరాటాలు నిర్వహించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శించారు. ఈ వర్ధంతి సభలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు నందిగామ కృష్ణ, మండల నాయకులు ఏటుకూరి ప్రసాదరావు, వడ్లమూడి నాగేశ్వరరావు, చామకూరి రవీందర్, తోట పెద్ద వెంకటరెడ్డి, అర్వపల్లి శ్రీను, రామయ్య, పున్నం సంగయ్య, చిన్న రాములు, పాపయ్య రామలింగం, మల్లయ్య, వెంకన్న భూషయ్య, వెంకట రాములు, అశోక్ మనోహర్, యాదగిరి, రామయ్య లాలయ్య తదితరులు పాల్గొన్నారు.



క్రీడలతో మానసికోల్లాసం

కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తుంబుర దయాకర్ రెడ్డి

నవతెలంగాణ-నేలకొండపల్లి

గ్రామీణ స్థాయి క్రీడలు ప్రతి ఒక్కరిలో మానసిక ఉల్లాసాన్ని, వికాసాన్ని కలిగిస్తాయని, ఆత్మవిశ్వాసాన్ని, శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ తుంబుర దయాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రాజేశ్వరపురం గ్రామంలో కార్తీక పౌర్ణమి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తెలుగు రాష్ట్రాల స్థాయి మహిళా కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. తొలుత కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకొని కబడ్డీ కబడ్డీ అంటూ ఆడుతూ క్రీడాకారులను, ప్రేక్షకులను ఉత్సాహపరిచారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి క్రీడలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. రాజేశ్వరపురం గ్రామానికి చెందిన పెద్దలు, యువత, నాయకులు ప్రతి ఏటా కార్తీకమాస పౌర్ణమి సందర్భంగా క్రీడలు, ఇతర సాంస్కృతిక పోటీలను ఆనవాయితీగా నిర్వహించడం అభినందనీయమన్నారు. నేడు గ్రామీణ స్థాయి కబడ్డీ క్రీడ ప్రో కబడ్డీ పేరుతో ప్రపంచవ్యాప్తంగా మరింత ఆదరణ పొందుతుందన్నారు. తెలుగు రాష్ట్రాల నుండి గ్రామీణ స్థాయి క్రీడలను ప్రోత్సహించడం ద్వారా ఒలంపిక్ స్థాయి వరకు క్రీడాకారులు ఎదిగేందుకు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. తద్వారా తెలుగు రాష్ట్రాల కీర్తి ప్రతిష్టలను ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పేందుకు గ్రామీణ స్థాయి క్రీడలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు, మామిడి వెంకన్న, ఎనికే జానకి రామయ్య ఎలమద్ది వెంకటేశ్వర్లు, ఎలమద్ది లెనిన్, కడియాల శ్రీనివాసరావు, బొడ్డు బొందయ్య, బచ్చలకూరి నాగరాజు, కొర్లకుంట నాగేశ్వరరావు, దండా నరసింహారావు, ఎస్కే సొందుమియా, దండ నవీన్, తాటికొండ రవి, బీస్ వీరయ్య వీరవెల్లి నాగరాజు, దంతాల రవి తదితరులు పాల్గొన్నారు.



ఎఫ్‌సీఐ నిబంధనలు ప్రకారమే ధాన్యం కొనుగోలు చేయండి

- కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీసిన జెడిఏ

నవతెలంగాణ-కల్లూరు

ఎఫ్‌సిఐ నిబంధన ప్రకారమే ధాన్యం కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి డి.పుల్లయ్య కొనుగోలు నిర్వహణ ఇన్చార్జిని ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని కొర్లగూడెం గ్రామంలోని ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్నం, దొడ్డు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో అన్ని సౌకర్యాలు ఉన్నాయయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. సన్న రకం ధాన్యాన్ని పరిశీలించే యంత్రాన్ని పరిశీలించారు. అదే విధంగా దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా పరిశీలించారు. ధాన్యంలో తేమ శాతాన్ని చూశారు. నిబంధనలు ప్రకారం ధాన్యం ఉండటంతో వెంటనే కొనుగోలు ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం ఏడిఏ వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ అధికారి ఎం.రూప, ఏపీఎం వెంకట్రామారావుతో కలసి పేరువంచ, ముగ్గు వెంకటాపురం, గోకవరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి గురువారం నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని కొనుగోలు కేంద్ర ఇన్చార్జీలను ఆదేశించారు.

కుక్కలు, కోతుల బెడద నుండి కాపాడండి

నవతెలంగాణ -కూసుమంచి



పోచారం గ్రామంలో కుక్కలు, కోతుల బెడద బీభత్సం సృష్టిస్తున్నాయి. వీటి నుండి ప్రజలను, పంటలను కాపాడాలని కోరుతూ పోచారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి బుధవారం సిపిఎం గ్రామ శాఖ తరపున వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోచారం సిపిఎం గ్రామశాఖ కార్యదర్శి రెడ్డిమల్ల వెంకటయ్య, శాఖ సభ్యులు తాటికొండ నరేందర్‌రెడ్డి, ఇరుగు రంగ, కుక్క పుల్లయ్య, మునారి, సుదీప్ తదితరులు పాల్గొన్నారు

'తెల్లబంగారు' లోకంలో 'తేమ' తిప్పలు

12కు మించి ఒక్కశాతం అదనంగా ఉన్నా సీసీఐ కొర్రీలు

- కొనుగోలు చేశాక కూడా తేమలో వ్యత్యాసం వచ్చిందని తిరకాసు
- ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్న పత్తి రైతులు
- క్వింటాల్‌కు రూ.1500కు పైగా తగ్గించి 'ప్రైవేట్' కొనుగోళ్లు
- గింజ పూర్తిగా డ్రై అయినా అధిక వర్షాలతో తగ్గని తేమ శాతం
- దిగుబడి పైనా వానల ప్రభావం... ఎకరానికి ఐదారు క్వింటాళ్లే..!

"పత్తి పంటను తెల్లబంగారంగా పిలుచుకుంటాం. కానీ అధిక వర్షాలకు తోడు సీసీఐ కొనుగోళ్లలో 'తేమ' కొర్రీలతో తెల్లబంగారు లోకంలో పత్తి రైతు తెల్లబోయే దుస్థితులు వచ్చాయి. భారత పత్తి సంస్థ (సీసీఐ) క్వింటాలుకు రూ.7,521 మద్దతు ధర ప్రకటించినా ఏ ఒక్క రైతూ గిట్టుబాటు ధర పొందలేకపోతున్నారు. ప్రయివేటుగా రూ.ఐదారు వేలకే అమ్ముకోవాల్సి వస్తోంది."

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంట అధిక వర్షాలతో దిగుబడి సరిగా రాక పోగా 'అమ్మబోతే అడవి' చందంగా మారింది. తేమ పేరుతో కొనుగోళ్లలో భారత పత్తి సంస్థ (సీసీఐ) పెడుతున్న కొర్రీలతో రైతులు అరకొర ధరకు ప్రయివేటు వ్యాపారులకు విక్రయించాల్సి వస్తోంది. ఎకరానికి రూ.12వేలకు పైగా ఖర్చు పెట్టి సాగు చేసిన పత్తిలో దిగుబడులు గణనీయంగా క్షీణించాయి. ఎకరానికి 12 క్వింటాళ్ల వరకు రావాల్సింది ఐదారుకు మించి రావడం లేదు. ఆశించిన ధర వస్తుందేమోనని రైతులు ఆశపడితే సీసీఐ నిబంధనలు, అధికారుల తీరుతో అదీ కూడా దక్కేలా లేదు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా రైతులు జిన్నింగ్ మిల్లుల వద్ద ఆందోళనలు నిర్వహించారు.

అధిక వర్షాలతో అధికంగా తేమశాతం...

అధిక వర్షాలతో పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. గింజ పూర్తిగా డ్రై అయ్యేలా ఆరబెట్టినా సీసీఐ నిబంధనలకు లోబడి ఉండటం లేదు. సీసీఐ 8-12 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తుంది. 8శాతం తేమ ఉంటే రూ.7,501, 9 శాతం ఉంటే క్వింటాల్‌కు రూ.75 తక్కువగా, 10శాతం ఉంటే రూ.150, 11శాతం ఉంటే రూ.225, 12 శాతం ఉంటే రూ.300 తక్కువగా రైతు బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. అయితే 12 శాతం కంటే ఒక్క శాతం తేమ ఎక్కువ ఉన్నా ఆ పత్తిని కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. రోజుకు ఒక్కో సీసీఐ కేంద్రం (జిన్నింగ్ మిల్లు) వద్దకు 50 బండ్ల దాకా వస్తే మూడు, నాలుగు ట్రాలీ ఆటోలకు మించి తేమ పరీక్షలో పాస్ కావడం లేదు.

తేమశాతంలో కొర్రీలు...

సీసీఐకి పత్తి విక్రయించే సమయంలో విపరీతంగా కొర్రీలు పెడుతున్నారు. 12 శాతం లోపు ఉన్న పత్తిని కొనుగోలు చేయాలి. కానీ 11 శాతం వచ్చినా కూడా తిరకాసు పెడుతున్నారు. ఒక చోట 11 శాతం వస్తే మరో చోట పరీక్షిస్తున్నారు. అలా ఐదు చోట్ల పరీక్షించి...ఎక్కువ సార్లు 12 శాతం లోపు వస్తే సగటు కట్టి తేమశాతాన్ని నిర్ధారిస్తున్నారు. అయినప్పటికీ తేమశాతం నిబంధనలకు లోబడే వచ్చినా 12 శాతానికి పైగా వచ్చిందని కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. సరేలే అని వ్యవసాయ మార్కెట్లలో అమ్ముకుందామంటే...అక్కడి వ్యాపారులు అరకొర ధరకు కొనుగోలు చేస్తున్నారు. రూ.6వేల నుంచి రూ.6,500 ధరకే కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత పేరుతో ఇక్కడ కూడా ధరలు తగ్గిస్తున్నారు. బయట వ్యాపారులకు అమ్ముకుంటే మరో రూ.ఐదారు వందలు కోత విధిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

గింజ కరకర అంటున్నా తేమే ఉందంటున్నారు...



ఈ ఫొటోలోని కొత్తపల్లి జైపాల్‌రెడ్డిది ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బీరోలు. మొత్తం 15 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. క్వింటాకు రూ.1,300 ఖర్చులిచ్చి పత్తి తీయించాడు. మండలంలోని పాతర్లపాడు వద్ద ఉన్న జిన్నింగ్ మిల్లు సీసీఐ కేంద్రానికి ట్రాక్టర్‌లో పత్తి తీసుకెళ్లాడు. అక్కడికి వెళ్లాక ఐదు చోట్ల పరీక్షించి తేమశాతం 12కంటే ఎక్కువగా ఉందని తిరస్కరించి పంపారు. గత సంవత్సరం తేమ పేరుతో ఐదు కేజీలు తరుగు తీస్తే...ఈ ఏడాది తేమశాతం పెరిగిందని తిరకాసు పెడుతున్నారని సదరు రైతు వాపోతున్నారు. ప్రయివేటుగా అమ్ముదామంటే క్వింటాల్ రూ.5,700- 6,100 మధ్యే కొనుగోలు చేస్తున్నారని వాపోతూ రైతు సరుకుతో ఇంటికి చేరారు. నోట్లో గింజలు వేసుకొని పరీక్షిస్తే కరకరమంటున్నా తేమ అధికంగా ఉందంటున్నారని రైతు వాపోతున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేది ఎర్రజెండా మాత్రమే

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ- ఖమ్మం కార్పొరేషన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నికరంగా పోరాడుతున్నది సీపీఐ(ఎం) మాత్రమే అని, మతోన్మాద, కార్పొరేట్ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా, నిరుద్యోగం, ఆర్థిక దోపిడీ, ధరల పెరుగుదల, మతోన్మాద ప్రమాదాల నుండి ఈ దేశాన్ని పరిరక్షించాలని జాతీయ సమైక్యత, సమగ్రతల పరిరక్షణలో సీపీఐ(ఎం) ముందు భాగంలో ఉంటుందని, ఎర్రసైనికుల్లాగా ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్నది కమ్యూనిస్టులేనని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం 3 టౌన్ పార్టీ కార్యకర్తల జనరల్ బాడీ సమావేశం 31వ డివిజన్ కార్పొరేటర్ ఎర్ర గోపి అధ్యక్షతన స్థానిక గుమస్తాల సంఘ భవనంలో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో నున్నా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సాగునీరు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని, పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, ఖమ్మం మున్నేరు వరద బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) కోరుతోందన్నారు. నిరంతరం ప్రజా ఉద్యమాల కోసం పనిచేస్తున్న పార్టీ సీపీఐ(ఎం) మాత్రమే అన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శులకు సభ్యులు వై విక్రం, జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, త్రీ టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు, పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు వజేనపల్లి శ్రీనివాసరావు, ఎస్కే సైదులు, వెల్లంపల్లి వెంకట్రావు, పత్తిపాక నాగ సులోచన, శీలం వీరబాబు, ఎస్.కె ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన స్పెషల్ ఆఫీసర్

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ జిల్లా సహకార అధికారి జీ.గంగాధర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని, దానికి వాడుతున్న సరుకులు, బియ్యంను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతులకు హాజరైన విద్యార్థులు, మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థుల సంఖ్యను పరిశీలించారు. భోజన నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రేమతో భోజనం అందించాలని మధ్యాహ్న భోజన వర్కర్లకు సూచించారు. ఆయన వెంట హెచ్ఎం కే.శ్రీనివాసరావు, సొసైటీ కార్యదర్శి బొల్లు హన్మంతరావు, విద్యాశాఖ అధికారులు వీ.మోతీలాల్, బీ.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు
రబీ సాగు నీరు అందించాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ- వైరా

వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు రబీ సాగు నీరు అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. బుధవారం వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ , జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాల దుర్గాప్రసాద్, ఇరిగేషన్ అధికారులు ఈఈ బాబురావు,డిఈ శ్రీనివాసరావు, డివిజనల్ వ్యవసాయ అధికారి తుమ్మల పల్లి కరుణ శ్రీ, రైతు ప్రతినిధుల సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్లో వైరా ప్రాజెక్టులో సాగునీరు అందుబాటులో లేక ఆయకట్టు పరిధిలో ఐదు వేల ఎకరాల్లో పంట ఎండిపోయిందని అన్నారు. గత రబీ సీజన్లోనూ పంటలు సాగు చేయలేదని, ఈ ఖరీఫ్ సీజన్లో అధిక వర్షాలు, తెగుళ్ల మూలంగా వరి దిగుబడి తగ్గిపోయిందని అన్నారు. పత్తి, ఇతర వాణిజ్య పంటలు కూడా ఆశాజనకంగా లేని సందర్భంలో రబీ సీజన్లో సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గత పది సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న రెండో విడత ఆధునీకరణ పనుల నిధులు 42 కోట్ల రూపాయలు మంజూరు చేయటం అభినందనీయమని, ప్రాజెక్ట్ ఆధునికరణ పనులు మార్చి చివరి నుంచి ప్రారంభించాలని, రెండో పంటకు ఆయకట్టు పరిధిలో సాగుభూమికి సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు .రైతులకు గత రెండు సంవత్సరాల నుంచి పంటలు సరిగా లేక ఆర్థికంగా స్థితికి పోయి ఉన్నారని అన్నారు. సీతారామ ప్రాజెక్టు నీళ్ల కూడా వచ్చే అవకాశం ఉనందున, సాగర్ నిండు కుండ లాగా ఉన్న దశలో రెండో పంటకు కచ్చితంగా అవకాశం ఇవ్వాలని రైతులందరూ కోరుతున్నారని అన్నారు. సమావేశంలో .రైతు సంఘం నాయకులు పైడిపల్లి సాంబశివరావు, పారుపల్లి కృష్ణారావు, మేడా శరబంధి, రుద్రాక్షల వెంకటయ్య వడ్లమూడి మధు, ఏదుల పుల్లయ్య రుద్రాక్షల మురళీ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం జాబితాలో మిస్ అయిన రైతులకు పరిహారం అందించాలని వైరా శాసన సభ్యులు మాలోతు రాందాస్ నాయక్‌కు తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో విప్పలమడక, గన్నవరం రైతులు వినతి పత్రం అందజేశారు, వరద నీరుతో పంటలు కొట్టుకుపోయిన పంట పొలాలకు పరిహారం రాలేదని వివరించారు.



ఆర్ఓబి బ్రిడ్జి వరమా? శాపమా?

- పాత బోనకల్ రైల్వే గేటు వద్ద మెట్లు, బ్రిడ్జిపై సెంట్రల్ లైటింగ్, శ్రీ దుర్గా పిక్చర్ ప్యాలెస్ వద్ద రింగు ఏర్పాటు చేయాలి
- దశాబ్ద కాలం నుంచి మండల ప్రజలు పోరాటం...
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కరుణించేనా?

నవతెలంగాణ - బోనకల్



బ్రిడ్జికి మెట్లు ఏర్పాటు చేయవలసిన స్థలం

మండల కేంద్రంలో 2014లో నిర్మించిన ఆర్‌ఓబి బ్రిడ్జి మండల ప్రజలకు వరమా? శాపమా? అనే ప్రశ్న ప్రతి ఒక్కరి నుంచి వినిపిస్తుంది. వైరా-జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై బోనకల్ మండల కేంద్రంలో ఆనాడు బోనకల్ రైల్వే గేటు ఉంది. ఈ రైల్వే గేటు వలన నిత్యం రవాణాకు తీవ్ర ఆటంకం కలుగుతుందని ఆనాడు మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు, వాహనదారులు బోనకల్ పాత రైల్వే గేటు వద్ద ఆర్‌ఓబి బ్రిడ్జి నిర్మించాలని కోరారు. దీంతో రైల్వే గేట్ బాధలు తీరిపోతాయని మండల ప్రజలందరూ భావించారు. కానీ ఆర్‌ఓబి బ్రిడ్జి నిర్మించిన తర్వాత రైల్వే గేటు కంటే ఎక్కువ బాధలు అనుభవించవలసి వస్తుందని మండల ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌ఓబి బ్రిడ్జి నిర్మించడంతో బోనకల్ పాత రైల్వే గేట్ నుంచి రాకపోకలను రైల్వే అధికారులు పూర్తిగా నిలిపివేశారు. పాత బోనకల్ రైల్వే గేట్‌కి దక్షిణం వైపు కేవలం నాలుగు గ్రామాలు మాత్రమే ఉన్నాయి. మిగిలిన 18 గ్రామాలు రైల్వే గేట్‌కి ఉత్తరం వైపు ఉన్నాయి. మండల కేంద్రానికి వివిధ రకాల పనులు కోసం వచ్చిన ప్రజలు, వాహనదారులు బ్రిడ్జి పైనుంచి వాహనాల ద్వారానే రావాల్సి ఉంది. పోలీస్ స్టేషన్, మండల విద్యుత్ కార్యాలయంకు ప్రజలు వెళ్లాలంటే మండల కేంద్రము నుంచి సుమారు రెండు కిలోమీటర్లు దూరం వెళ్ళాలి. అదే కాలినడకన అయితే అరకిలో మీటర్ దూరం కూడా ఉండదు. అదే విధంగా మిగిలిన ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలన్న ఇదే పరిస్థితి. పాత రైల్వే గేటు వద్ద మెట్లు ఏర్పాటు చేయటం వలన ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీని వలన ప్రజలు బ్రిడ్జి మీద నుంచి కిందకు కింద నుంచి పైకి వెళ్లి తేలికగా అవతల వైపు వెళ్లటానికి ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. బ్రిడ్జికి మెట్లు ఏర్పాటు చేయాలని బ్రిడ్జి ప్రారంభం నుంచి మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు, ప్రయాణికులు ప్రభుత్వాన్ని కోరుతూనే ఉన్నారు. అయినా దశాబ్దం నుంచి పాలకులు, ఉన్నతాధికారులు కరుణించడం లేదు. ఇది ఇలా ఉండగా ఆర్‌ఓబి బ్రిడ్జి సుమారు కిలోమీటరన్నర దూరం ఉంది. కానీ బ్రిడ్జికి సెంట్రల్ లైటింగ్ లేదు. మండల కేంద్రానికి ప్రధానంగా రావినూతల, బోనకల్ గ్రామాల నుంచి రాత్రి సమయంలో పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. సెంట్రల్ లైటింగ్ లేకపోవటం వలన పాదచారులు చీకట్లోనే నడుచుకుంటూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్‌ఓబి బ్రిడ్జి నిర్మించిన మిగతా ప్రాంతాలలో ప్రతి చోట సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. కానీ బోనకల్లు మండల కేంద్రంలో నిర్మించిన ఆర్‌ఓబి బ్రిడ్జికి మాత్రం సెంట్రల్ రైటింగ్ ఏర్పాటు చేయలేదు. అదే విధంగా బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నుంచి ఆర్‌ఓబి బ్రిడ్జి ఎక్కవలసి ఉంది. అదే విధంగా అక్కడ నుంచే బోనకల్ నుంచి ఆళ్లపాడు రోడ్డు ఉంది. ఆళ్లపాడు నుంచి వైరా జగ్గయ్యపేట ప్రధాన రహదారి పైకి వచ్చే సమయంలో, బ్రిడ్జి నుంచి భారీ వాహనాలు జగ్గయ్యపేట వైపు వెళ్లే సమయంలో బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద తరుసు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొంతమంది మృత్యువాత కూడా పడ్డారు. ఇటీవల ఓ వృద్ధుడు కూడా మృత్యువాత పడ్డాడు. శ్రీ దుర్గా పిక్చర్ ప్యాలెస్ వద్ద రింగు ఏర్పాటు చేయటం వలన ప్రమాదాలను నివారించవచ్చునని మండల ప్రజలు అంటున్నారు. ఈ ప్రమాదాలను నివారించాలంటే ఏకైక మార్గం రింగు ఏర్పాటు మాత్రమేనని అంటున్నారు. బోనకల్ ప్రజలతో పాటు మండల ప్రజల కూడా సుమారు ఒక దశాబ్దం నుంచి ప్రభుత్వాలను కోరుతూనే ఉన్నారు. సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు కూడా వినతిపత్రాలు అందజేశారు. అయినా స్పందించిన వారు లేరు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం, అందులో మధిర ఎమ్మెల్యే డిప్యూటీ సీఎంగా ఉండటంతో ఈ ఆర్‌ఓబి బ్రిడ్జికి మహర్దశ పడుతుందని మండల ప్రజలు ఎంతో ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల బోనకల్ - ఆళ్లపాడు రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేసిన సమయంలో మండల మాజీ ప్రజా ప్రతినిధులు, సిపిఎం, సిపిఐ నాయకులు భట్టి విక్రమార్కను కలిసి ఆర్వోబి బ్రిడ్జికి సెంట్రల్ లైటింగ్, పాత రైల్వే గేటు వద్ద మెట్లు, శ్రీ దుర్గా పిక్చర ప్యాలెస్ వద్ద రింగు ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు అందజేశారు. అయితే ఆయన సానుకూలంగా స్పందించారని సిపిఎం, సిపిఐ నాయకులు తెలిపారు. త్వరలోనే ఈ పనులకు కూడా మోక్షం లభిస్తుందని వామపక్ష నాయకులు, మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అవసరమైతే మండల ప్రజలను సమీకరించి మండల కేంద్రంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని వామపక్ష నాయకులు అంటున్నారు.



రింగ్ ఏర్పాటు చేయవలసిన సినిమా హాల్ సెంటర్

విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలి

- మండల విద్యాశాఖ అధికారి నక్కా రాజేశ్వరరావు
- 'నాస్'పై ఉపాధ్యాయులకు అవగాహన ప్రోగ్రాం

నవతెలంగాణ-సత్తుపల్లి

విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు విశేష కృషి జరపాలని మండల విద్యాశాఖ అధికారి నక్కా రాజేశ్వరరావు కోరారు. బుధవారం స్థానిక జ్యోతి నిలయం పాఠశాలలో మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నేషనల్ ఎచ్యూవ్‌మెంట్ సర్వే (జాతీయ సాధన సర్వే) అంశంపై ఉపాధ్యాయులతో ఎంఈవో నక్కా మాట్లాడారు. డిసెంబరు 4న 3, 6, 9 తరగతుల విద్యార్థులకు జరగబోయే నాస్ పరీక్షలో మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ ఇవ్వాలని ఎంఈవో కోరారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రవికుమార్ నాస్ పరీక్ష ఫలితాల ఆవశ్యకతను ఉపాధ్యాయులకు వివరించారు. నాస్ పరీక్షలో జిల్లా అగ్రస్థానంలో నిలిపేల ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన కోరారు. నాస్ అంశపై రిసోర్స్ పర్సన్స్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

విశ్వధర్మక్షేత్రంలో కార్తీక పౌర్ణమి పూజలు



నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామంలో శ్రీ విశ్వధర్మక్షేత్రం యందు, అన్నపూర్ణ సహిత మోక్షరుద్రేశ్వర స్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ప్రతిష్ఠించిన మరకత శివలింగమునకు ది.2-11-2024 శనివారం నుండి 1-12-2024 ఆదివారం వరకు కార్తీక మాసాన్ని పునస్కరించుకొని ప్రతిరోజు అభిషేకములతో పాటు నిత్య గోత్ర నామార్చనలు, నిత్య రుద్రాభిషేకాలు రుద్ర హెూమములు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా కార్తీక పౌర్ణమి రోజు 15 - 11 - 24 శుక్రవారం లక్ష దీపోత్సవం జ్వాలాతోరణం స్వామివారికి కళ్యాణ మహెూత్సవం చేస్తున్నట్లు తెలిపారు. ఇది దామోదర మాసం, కనుక దామోదర అనే స్మరణ చేయాలి. సూర్యాస్తమయానికి ముందుగా ఆకాశ దీపం పెట్టే దీపం, హృదయాకాశంలో వెలిగే జ్యోతికి ప్రతీక. దీనిని ఆలయంలోనే కాక ఇంటిలోనూ వెలిగించుకువచ్చు. శివాభిషేకం అన్ని దోషాలను, పోగొట్టి, సకల శుభాలను ప్రసాదిస్తుందని నమ్మకం. ఈ కార్తీకమాసంలో భక్తులు శ్రీ విశ్వధర్మ క్షేత్రంలో, ప్రతి నిత్యం అన్నపూర్ణేశ్వరి సహిత మోక్ష రుద్రేశ్వర స్వామివారి సందర్శించి విశేషంగా పూజా కైంకర్యాలలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు అందుకోని స్వామి వారి ఆశీస్సులు అందుకోవాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఎస్‌బీఐ ఇన్‌చార్జి మేనేజర్ సాయి సురేష్



నవతెలంగాణ-బోనకల్

స్కూటీపై విధులకు వస్తు రోడ్డు ప్రమాదంలో ఓ బ్యాంక్ ఇన్చార్జి మేనేజర్ తీవ్రంగా గాయపడిన సంఘటన మండల పరిధిలోనే ముష్టికుంట్ల బీబీసీ కాల్వ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గల ఎస్బిఐ మేనేజర్ మధుకర్ బ్యాంకు విధులలో భాగంగా ఉన్నతాధికారులు మరోచోటకి ఇన్చార్జిగా పంపించారు. మధుకర్ స్థానంలో ఖమ్మంనకు చెందిన కే.సాయి సురేష్ ను ఇన్చార్జి మేనేజర్‌గా కేవలం మూడు రోజుల కోసం నియమించారు. 14వ తేదీతో ఇన్‌చార్జి బాధ్యతలు ముగుస్తాయి. ఈ క్రమంలో కే.సాయి సురేష్ ఖమ్మం నుంచి తన స్కూటీపై బోనకల్ బయలుదేరాడు. ముష్టికుంట్ల- బోనకల్ మధ్య బీబీసీ కాల్వ సమీపంలో టాటా ఏసీ వాహనం మరో వాహనాన్ని క్రాస్ చేస్తూ స్కూటీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కే.సాయి సురేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లారు. తీవ్ర గాయాలు పాలైన సాయి సురేష్ ని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బ్యాంకు సహచర ఉద్యోగులు ఓ ప్రైవేటు వాహనంలో ఖమ్మంలోనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ముఖానికి, తలకు బలమైన గాయాలు అయినప్పటికీ ప్రాణాప్రాయం లేదని డాక్టర్లు తెలిపినట్లు తెలిసింది. ప్రమాదానిక కారణమైన టాటా ఏసీ ని పోలీస్ స్టేషన్కు తరలించారు.



ట్రెజరీ అధికారులకు యూటీఎఫ్ ధన్యవాదాలు

నవతెలంగాణ-మధిర

సబ్ ట్రెజరీ అధికారి కార్యాలయం మధిర పరిధిలోని మధిర, ఎర్రుపాలెం, బోనకల్లు మండలాల నుండి నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులకు ఎంప్లాయ్ ఐడి నెంబర్, ప్రాన్ నెంబర్‌లు త్వరితగతిన అందించిన అధికారులకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి ఆధ్వర్యంలో మంగళ వారం టీఎస్ యుటిఎఫ్ నాయకులు ప్రత్యక్షంగా కలసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ట్రెజరీ ఐడి మరియు ప్రాన్ ఇప్పించుటలో మధిర సబ్ ట్రెజరీ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, సిబ్బంది రజినీకాంత్, సౌజన్య, కుసుమలు సంపూర్ణ సహకారం అందించారని తెలుపుతూ టీఎస్ యుటిఎఫ్ సంఘ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు అనుమోలు కోటేశ్వరరావు, మధిర మండల అధ్యక్ష కార్యదర్శులు ఏ.వినోద రావు, ఈ.వీరయ్య, ఎర్రుపాలెం మండల అధ్యక్షులు బి.నాగరాజులు వారి కృషిని కొనియాడారు. టీఎస్ యుటీఎఫ్ సంఘ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకొని ఉద్యోగంలో చేరిన అనంతరం, అంతకుముందు 1:3 వెరిఫికేషన్ , 1:1 వెరిఫికేషన్, రిపోర్టింగ్, కౌన్సెలింగ్, స్కూల్ జాయినింగ్, సర్వీస్ రిజిస్టర్ ఓపెనింగ్, ట్రెజరీ ఐడి నెంబర్, ప్రాన్ నెంబర్ ఇప్పించుట తదితర సందర్భాల్లో నూతన ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్ యుటిఎఫ్ అండగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మండల ఉపాధ్యక్షులు షేక్ ఇబ్రహీం, మండల కార్యదర్శులు జిబిఎంఎస్ రాణి, కాజా సునీత, మల్ల రాజు, దైవం భీమ శంకరరావు, ధనిశెట్టి భాస్కరరావు, సీనియర్ నాయకులు గుర్రాల జనార్దన్ రెడ్డి, స్వర్గం శ్రీనివాసరావు, మరియు నూతన ఉపాధ్యాయులు నాయుడు భవాని, రుద్రపంక్తి సంతోష్ కుమార్, నిమ్మగడ్డ గోపీచంద్ తదితరులు ఉన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన సిపి



నవతెలంగాణ-తల్లాడ

తల్లాడలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పత్తి కొనుగోలు, ట్రాన్స్పోర్ట్, బిల్లుల విషయాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండ, గిట్టుబాటు ధరకు పత్తిని కొనుగోలు చేయాలని, సీసీఐ పత్రి కేంద్రాలపై రైతులకు నమ్మకం ఏర్పడేలా వ్యవహరించాలన్నారు. తేమ శాతం పేరుతో రైతుల ఇబ్బందులకు గురి చేయొద్దని, సీసీఐ నిబంధనల ప్రకారం పూర్తి పాదర్దర్శనంగా ప్రక్రియ కొనసాగించాలని సూచించారు.

తలసేమియా నుంచి కోలుకొని గొప్ప స్థాయికి ఎదగాలి

- సమాజంలో మన వంతు 10 మందికి సహాయం అందించాలి
- తలసేమియా చిన్నారులను కలిసిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



నవతెలంగాణ-ఖమ్మం

పిల్లలు బాగా చదువుకొంటూ, తలసేమియా వ్యాధి నుంచి కోలుకొని జీవితంలో గొప్ప స్థాయికి ఎదిగి, సమాజంలో పది మందికి సహాయం అందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. బుధవారం కలెక్టర్, వైరా రోడ్డులోని రితన్య ఆసుపత్రిలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొని, తలసేమియా పిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ కుటుంబంలో వచ్చిన బాధ ఇతరులకు రావద్దని గొప్ప ఆలోచన, మంచి మనస్సుతో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసిన ఫౌండర్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. సంకల్ప స్వచ్ఛంద సంస్థ ప్రయాణంలో అనేక మందికి సహాయం అందించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో జరుగుతున్న మంచి కార్యక్రమాలు విస్తృతంగా అమలు చేయాలంటే మీడియా సహకారం చాలా అవసరమని అన్నారు. సంకల్ప స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అనిత, డాక్టర్. డి.నారాయణ మూర్తిలను ఆదర్శంగా తీసుకుంటూ సమాజంలో పది మందికి సహాయపడే విధంగా పిల్లలు ఎదగాలని కలెక్టర్ అన్నారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్న కలెక్టరేట్ కు వచ్చి తెలియజేయాలని, పరిష్కారానికి అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామని అన్నారు. పిల్లలకు గొప్ప భవిష్యత్తు ఉంటుందని, తల్లిదండ్రులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ అనిత మాట్లాడుతూ 2009లో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థను ప్రారంభించామని, ప్రతి నెలా 220 మంది పిల్లలకు అవసరమైన మందులు, ఇతర సౌకర్యాలు ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. తలసేమియా వ్యాధి ఎలా వస్తుందనే అంశంపై క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కళాశాలలు, గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. సంకల్ప స్వచ్ఛంద సంస్థ ద్వారా దాదాపు 7 వేల మందికి పైగా విద్యార్థులకు తలసేమియా వ్యాధి పట్ల అవగాహన కల్పించామని అన్నారు. మా కుటుంబంలో ఒక చిన్న పిల్లవాడిని తలసేమియా వ్యాధితో కోల్పోయామని, ఇతరులకు ఆ బాధ కలగవద్దనే ఉద్దేశ్యంతో ఈ సంస్థ ఏర్పాటు చేశామని అన్నారు.

డాక్టర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ సంకల్ప స్వచ్ఛంద సంస్థకు కలెక్టర్ రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ మాధవరావు, సభ్యులు రవి చందర్, పావని, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మెన్ ఎం.మహేందర్ రెడ్డి
- పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-ఖమ్మం

ఈనెల 17, 18 తేదీల్లో చేపట్టే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, పరీక్షల నిర్వహణ విజయవంతం చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్ ఎం. మహేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులతో కలిసి హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ, అన్ని దశల్లో ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు పటిష్టంగా చేయాలన్నారు.

కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 27984 మంది గ్రూప్-3 పరీక్షలు రాయనున్నారని, 87 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, పరీక్షా కేంద్రాల్లో నిబంధనల మేరకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పరీక్షల విజయవంతానికి కమీషన్ ఆదేశాలు, సూచనల ప్రకారం అన్ని చర్యలు చేపట్టనున్నట్లు అదనపు కలెక్టర్ అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాల స్ఫూర్తితో ముందుకు సాగుదాం

నవతెలంగాణ - బోనకల్

ప్రజా శ్రేయస్సుకు తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరుల స్ఫూర్తితో ముందుకు నడవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోనే ఆళ్లపాడు గ్రామంలో సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 100 సంవత్సరాల కాలంలో భారత దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఎన్నో మార్పులను తెచ్చిందన్నారు. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో బానిస విముక్తికి సాయుధ పోరాటాన్ని నిర్వహించిన ఘనమైన చరిత్ర సీపీఐకే ఉందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిన అప్పటి వరంగల్ జిల్లాలో భాగమైన మధిర తాలూకాలో పార్టీకి ఇప్పటికీ ఆదరణ ఉందన్నారు. ఆళ్లపాడు గ్రామ అభివృద్ధిలో పార్టీ పాత్ర చాలా కీలకమైందన్నారు. ఆళ్లపాడు గ్రామానికి నలు దిక్కుల రోడ్లు వేయించిన ఘనత సీపీఐ పార్టీదేని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో ఎందరో వీరులను అందించిన గడ్డ ఈ ఆళ్లపాడని ఆయన తెలిపారు. ఈ గ్రామంలో ప్రజా శ్రేయస్సుకు బావులు తవ్వించటం, చెరువుల్ని కాపాడటం, పేదలకు భూమి పంచటం వంటి కార్యక్రమాలకు సీపీఐ శ్రీకారం చుట్టిందన్నారు. ప్రస్తుత యువత గత చరిత్రను తెలుసుకోవాలన్నారు. అమరుల త్యాగాల స్ఫూర్తిని తలుచుకుంటూ సీపీఐ బలోపేతానికి ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి యంగళ ఆనందరావు, ఆళ్లపాడు గ్రామ శాఖ కార్యదర్శి బెజవాడ నరేష్, సీనియర్ నాయకులు బుంగ నరసింహ, యూత్ నాయకులు బుంగ గోపి బుంగ సాయి, మల్లాది ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఖమ్మం త్రీ టౌన్ 8వ మహాసభను జయప్రదం చేయండి

- పార్టీ ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ హిమామ్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

సీపీఐ(ఎం) ఖమ్మం 3 టౌన్ 8వ మహాసభలను జయప్రదం చేయండని సీపీఐ(ఎం) ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ హిమామ్ అన్నారు. బుధవారం 29వ డివిజన్లో సుందరయ్య నగర్ లో రెండు శాఖల సమావేశం సారంగి పాపారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ హిమామ్ మాట్లాడుతూ గురువారం సిపిఎం 3 టౌన్ మహాసభలు స్థానిక వర్తక సంఘం భవనంలో జరగబోతున్నవి. ఈ మహాసభల సందర్భంగా మిర్చి మార్కెట్ నుండి భారీ ప్రదర్శన జరుగుతుందని, బహిరంగ సభ కూడా జరుగుతుందని అన్నారు. ఈ సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్ర శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.విక్రమ్, జిల్లా నాయకులు ఎర్ర శ్రీనివాసరావు పాల్గొంటారని చెప్పారు. ఖమ్మం మిర్చి మార్కెట్ నుండి ఉదయం 10 గంటలకు భారీ ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం త్రీ టౌన్ నాయకులు రంగు హనుమంత చారి, సారంగి పాపారావు, 30 డివిజన్ శాఖ కార్యదర్శి ఎర్ర నగేష్, బెజవాడ చంద్రశేఖర్, మద్ది శ్రీను, మహిళా సంఘం నాయకురాలు రంగు పుష్పావతి, భూక్య సుభద్ర, ఊడుగల పద్మ ఊడుగల రవీందర్, వనమాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నుంచి పలువురు నందిని సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోనే ఆళ్ళపాడు గ్రామంలో మంగళవారం రాత్రి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మెన్ మల్లు నందిని విక్రమార్క సమక్షంలో చేరినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు ప్రకటించారు. కాంగ్రెస్‌లోకి నూతనంగా చేరిన వారికి మల్లు నందిని ఆ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ మధిర అంటే భట్టి విక్రమార్క అని, మధిర నియోజకవర్గాన్ని రాష్ట్రానికి ఒక మోడల్‌గా తీర్చి దిద్దుతున్నారన్నారు. మల్లు భట్టి విక్రమార్క చేపడుతున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై కాంగ్రెస్ లోకి ప్రజలు స్వచ్ఛందంగా చేరుతున్నారని, వారికి కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. తొలుత గ్రామంలోకి అడుగుపెట్టిన మల్లు నందినికి మహిళలు పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలుకుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, నాయకులు కందుల పాపారావు, ఎర్రం శెట్టి సుబ్బారావు, బీపీ నాయక్ బుంగ రాములు, తోటకూర వెంకటేశ్వరరావు, పారా వెంకట మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీపీ డి.శ్రీనివాసరావు

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని మల్లవరం గ్రామానికి చెందిన బెల్లంకొండ ఆంజనేయులు, రాణి దంపతుల కుమారుడు బెల్లంకొండ మహేష్ వివాహం చందన సిరితో బుధవారం వైరా కమ్మవారి కళ్యాణ మండపంలో నిర్వహించారు. మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. డి.రాజశేఖర్ రెడ్డి, మారెళ్ళ దేవేందర్, తదితరులు వధూవరులను ఆశీర్వదించారు.

ప్రకృతి వనానికి పూర్వ వైభవం

- గ్రామపంచాయతీ స్పెషల్ అధికారి ఈవో ప్రత్యేక చొరవ





నవతెలంగాణ-కల్లూరు

పల్లె ప్రకృతి వనానికి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి ఎండీఓ చంద్రశేఖర్, ఈవో నంది శెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూర్వ వైభవం తీసుకొచ్చారు. కల్లూరు గ్రామపంచాయతీ పల్లె ప్రకృతి వనం జంగిల్ పెరిగిపోయి, చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. వనంలోకి రావడానికి భయపడుతూ దూరంగా ఉంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఈవో నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ చూపించి, పల్లె ప్రకృతి వనాన్ని మొత్తాన్ని క్లీన్ చేపించారు. సందర్శకులకు ఆహ్లాదకరంగా, కల్లూరు ప్రజలు వనభోజనాల వంటి కార్యక్రమాలు జరుపుకునే విధంగా, పిల్లలు ఆడుకునే విధంగా అందంగా తీర్చిదిద్ది పునర్జీవం పోస్తున్నారు. ఈ క్రమంలోనే కొన్ని అరుదైన మొక్కలను కల్లూరు ప్రజల కోసం అందంగా తయారు చేయించారు. ఆ అరుదైన మొక్కల వద్ద సందర్శకులు ఫొటో షూట్ చేసుకుంటున్నారు. అధికారులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించండి

నవతెలంగాణ-పెనుబల్లి

మండలంలోని అన్ని గ్రామపంచాయతీ కార్మికులు, పారిశుధ్య కార్మికులు బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎంపీఓకి వినతి పత్రం అందజేశారు. నెలలు తరబడి వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామనీ వేతనాల చెక్కులు ట్రెజరీకి పంపిన కాలయాపన జరుగుతుందే తప్ప వేతనాలు తమ ఖాతాల్లో జమ కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కరోబార్ అండ్ బిల్ కలెక్టర్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి చెన్నారావు జిల్లా ప్రధాన కార్యదర్శి కాశన రంగారావు, మండల కార్యదర్శి జంగాల వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షులు వేముల ఇజ్రాయిల్ గ్రామపంచాయతీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్స్ పంపిణీ చేసిన భాగం ఫౌండేషన్



నవతెలంగాణ-బోనకల్

బోనకల్ ప్రాథమిక, ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులతో పాటు, నాణ్యమైన విద్య ఆహ్లాద కరమైన వాతావరణం ఉంటుందని భాగం ఫౌండేషన్ నిర్వాహకులు, ఎన్ఆర్ఐ భాగం రాకేష్ అన్నారు. బోనకల్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 54 మంది విద్యార్థులకు భాగం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్లేట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ రురావత్ రమాదేవి, ఎస్ఐ కడగండ్ల మధుబాబు హాజరై విద్యార్థులకు ప్లేట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులు క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకోవాలన్నారు. నిర్విరామంగా కొనసాగుతున్న భాగం సేవా ఫౌండేషన్ సేవలను అభినందించారు. అడిగినదే తడవుగా పాఠశాల చిన్నారులకు ప్లేట్స్ వితరణగా ఇచ్చిన ఫౌండేషన్ నిర్వాహకులు భాగం రాకేష్ కు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు సద్దా బాబు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ లక్ష్మీ తిరుపతమ్మలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో పాటు దాతలు అందిస్తున్న సహకారాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు పట్టుదలతో చదువుకొని ఉన్నత స్థాయిలోకి రావాలని అప్పుడే తల్లిదండ్రుల కోరికలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ సభ్యులు రవి, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | నవంబర్14, 2024 | www.navatelangana.com



అగ్నిప్రమాద బాధితులకు బీఆర్ఎస్ ఆపన్నహస్తం

- నిత్యావసర సామగ్రి అందించిన నాయకులు

నవతెలంగాణ-అశ్వారావుపేట

మండలంలోని ఆసుపాకలో రెండు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూరీలు దగ్ధం అయిన బాధిత కుటుంబీకులకు బీఆర్ఎస్ ఆపన్నహస్తంగా నిలిచింది. బాధిత పింగుల రాము కుటుంబానికి 25 కేజీల రెండు టిక్కీల బియ్యం, వంట సామాగ్రి, బట్టలు, దుప్పట్లు, కూరగాయలు అందజేసారు. ఈ బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి డబల్ బెడ్ రూమ్ ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బిర్రం వెంకటేశ్వరరావు, కాసాని చంద్ర మోహన్, లోకం సాంబశివరావు, నల్లపు రామారావు, ఉప్పల ప్రసాద్, ఉప్పల మురళీ, డాక్టర్ ముస్తఫా, బయ్యా సత్యనారాయణ, దిడ్డి వీరబాబు, అచ్చే నాగేంద్రరావు, తల్లాడ వెంకటేశ్వరరావు, ఎస్‌కే.అటావాలా, పాయం దుర్గారావు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని భావితరాలకు అందిద్దాం

- ఎక్సలెంట్ పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ

నవతెలంగాణ-పినపాక



మాదకద్రవ్యాలను అరికట్టడంలో యువత బాధ్యత వహించాలని, మాదక ద్రవ్యాలను నిర్మూలించి భావి తరాలకు డ్రగ్స్ రహిత సమాజాన్ని అందించాలని ఈ.బ య్యారం ఎస్ఐ రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, మణుగూరు డిఎస్పి ఆదేశాల మేరకు ఎక్సలెంట్ పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు తీసుకోవడంతో మానసిక స్థితి కోల్పోయి నేరాలు చేసే అవకాశం ఉంటుందని, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వ్యవహారంలో యువత పూర్తిగా సహకరిస్తూ తమకు సమాచారం ఇస్తే మంచి సమాజాన్ని నిర్మించవచ్చునన్నారు. వ్యసనాల కారణంగా తల్లీదండ్రులతో పాటు కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నట్లు చెప్పారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే కలిగే అనర్థాలు చాలా ఉన్నాయన్నారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణకు వ్యతిరేకంగా వారం రోజుల పాటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరకగూడెం ఎస్సై రాజేందర్, ఎక్సలెంట్ స్కూల్స్ డైరెక్టర్ యూసఫ్, ప్రిన్సిపాల్ నరేందర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

బూర్గంపాడు

మండల పరిధిలోని సారపాకలో ఓ ప్రైవేట్ స్కూల్లో పదవ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యమైన విషయంపై బూర్గంపాడు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఈ విద్యార్థిని తండ్రి మంగళవారం ఉదయం పాఠశాల వద్ద దింపి వెళ్లగా మధ్యహ్న సమయంలో విద్యార్థిని పాఠశాలకు హజరు కాలేదని పాఠశాల ఉపాధ్యాయులు భాదిత తల్లితండ్రులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబసభ్యులు విద్యార్థిని కోసం గాలించిన ఫలితం లేదు. మంగళవారం రాత్రి సమయంలో విద్యార్థిని తల్లి నాగమణి పిర్యాదు మేరకు బూర్గంపాడు ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇందుప్రియ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పాయం పరామర్శ

నవతెలంగాణ-మణుగూరు



అనారోగ్య కారణంగా మృతి చెందిన ఇందుప్రియ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం ప్రమర్శించారు. మణుగూరు మండలం పివి.కాలనీకి చెందిన మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి పప్పుల జాన్ కుమార్తె ఇందు ప్రియ గత కొంతకాలం కిందట అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మణుగూరు మండల అధ్యక్షుడు పిరినకి నవీన్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అదరహో..ఆదివాసి సంత..!

- ఎరువులు లేని కూరగాయలకు ప్రత్యేకం..
- మర్మం లేని తూకం వారికే సొంతం....!
- ఆదివాసీ సంతకు సౌకర్యాలు కల్పించాలి
- గాదె మాధవరెడ్డి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

పచ్చటి ప్రకృతి ఒడిలో అడవి తల్లినే నమ్ముకుని తరతరాలుగా గుంపులు గుంపులుగా జీవిస్తూ ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే అటవీ సంపదనే ఆహారంగా తీసుకుంటూ.. ఆరోగ్యంగా ఆదర్శంగా జీవిస్తున్న ఆదివాసీలు వారి పెరట్లో లభించే సహజ సిద్ధమైన కూరగాయలను విక్రయించాలన్న చిన్న ఆలోచనతో దానినే జీవనోపాధిగా మలుచుకుంటూ..భద్రాచలం పట్టణ చుట్టుపక్కల ఆదివాసి గ్రామాల నుండే కాక చింతూరు, కూనవరం మండలాల నుండి కూడా భద్రాచలం పట్టణానికి విచ్చేసి ఒకే రేటు ఒకే మాట ఒకే తూకంతో విక్రయిస్తూ స్వతాగా జీవనోపాధిని పొందటమే కాకుండా భద్రాచలం పట్టణ వాసులకు ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను అందిస్తూ అదరహో అనిపించుకుంటున్నారు. రోజు రోజుకి పెరిగిపోతున్న ప్రపంచీకరణలో అంతకంతకు పెరుగుతున్న వ్యాపార పోటీలో నాణ్యత ఆరోగ్యం గాలికి వదిలేసి ఎరువులు పురుగు మందుల తోనే పంటలు పండించడమే కాక చంటి పిల్లలు తాగే పాల నుండి ప్రతిదీ కల్తీ అవుతున్నాయి. ఇలాంటి రోజులలో ఆరోగ్యం కోసం ఆలోచించే వారిని లక్ష్యంగా చేసుకొని సేంద్రీయ పంటల పేరుతో వ్యాపారాలు ప్రారంభమవుతున్న తరుణంలో ఎటువంటి ఎరువులు, పురుగుల మందులు వాడకుండా సహజ సిద్ధంగా పండించి నాణ్యమైన కూరగాయలు ఆకుకూరలతో పాటు పండ్లు, జొన్నలు పప్పు దినుసుల ఆదివాసీలు సహజంగా వినియోగించే తేగలు తునికి పండ్లు వంటి సహజ సంపదను పట్టణ వాసులకు అందించేందుకు భద్రాచలం పాత మార్కెట్ సమీపంలోని రుద్రమదేవి విగ్రహం వెనకాల అతికొద్ది ఖాళీ స్థలంలో ఒక్కరొక్కరుగా పెరుగుతూ గుంపులుగా మారి రోజు వారి సంతగా పరిణితి చెందిన ఆదివాసి సంతపట్ల పట్టణవాసుల ఆసక్తి అంతకంతకు పెరుగుతుంది. తెచ్చుకున్న కూరగాయలను ఒకే మాట ఒకే రేటుగా నిర్ణయించుకొని మర్మము మోసం లేకుండా స్వతగా వారి చేతులతోనే పోగులుగా ఏర్పాటు చేసి మార్కెట్ ధరలతో సంబంధం లేకుండా అతి తక్కువ లాభంపేక్షతో విక్రయించడం వీరి ప్రత్యేకత. ఉదయం 7:00 గంటలకి భద్రాచలానికి చేరుకొని 11 గంటల వరకు తెచ్చుకున్న సరుకులు అమ్ముకొని వచ్చిన డబ్బులతో కావలసిన వస్తువులను కొనుక్కొని తిరిగి గ్రామాలకు వెళ్తూ వారి జీవన ఉపాధి పొందటమే కాకుండా అందరికీ ఆరోగ్యాన్ని అందిస్తున్నారు. ప్రకృతి అందాలకు సహజ వనరులకు నిలయమైన భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో చింతూరు వీఆర్.పురం కూనవరం మండలాలలో వారపు సంతలవట్ల ఆసక్తితో భద్రాచలం పట్టణవేం కాక కొత్తగూడెం పరిసర ప్రాంతాల నుండి కూడా ఎంతో మంది ప్రత్యేకంగా సంతలకు వెళ్లి ఆదివాసీలు విక్రయించే సహజ సంపదను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపటం మనకు తెలిసిందే. ఈ నేపథ్యంలో వారంతో పని లేకుండా ఆదివాసీ ప్రాంతాల నుండి సహజంగా పండే పంటను భద్రాచలం పట్టణంలోనే ప్రతిరోజు అందుబాటులోకి తీసుకు రావడంతో ఎటువంటి ప్రచార అర్బాటాలు లేనప్పటికీ 7 గంటల నుండి 11 గంటల వరకు స్థానిక ప్రజలతో కిటకిటలాడుతున్న ఆదివాసి సంత పట్ల అధికారులు దృష్టి పెట్టి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మర్మం
మోసం తెలియని ఆదివాసీలు వారి ఇంటి పెరటిలో తింటానికి పండించుకునే కూరగాయల పంటలను జీవనోపాధి కోసం భద్రాచలం వచ్చి కొద్దికొద్దిగా అమ్ముకుంటూ స్వతగా జీవనోపాధిని కల్పించుకుంటూ క్రమక్రమంగా ఆ సంఖ్య పెరుగుతూ ఆదివాసి సంతగా ఆవిర్భవించి ఓవైపు ఆరోగ్యం.. మరోవైపు నాణ్యమైన తూకాని అందిస్తూ అధరహో అనేలాగా విస్తరిస్తున్న ఆదివాసి సంతపై నవతెలంగాణ అందిస్తున్న ప్రత్యేక కథనం.....



ఆదివాసి సంతకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

గాదె మాధవరెడ్డి



గ్రామాల నుండి సహజ సిద్ధంగా లభించే కూరగాయలను పండ్లను ఇతరాతర వస్తువులను అతి తక్కువ రేట్లకే భద్రాచల పట్టణ వాసులకు అందిస్తున్న ఆదివాసీలను ప్రభుత్వం ఆదుకోవాలి. ఉదయం ఏడు గంటల నుండి 11 గంటల వరకు ఈ సంత నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎండాకాలం ఎండకి వర్షాకాలం వర్ష వర్షానికి తడుస్తూ ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు సంతను సందర్శించి అక్కడ ప్రత్యేకమైన గుడారాలని షెడ్యూలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మారుతున్న కార్పొరేట్ రోజులలో ప్రతిదీ కలుషితమైపోయి తినే ప్రతి వస్తువు విషపూరితమవుతున్న రోజులలో ఎటువంటి ఎరువులు పురుగు మందులు లేకుండా సహజంగా పండించిన పంటను మనకు అందిస్తున్న ఆదివాసీలను అభినందించుటతో పాటు ఆదరిస్తూ ఆ సంత అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉంది. సంత సమస్యలపై గ్రామపంచాయతీ ఈవో దృష్టికి తీసుకువెళ్లి అవకాశం ఉన్న మేరకు వసతులు కల్పించే విధంగా కృషి చేస్తాను

గిరి బజారుగా అభివృద్ధి చేయాలి

సున్నం గంగ (ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు)



ఆదివాసి సంతపై ఐటిడిఏ అధికారులు దృష్టి పెట్టి ఆదివాసి గిరిజనులకు ఉపాధి కల్పించేలాగా గిరి బజారుగా మార్చి శాశ్విత షెడ్లను నిర్మించి ఆదివాసి సంతను గిరి బజారుగా అభివృద్ధి చేయాలి. దానివల్ల పట్టణ ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందడంతో పాటు ఆదివాసి గిరిజన మహిళలకు ఉపాధి దొరుకుతుంది. అధికంగా 50 సంవత్సరాలు పైబడిన వృద్ధులు మహిళలే గ్రామ ప్రాంతాల నుండి కూరగాయలను పండ్లను తీసుకువచ్చి విక్రయిస్తున్న నేపథ్యంలో వారికి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ఐటీడీఏ అధికారులపై ఉంది. వెంటనే ఐటీడీఏ పీవో ఆదివాసి సంతను సందర్శించి వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలి.

విద్యార్థులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం..

- చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలి
- లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మిడ్ డే మీల్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం

నవతెలంగాణ-మణుగూరు





ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అందిస్తున్నామని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే పాయ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మిడ్ డే మీల్స్ మణుగూరు ప్రభుత్వ జూనియర్ కాలేజిలో లయన్స్ క్లబ్ వారు ఏర్పాటు చేసిన మిడ్ డే మీల్స్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారుర. విద్యార్థులకు భోజనాలు వడ్డించి మిడ్ డే మీల్స్ భోజన సదుపాయాలు కల్పించాలని ఒక మంచి కార్యక్రమాన్ని తీసుకున్నటువంటి లయన్స్ క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ భోజన కార్యక్రమం ఈరోజు నుండి ఎగ్జామ్స్ అయిపోయే వరకు కొనసాగుతుందని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విద్యార్థుల కోసం అత్యధిక నిధులు, విద్యా విధానాల కొరకు క్యాబినెట్లో నిధులు కేటాయించారని, మన ఊరు మనబడి పథకంలో గవర్నమెంట్ పాఠశాలకు కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశారని తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్యను పొంది దేశానికి కుటుంబానికి ఆదర్శంగా నిలవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎన్.సత్య ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ మణుగూరు మండల అధ్యక్షులు పిరినకి నవీన్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్ ఇన్‌స్పైర్ ప్రోగ్రాం పనులు పరిశీలించిన ఎమ్మెల్యే జారే

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



మండల కేంద్రంలో గల సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో జరిగే సైన్స్ ఫెయిర్ ఇన్పైర్ ప్రోగ్రాం పనులును ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్సీలు, జిల్లాలో వున్న పలువురు ముఖ్య నాయకులు హాజరు అవుతున్నారని తెలిపారు. వారందరినీ ఆహ్వానించి ముందుగా గ్రామంలో గల ప్రముఖ పుణ్య క్షేత్రాలలో దర్శనం చేయించి వారిని సైన్స్ ఫెయిర్ ఇన్పైర్ కార్యక్రమాన్ని తిలకించేందుకు అన్ని ఏర్పాట్లను స్థానిక కమిటీలు చూడాలని అన్నారు. సైన్స్ ఫెయిర్ ఇన్పైర్ ప్రోగ్రం విజయవంతం చేసేందుకు మొత్తం 16 కమిటీలతో మొత్తం 80 మంది సభ్యులను ఎన్నుకోవాలని ఇవే కాకుండా అఫిషల్ కమిటీలు కూడా వుంటుంది అని వాటిలో నియెజకవర్గంలో వున్న అన్ని ప్రభుత్వ పాఠశాలలు హెడ్మాస్టర్ వుంటారు అని అన్నారు.సైన్స్ ఫెయిర్ ఇన్పైర్ ప్రోగ్రాంకు వచ్చే విద్యార్థులకు, అతిథులుకు బోజన వసతి సౌకర్యాలు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, జిల్లాలో సైన్స్ ఫెయిర్ ప్రోగ్రాం రాష్ట్ర స్థాయిలో నిలవాలని అధికారులకు కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యకమంలో ఎంఈఓ ఆనంద్‌కుమార్, బురాన్, పర్స వెంకట్, దుబాకుల రాము, గఫార్, ప్రసాద్, పేరెంట్స్ కమిటీ చైర్మెన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఒంటరి మహిళలకు చేయూతగా ఐటీసీ బంధన్ సంస్థ

- ఏపీఎం ఎం. నాగార్జున

నవతెలంగాణ-బూర్గంపాడు

ఒంటరి మహిళలకు చేయూతగా ఐటిసి బంధన్ సంస్థ నిలిచిందని బూర్గంపాడు ఏపిఎం ఎం.నాగార్జున అన్నారు. మండలంలో ఐటిసి బంధన్ సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద, మహిళా ఆదారిత కుటుంబాలకు కూరగాయల బండి, పండ్ల బండి, కుట్టు మిషన్లు, బట్టల షాప్, ఫ్యాన్సీ షాపు ఉచితంగానే అందజేశారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏపియం, పోస్టల్‌శాఖ సిబ్బంది హాజరయ్యారు. లబ్దిదారులను, ఎలా అభివృద్ధి చెందారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీఎం నాగార్జున మాట్లాడుతూ ఐటీసి బందన్ ఆధ్వర్యంలో వ్యాపారాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న ఐటీసి బంధన్ సంస్థ వారిని అభినందించారు. పోస్టల్ శాఖ సిబ్బంది ఆనంద్ రావు మాట్లాడుతూ పోస్టల్ శాఖలో అకౌంట్‌లో తీయడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులు, ఐటీసి బంధన్ సంస్థ ఏరియా కోర్డినేటర్ ఉత్తమ్ మారజిత్, టీల్, ఉమ్మల సుమన్‌రెడ్డి, సీ ఓ భూక్యా కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

- టీజీవో జిల్లా అధ్యక్షులు సంగెం వెంకట పుల్లయ్య

నవతెలంగాణ-దుమ్ముగూడెం

జన్మనిచ్చిన తల్లిదండ్రులు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుల ను గౌరవిస్తే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్, టీజీవో జిల్లా అధ్యక్షులు సంగెం వెంకట పుల్లయ్య అన్నారు. బుధవారం దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. జీవితంలో మొదటి వ్యక్తులు అయిన తల్లితండ్రులు, అధ్యాపకుల మాటకి విలువనిచ్చిన వారు జీవితంలో తప్పక విజయం సాధిస్తారని ఆ రకంగా విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సమక్షంలో టీజీవో సంఘం జిల్లా అధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన వెంకట పుల్లయ్యను కళాశాల తరుపున సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, టీజీవో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వేముల కామేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.కృష్ణవేణి, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపులతో 'ఆదివాసీ' మహిళలకు జీవనోపాధి

- ట్రైకార్ జీఎం జీ.శంకర్‌రావు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



ఇసుక ర్యాంపుల నిర్వహణతో ఆదివాసి గిరిజన మహిళలకు జీవనోపాధి లభిస్తుందని గిరిజన సంక్షేమశాఖ ట్రైకర్ జీఎం జీ. శంకర్‌రావు అన్నారు. ఆదివాసి గిరిజన మహిళలు సొంతంగా ఇసుక ర్యాంపులు నడుపుకొని జీవనోపాధి పెంపొందించుకొని తమ గ్రామాలలోని కుటుంబాలకు ఉపాధి అవకాశాలు పొందడానికి ఆ గ్రామంలోని గిరిజనులకే అవకాశం కల్పించినట్టు తెలిపారు. బుధవారం తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచనల మేరకు దుమ్ముగూడెం మండలంలోని నందుల చలక, చర్ల మండలంలోని పెద్దపల్లి ఇసుక ర్యాంపులను గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, మైనింగ్ అధికారులు కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ మహిళలతో వారు మాట్లాడుతూ ఇసుక ర్యాంపుల నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇసుక ర్యాంపులు నిర్వహించే మహిళలు ఆ గ్రామానికి సంబంధించిన వారై ఉండాలని, బినామీలను ఎవరిని దరిచేరకుండా చూడాలని, ఇసుక సరఫరాకు సంబంధించిన ప్రతిదీ రిజిస్టర్లో నమోదు చేయాలని ఆయన మహిళలకు సూచించారు. మహిళలు ఇసుక ర్యాంపుల పూర్తి బాధ్యత తీసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పరిపాలన అధికారి రాంబాబు, డీఎస్ఓ ప్రభాకర్‌రావు, జిఎం ఎల్లయ్య, టీఎస్ఎండిసి పీఎంఓ శంకర్, గ్రామంలోని మహిళలు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్మికుడు మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- కార్మికుడి కుటుంబాన్ని తక్షణమే అందుకోవాలి

నవతెలంగాణ-ములకలపల్లి

గ్రామపంచాయతీ కార్మికుడు బాణోత్ తరుణ్ ప్రమాదవశత్తు మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏండి.యూసుఫ్, సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్మికుడు బాణోత్ తరుణ్ మరణానికి గ్రామ పంచాయతీ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రహదారిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జూలురుపాడు మండలం చింతల తండా గ్రామ పంచాయతీలో మల్టీ పర్పస్ వర్కర్‌గా విధులలో భాగంగా బాణోత్ తరుణ్ వీది దీపాలు మార్చడానికి కరెంటు స్తంభాం ఎక్కి అమరుస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు వైరు తగిలి అక్కడికక్కడే మరణించాడు. మరణించిన గ్రామ పంచాయతీ కార్మికుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మల్టీ పర్పస్ విధానాన్ని తీసుకొచ్చి గ్రామపంచాయతీ కార్మికులతో చేయలేని పనులు కార్మికులతో చేపిస్తూ ప్రాణాలతో చెలగాటం అడుతుందన్నారు. దీంతో కార్మికుల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. యువకులు ఉన్నత చదువులు చదువుకోని ప్రభుత్వ ఉద్యోగాలు రాక గ్రామ పంచాయతీ కార్మికులుగా అవతారం ఎత్తి విధులు నిర్వహిస్తుంటే ప్రభుత్వం మల్టీ పర్పస్ విధానం వల్ల కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని విమర్శించారు. గ్రామ పంచాయతీ కార్మికుల ప్రాణాలకు రక్షణ కరువైందని అన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుడు బాణోత్ తరుణ్ మరణానికి కారకులైన స్థానిక అధికారులపై చర్యలు తీసుకోని తన కుటుంబానికి ప్రభుత్వం భరోసా కల్పించి 10 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు ప్రమాద బీమా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని లేనియెడల భవిష్యత్ పోరాటాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ కార్మిక జేఏసీ నాయకులు గంటా శ్రీనివాసరావు, చిక్కుల శ్రీనివాస్, వగ్గేల దారయ్య, మేకల రమేష్, కనకం చిన్నయ్య, ఏసుబాబు, బత్తుల సంజీవరావు, కుంజా రవి, బాబురావు, పోక్కిలి నరేష్, కొక్కెరగడ్డ సతీష్, తదితరులు పాల్గొన్నారు.



అధికారులపై దాడి బీఆర్ఎస్ అరాచక శక్తుల కుట్రే..

- సోషల్ మీడియాలో మాజీ ఎమ్మెల్యే రేగావి చెల్లని రూపాయి మాటలు
- ప్రజలు బుద్ధి చెప్పినా.. మారలేదు
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొడిశాల రామనాథం

నవతెలంగాణ-పినపాక

వికారాబాద్ జిల్లాలో జిల్లా కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడి వెనుక బీఆర్ఎస్ అరాచక శక్తుల కుట్రేనని కాంగ్రెస్ పార్టీ పినపాక మండలాధ్యక్షుడు గొడిశాల రామనాథం అన్నారు. బుధవారం ఈ. బయ్యారం క్రాస్‌రోడ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సోషల్ మీడియా సాక్షిగా చేసిన వ్యాఖ్యలు వారి దిగజారిన రాజకీయాలకు అద్దం పడుతుందన్నారు. రాజకీయాలలో హుందాగా మాట్లాడాలని.. ఆ హుందా తనం రేగాలో లోపించిందని.. చిల్లర మాటలు మా విధానం కాదని, చెల్లని రూపాయి మాటలు మాట్లాడి, ప్రజల్లో ఇంకా చులకన కావోద్దని హితవు పలికారు. నాడు ఎన్నికల సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా రేగా కాంతారావు ఈ జిల్లాలో ఒక్క సీటు కూడా కాంగ్రెస్ పార్టీ గెలవనివ్వనని ప్రగల్భాలు పలికి.. మీ సీటునే 35 వేల మెజారిటీతో చిత్తు చిత్తుగా ఓడిపోయింది మర్చిపోవొద్దన్నారు. పది రోజుల్లో మంత్రిని అయ్యి వస్తా అన్నావు.. పత్తా లేకుండా పోయావు.. పదివేల మెజారిటీతో గెలవబోతున్నాము.. కార్యకర్తలు సంబరాలకు సిద్ధం కండి అని అన్నావు, అదీ అడ్రస్ లేకుండా పోయిందని విమర్శించారు. ఇప్పుడు భద్రాచలం లో ఉప ఎన్నికకు సిద్ధం అవుతున్నారు.. అధికారం కోసం అర్రులు చాచటం మీకే చెల్లిందన్నరు. ఇకనైనా బుద్ధి తెచ్చుకుని.. గౌరవప్రద రాజకీయాలు చేయాలని సూచించారు. వికారాబాద్ లో బీఆర్ఎస్ ప్రేరేపించిన, వారి అనుచరుల ముసుగులో ఉన్న గూండాలను తక్షణమే అరెస్టు చేసి, శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ విలేకరుల సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉడుముల లక్ష్మారెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, బండారు సాంబశివరావు, స్వాతంత్ర రెడ్డి, పాయం అప్పారావు, పాడి హేమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ-అశ్వాపల్లి

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి కాలు విరిగినట్టు ఆళ్ళపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి కెవి.సంఘమిత్ర బుధవారం ప్రకటించారు. ఆమె కథనం ప్రకారం.. మండలంలోని ముత్తాపురం గ్రామానికి చెందిన పూసం బాబు తిర్లాపురం గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఓ చెట్టును ఢీకొని, రోడ్డు పక్కన ఉన్న గోతిలో పడ్డాడు. దాంతో అతని ఎడుమ కాలు విరిగి కుడికాలికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడికి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం స్థానిక 108 వాహనంలో కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించామని ఆమె చెప్పారు. పూసం బాబు రోడ్డు ప్రమాదం జరగడానికి ముందు పూటుగా మద్యం సేవించి ఉన్నాడని వైద్యాధికారి తెలిపారు.

ప్రయివేట్ సెక్యూరిటీ గార్డ్ పాపకి అనారోగ్యం

- ఆర్థిక సహాయం అందించిన కొత్తగూడెం ఏరియా అధికారులు, సెక్యూరిటీ గార్డ్స్

కొత్తగూడెం : సింగరేణి కొత్తగూడెం ఏరియా కొత్తగా నియమితమైన జిఎం సెక్యూరిటీ చందా లక్ష్మీనారాయణ సింగరేణి కొత్తగూడెం ఏరియా జిఎం ఆఫీస్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియా జిఎం సాలెం రాజు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు బిడ్డకు అనారోగ్యాంగా ఉందని తెలుసుకున్న అధికారులు ఆర్థికంగా వారికి సహాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఏరియా ఉద్యోగులుల సహకారంతో సుమారు రూ.43, వేలు ఏరియా జిఎం సెక్యూరిటీ, ఎస్‌ఓ టు జిఎం కోటిరెడ్డి పర్సనల్ డిపార్ట్మెంట్ కేశవరావు, సివిల్ ఏజీఎం రామకృష్ణ, జిఎం ఆఫీస్ ఆల్ హెచ్‌ఓడిస్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాస్, జూనియర్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం.. పరిస్థితి విషమం

ఆళ్ళపల్లి : ఓ వ్యక్తి క్రిమి సంహారక మందు తాగి, బలవన్మరణానికి యత్నించిన ఘటన ఆళ్ళపల్లి మండలంలో బుధవారం చోటు చేసుకుంది. ఆళ్ళపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి కెవి.సంఘమిత్ర తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కిచెనపల్లి గ్రామానికి చెందిన గొగ్గెల లక్ష్మీనారాయణ గత కొన్ని రోజులుగా విరివిగా మద్యం సేవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు అతడిని మందలించారు. దాంతో లక్ష్మీనారాయణ మనస్థాపం చెంది, క్షణికావేశంలో పురుగు (మోనో) మందు తాగి బలవన్మరణానికి యత్నించాడు. అతని కుటుంబ సభ్యులు అతడి ఆరోగ్య పరిస్థితి గమనించి ఆళ్ళపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్య సిబ్బంది అతడికి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి స్థానిక 108 వాహనంలో తరలించారు. అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో లక్ష్మీనారాయణ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉందని స్థానిక 108 వాహన సిబ్బంది సూచనా ప్రాయంగా వెల్లడించారు.

సమ్మెకు సిద్ధంకండి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బ్రహ్మచారి
- 7వ రోజుకు చేరిన ఆకలికేక దీక్ష

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గిరిజన కార్మికులు ఏడు రోజులుగా ఆకలి కేక పేరిట ఐటీడీఏ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం గాని, జిల్లాలోని ఎమ్మెల్యేలు గానీ ఏమాత్రం స్పందించడం లేదని, కాబట్టి కార్మికులందరూ నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మచారి పిలుపునిచ్చారు. ఏడవ రోజు దీక్షలో పాల్గొని మాట్లాడారు. గిరిజన కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని, వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ కార్యాలయంలో ఇచ్చిన సమ్మె నోటీసులను 15, 16 తేదీల్లో జిల్లాలో ఉన్న 22 పోస్టుమెట్రిక్ హాస్టల్ వార్డెన్‌లకు వారితో పాటు భద్రాచలం, పాల్వంచ, ఇల్లందు ఏటిడబ్ల్యూ కార్యాలయాల్లో అందజేయాలని నిర్ణయించారు. సమ్మె జరిగితే విద్యార్థులకు ఎదురయ్యే ఇబ్బందులకు ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు మంత్రులు జిల్లాలోని గిరిజన ఎమ్మెల్యేలు, ఐటీడీఏ అధికారులు బాధ్యత వహించాలని సీఐటీయూ పేర్కొన్నది. సీఐటియు నాయకులు నాగరాజుతోపాటు దీక్షల్లో హాస్టల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జయ, తిరుపతమ్మ, రాజ్యలక్ష్మి, శ్రీను, సుభద్ర, కూమారి, వీరి, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ పోరాటంతో దిగివచ్చిన అధికారులు

- ప్రభుత్వ ప్రధానాస్పత్రి వద్ద ధర్నా
- మరణించిన గ్రామ పంచాయతీ కార్మికుడు కుటుంబానికి రూ.13 లక్షలు, మృతుడు భార్యకు ఉద్యోగం, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఒప్పందం
- తక్షణ సహాయం రూ.50వేలు ఇప్పించిన సీఐటీయూ నాయకులు
- ఎంపీఓ, ఎస్సై, పంచాయతీ సెక్రెటరీల రాత పూర్వకంగా ఇచ్చిన హామీతో ధర్నా విరమణ

నవతెలంగాణ-కొత్తగూడెం





జూలూరుపాడు మండలంలో చింతల తండ గ్రామ పంచాయతీలో మంగళవారం జరిగిన ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మరణించిన గ్రామ పంచాయతీ కార్మికుడు (మల్టీపర్పస్ వర్కర్) బానోత్ వరుణ్ మరణించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం మంగళవారం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. వీధి దీపాలు కోసం మరమ్మతులు చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌తో ప్రమాదవశాత్తు మరణించిన బానోత్ తరుణ్ కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రభుత్వపరంగా రావలసిన ఎక్స్‌గ్రేషియా, ఇన్సూరెన్స్, తక్షణ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించాలని, రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మార్చురీ రూమ్ వద్ద భారీ ధర్నాను నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే.రమేష్ మాట్లాడుతూ కరెంట్ షాక్‌తో మరణించిన వరుణ్ కుటుంబానికి తక్షణమే రూ.20 లక్షలు ప్రభుత్వం సంబంధిత అధికారులు ఇవ్వాలని, భార్యకు ఉద్యోగం ఇవ్వాలని, ఇందిరమ్మ ఇల్లు అందజేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం మరణించిన కార్మికుడు కుటుంబానికి 24 గంటలు గడిచినప్పటికీ అధికారులు స్పందించక పోవడంతో కార్మికుడి కుటుంబానికి అండగా ఉంటామని, తరుణ్ కుటుంబానికి న్యాయం జరిగే వరకూ ధర్నా నిర్వహిస్తమని ఏజే.రమేష్ తెలిపారు. ఆరు గంటల పాటు ధర్నా కార్యక్రమం కొనసాగింది. వెంటనే అధికారులు వచ్చి చర్చలు జరిపి వారిని కుటుంబాన్ని తక్షణ సహాయం చేయాలని ప్రభుత్వం రావాల్సిన ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీఐటీయూ నాయకులు నినాదాలు చేశారు. ఈ ధర్నాలో గ్రామ ప్రజలు సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకి సంఘీభావం తెలుపుతూ ధర్నాను కొనసాగించడం వల్ల ఉత్కంఠ వాతావరణం నెలకొంది. సిఐటియు ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధర్నాతో దిగివచ్చిన జూలూరుపాడు మండల అధికారులు ఎంపీఓ, గ్రామ కార్యదర్శిలు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో సిఐటియు నాయకుల మధ్య గ్రామ పెద్దల సహకారంతో చర్చలు జరిపి మరణించిన తరుణ్ కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఇన్సూరెన్స్ రూ.10 లక్షలు, అధికారుల సహకారంతో రూ.3 లక్షలు, ఇందిరమ్మ ఇల్లు, భార్యకు ఉద్యోగం ఇస్తామని వ్రాత పూర్వకంగా అధికారులు హామీతో సిఐటియు నాయకులు ధర్నా కార్యక్రమాన్ని విరమించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు డి.వీరన్న, భూక్యా రమేష్, లిక్కీ బాలరాజు, యాస నరేష్, ఈర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు నిర్వహించాలి

- ప్రమాద స్థలాలు గుర్తించాలి
- కలెక్టర్ జితేష్ వీ. పాటిల్

నవతెలంగాణ-కొత్తగూడెం



వానలకు పాడైపోయిన రోడ్లకు మరమత్తులు తక్షణమే నిర్వహించాలని, తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రమాద స్థలాలు గుర్తించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా స్థాయి రోడ్డు భద్రత సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ముఖ్యంగా పోలీసు డిపార్ట్‌మెంట్ వారు జాయింట్ ఇన్‌స్పెక్షన్ ద్వారా సూచించిన వాహన ప్రమాద స్థలాలకు వెంటనే తగిన ఎస్టిమేట్స్ తయారు చేసి పంపవలసిందిగా ఆదేశించారు. జిల్లాలో అన్ని రహదారులపై ఉన్న గుంతలను ఈ నెల ఆఖరి లోగా పూర్తి చేయాలని అన్ని ఇంజనీరింగ్ శాఖలను ఆదేశించారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రతను గురించి అవగాహన సదస్సును ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.సింగరేణి ఏరియాలో వాయు కాలుష్యం, దుమ్ము వలన ప్రజలు పడుతున్న ఇబ్బందిని తొలిగించాలని సింగరేణి, ఐటీసీ, ఏడి మైన్స్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు, రవాణాశాఖ అధికారి సదానందం, వివిధ శాఖల ఇఇలు వేంకటేశ్వరావు, లాల్ సింగ్, శ్రీనివాసరావు, తానజీ, జాతీయ రహదారుల డిఇ శైలజ, ఎన్‌హెచ్ ఏఐ మేనేజర్ ఖమ్మం, అన్ని మున్సిపల్ కమిషనర్లు, డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ నాయక్, డిఇఓ వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

వైద్యులపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు

వైద్యులపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ ప్రకారం ఆసుపత్రులకు అనుమతులు ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. బుధవారం క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్‌పై జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ విద్యా చందన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఆసుపత్రిలో రోగుల హక్కులు, వారికి అందుతున్న వైద్య సదుపాయాలు అక్కడ పనిచేస్తున్న డాక్టర్ల, సిబ్బంది అర్హతను ఆసుపత్రికి వచ్చే రోగులకు తెలిసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, అలాగే అర్హతకు మించి వైద్యం చేస్తున్న వారిపై క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రులలో పనిచేసే వైద్యులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ రహదారులపై జరుగుతున్న ప్రమాదాల్లో క్షతగాత్రులకు తక్షణ వైద్యం అందించేందుకు దగ్గరలో ఉన్న ఆస్పత్రులకు తరలించి తక్షణ చికిత్స అందేందుకు జియో ట్యాగింగ్ చేయాలని, ప్రమాదకరంగా ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఆసుపత్రిలో, రక్త పరీక్ష కేంద్రాల్లో పరీక్షల ధరల పట్టికను ప్రజలకు తెలిసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ అరికల భాస్కర్ మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం అనుమతులు లేని ఆసుపత్రులను, క్లినిక్ లాబ్లను సీజ్ చేసి, నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ సభ్యులు డాక్టర్ మధువరన్, డిప్యూటీ డెమో ఫైజ్ మొహియుద్దీన్, ఉమా మహేశ్వరీ, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన ఎవరి ప్రయోజనం కోసం?

- ప్రజలకిచ్చిన 6 గ్యారంటీలు ఏమైనవి
- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డీ.సీతాలక్ష్మి

నవతెలంగాణ-చర్ల



కులగణన పేరిట కాల యాపనం మినహా నిరుపేదలకు ఒరిగిందేమీ లేదని, ఎవరి ప్రయోజనం కోసం అని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి.సీతాలక్ష్మి ప్రభుత్వాన్ని ఘాటుగా విమర్శించారు. గత ప్రభుత్వం కూడా ఇదే తరహాలో సమగ్ర సర్వే పేరిట కాల యాపనం చేయడం తప్ప బడుగు బలహీన వర్గాలకు వరగబెట్టింది ఏమీ లేదని మండిపడ్డారు. బుధవారం స్థానిక బిఎస్ రామయ్య భవన్లో ఐద్వా మండల కార్యదర్శి పొడుపుకంటి సమ్మక్క అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజా ప్రభుత్వం అంటూ ఆరు గ్యారెంటీలు ఇచ్చి ఇప్పటి వరకు ఒకటో రెండో మినహా ఏ ఒక్క గ్యారెంటీని పూర్తిగా నిర్వహించకుండా కార్మిక కర్షక ప్రజల, రైతుల జీవితాలతో ఆడుకోవడం ఎంతవరకు సబబు అని ఆమె ప్రశ్నించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దొందు దొందుగానే ఉన్నాయని ఆమె ఎద్దేవా చేశారు. రుణమాఫీ రైతు భరోసా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం గంటకొక మాట చెబుతూ రైతులను అయోమయంలో పెడుతుందని ఆమె ఆమె నిప్పులు చెరిగారు. దేశంలో రాష్ట్రంలో నానాటికి మహిళలకు భద్రత లేకుండా పోతుందని, మహిళల పట్ల ఎన్ని అనర్థాలు జరిగిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి నాదెళ్ల లీలావతి, సభ్యులు వరలక్ష్మి, సారోని, రమాదేవి, సూరమ్మ, రాధ, భద్రకాళి, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ డిజిటల్ సేవలను ప్రారంభించిన ఎమ్మెల్యే

- ఇక ఆన్‌లైన్‌లోనే అన్నదానం
- ప్రోటోకాల్, వస్త్ర సమర్పణ సేవలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థాన ఆలయంలో మరిన్ని డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. స్వామివారి అన్నదానంతో పాటు ప్రోటోకాల్, వస్త్ర సమర్పణ వంటి సేవలు ఇక నుండి ఆన్లైన్లోనే భక్తులు నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తూ స్థానిక శాసనసభ్యులు తెల్లం వెంకటరావు చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఆలయ ఈవో ఎల్.రమాదేవిలు పాత్రికేయులతో మాట్లాడుతూ రామయ్య సేవలకు భక్తులను మరింత దగ్గర చేసేందుకు డిజిటల్ సేవలను ప్రారంభిస్తున్నామని అన్నారు. భక్తులకు ఎటువంటి ఆటంకాలు ఇబ్బందులు కలుగకుండా అన్ని సేవలు పారదర్శకంగా ఉండేందుకే డిజిటల్ సేవలను ప్రారంభిస్తున్నామని స్పష్టం చేశారు. సుదీర్ఘ ప్రాంతాలలో నుండి భక్తులు ఆన్‌లైన్ ద్వారా ముందుగానే ఈ సేవలను నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నామని వారి ఈ సందర్భంగా అన్నారు. అన్నదానం డిజిటల్ సేవలు ద్వారా ఆయా టికెట్ వృధా కాకుండా ఆలయానికి వచ్చిన భక్తులకు అక్కడే ఫొటోస్ చేసి టికెట్ ద్వారా నిజమైన భక్తులకు అన్నప్రసాద అవకాశం దక్కుతుందని అన్నారు. అదేవిధంగా ప్రోటోకాల్ పేరుతో కూడా అనేక రకాల పొరపాట్లు జరుగుతున్న నేపథ్యంలో ప్రోటోకాల్ ద్వారా రామయ్యను దర్శించుకునే భక్తులు ముందుగా నమోదు చేసుకొని తమ ఫొటోలను స్కాన్ చేసిన తరువాతనే టోకెన్లు జారీ అవుతాయని, దీని ద్వారా భక్తులకు రామయ్య దర్శనం సులభతరం అవుతుందని అన్నారు. భక్తులు రామయ్యకు సమర్పించే వస్త్రాలయాల విషయంలో కూడా వచ్చిన ఫిర్యాదులను సేకరించి ఆ ప్రక్రియను కూడా డిజిటల్ ద్వారా కొనసాగిస్తున్నామని అన్నారు. అభివృద్ధి అయినా టెక్నాలజీని ఉపయోగించుకొని భక్తులందరికీ రామయ్య సేవలను సులభతరం చేసేందుకే ఆలయంలో ఒక్కొక్కటిగా డిజిటల్ సేవలను క్రమబద్ధీకరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ రవీంద్రనాథ్, భవాని, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ నూతన ఓఈఆర్ ఫార్ములా నిర్ధారణ

- అక్టోబర్ నెల ధర రూ.19,145..
- నవంబర్ గెలలు ధర మరింత పెరిగే అవకాశం

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఆయిల్ పామ్ గెలలు నుండి తీసిన ముడి నూనె శాతం, ఆ నూనె అంతర్జాతీయ బహిరంగ మార్కెట్ క్రయవిక్రయాలు, అనుబంధ ఉప ఉత్పత్తుల విక్రయాలు, సంస్థ లాభనష్టాలు ఆధారంగా ప్రతీ ఏడాది నవంబర్‌లో ఓఈఆర్ ఫార్ములాను ఆయిల్‌ఫెడ్ సంస్థ నిర్ణయిస్తుంది. దాని ప్రకారం ఈ ఏడాది నవంబర్ నుండి అక్టోబర్ వరకు ఆయిల్ ఇయర్ లో మొత్తం టన్ను గెలలు ధరను నిర్ణయించి రైతులకు చెల్లిస్తారు. ఈ మేరకు ఈ ఏడాది ఓఈఆర్ ఫార్ములాను ఆయిల్ ఫెడ్ ఛైర్మెన్ జంగా రాఘవరెడ్డి, ఎండీ.యాస్మిన్ బాషా నేతృత్వంలో హైద్రాబాద్‌లోని ఆయిల్ ఫెడ్ రాష్ట్ర కార్యాలయంలో సమావేశం అయి బుధవారం ప్రకటించారు.



ఈ సమావేశానికి హాజరైన 'ది తెలంగాణ స్టేట్ ఆయిల్ పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ సొసైటీ' అధ్యక్షులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ తెలిపిన వివరాలు. గత ఏడాది కన్న ఈ ఏడాది ఓఈఆర్ 0.17 శాతం పెరుగుదల ఉంది. పెరిగిన 19.42 శాతం ఫార్ములాపై ఈ ఏడాది గెలలు ధర టన్నుకు రూ.160 లు పెరుగుదల ఉండే అవకాశం ఉంటుంది. ముడిచమురుపై ఫార్ములా ప్రకారం రైతు వాటా 75.25 శాతం, ప్రాసెసర్స్ వాటా 24. 75 శాతం, 19.42 శాతం ఓఈఆర్ లెక్క ప్రకారం రూ.160 లు పెరుగుదల ఉంటుంది అని అంచనా.. నూతన ఫార్ములాను ప్రతీ అక్టోబరు నుండి అమలు చేస్తారు. ఈ ఫార్ములా ప్రకారం పెరిగిన ధరలు నవంబరు నుండి అమలు కానున్నాయి. అక్టోబర్ నెల టన్ను గెలలు ధర రూ.19145 లు. ఈ లెక్కన నూతన ఫార్ములా ప్రకారం నవంబర్ నెలలు టన్ను గెలలు ధర రూ.20 వేలు లోపు ఉండే అవకాశం ఉంది. ఈ ఓఈఆర్ నిర్ధారణ సమావేశంలో జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, సొసైటీ సభ్యులు కోటగిరి సీతారామ స్వామి, బండి భాస్కర్‌లు పాల్గొన్నారు.

తాళ్ళూరి ట్రస్ట్ ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ



నవతెలంగాణ-బూర్గంపాడు

బూర్గంపాడు మండలం ఇరవెండి గ్రామంలో తాళ్ళూరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు, తానా మాజీ అధ్యక్షుడు తాళ్ళూరి జయశేఖర్, నీలిమ దంపతుల సౌజన్యంతో బుధవారం 12 సైకిళ్ళు పంపిణీ చేశారు. ఇరవెండి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు హేమశ్రీకి ఈ సైకిళ్ళను అందజేశారు. పాఠశాలలకు వచ్చే బాలికలకు ఇబ్బందులు లేకుండా సైకిళ్ళు అందించినట్లు ట్రస్ట్ ఛైర్మెన్ తాళ్ళూరి పంచాక్షరయ్య తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వల్లూరిపల్లి వంశీ కృష్ణ, విజయ రేణుక, జగన్మోహన్, వనమా రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

నవతెలంగాణ- దమ్మపేట



రైతాంగం ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వి నియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నాచారం గ్రామంలో ప్రాథమిక సహకార విశాల పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జారె ఆదినారాయణ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే మాట్లాడుతూ జిసిసి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించి తరుగు తేమశాతం తదితర విషయాలలో జాగ్రత్తలు పాటించి కొనుగోలు జరపాలన్నారు. కేంద్రంలో ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320లు, సాధారణ ధాన్యానికి రూ.2300లు అలాగే సన్నరకం ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు రూ.500లు అదనంగా బోనస్ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తోందని, రైతులు గమనించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించి లబ్ధిపొందాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మద్దిశెట్టి సత్య ప్రసాద్, సొసైటీ ఛైర్మెన్ ఎల్లిన రాఘవరావు, వైస్ ఛైర్మెన్ కట్టం ఎర్రప్ప, తహసీల్దార్ నరేష్, జిసిసి డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మాదకద్రవ్యాల అలవాటుకు దూరంగా ఉండాలి : సీఐ

నవతెలంగాణ-కొత్తగూడెం

మాదక ద్రవ్యాల అలవాటుకు విద్యార్థులు దూరంగా ఉండాలని కొత్తగూడెం త్రీ టౌన్ సీఐ శివప్రసాద్ సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కూలీలైన్‌లోని గవర్నమెంట్ స్కూల్ విద్యార్థులకు ఎస్ఐ శివ ప్రసాద్, తన సిబ్బందితో కలిసి గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులు చెడు అలవాట్లపై ఆసక్తి చూపుతున్నావారి జీవితాలు బుగ్గిపాలు అవుతున్నాయని చెప్పారు. తల్లిదండ్రులు మీ పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ మీరందరూ మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని మీ జీవితాలకు బంగారు బాటలు వేసు కోవాలని కోరారు.ఈ కార్యక్రమానికి స్కూల్ హెచ్ఎం, సిబ్బందితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మణుగూరులో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

- పట్టణంలో భారీ బైక్ ర్యాలీ
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు

నవతెలంగాణ-మణుగూరు





మణుగూరు మండలం సమితి సింగారం పంచాయతీ పరిధిలో గల పద్మశాలి భవనంలో ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ పార్టీ మండల ముఖ్యకార్యకర్తల సమావేశం జరుగుతుందని బీఆర్ఎస్ మండల, పట్టణ కన్వీనర్లు కుర్రి నాగేశ్వరరావు కుంట లక్ష్మణ్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు పాల్గొని బైక్ ర్యాలీని ప్రారంభిస్తారని అన్నారు. తెలంగాణ భవనం నుండి బైక్ ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. సురక్షా బస్టాండ్ మీదుగా సాయిబాబాగుడి వరకు అక్కడనుండి తిరిగి పద్మశాలి భవన్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంలో మండల సమావేశానికి వచ్చే ముందు తెలంగాణ తల్లి, బాబా సాహెబ్ అంబేద్కర్, కొమరం భీం, కొండాలక్ష్మణ్ బాపూజీ విగ్రహాలకు రేగా కాంతారావు పూలమాలలు వేస్తారన్నారు. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాల మీద ప్రజలను చైతన్య చేస్తామన్నారు. అలుపెరగని పోరాటం నిర్వహిస్తామన్నారు. అనుబంధ సంఘాలు గ్రామ కమిటీల పునర్ నిర్మాణం స్థానిక సంస్థల ఎన్నికలు ఎజెండాగా కొనసాగుతుందన్నారు. ఈ సమావేశానికి మండల ఉద్యమకారులు, ముఖ్యకార్యకర్తలు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తప్పని సరిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.



పంట దిగుబడికి తగ్గట్టుగానే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

- కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించండి
- జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

నవతెలంగాణ-సత్తుపల్లి

రైతు పండించిన పంటల ఉత్పత్తికి అనుగుణంగానే జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య స్పష్టం చేశారు. బుధవారం సత్తుపల్లి వచ్చిన ఆయన అయ్యగారిపేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. కేంద్రం వద్ద కొనుగోలు రిజిస్టర్లను పరిశీలించారు. సగటు నాణ్యత ప్రమాణాల మేరకు ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై వ్యవసాయ అధికారులతో డీఏవో పుల్లయ్య చర్చించారు. డీఏవోతో పాటు కార్యక్రమంలో పాల్గొన్న సత్తుపల్లి సీఐ తెల్లబోయిన కిరణ్ మాట్లాడుతూ మన పరిధిలో పండించిన వరి ధాన్యాన్ని మాత్రమే కేంద్రాలు కొనుగోలు చేయాలన్నారు. పక్క రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యం, ఇతర పంటలపై నిఘా పెట్టామన్నారు. అనంతరం డీఏవో పుల్లయ్య ఆయిల్‌పాం తోటలను సందర్శించారు. రైతులతో పంట స్థితిగతులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వై.శ్రీనివాసరావు, సొసైటీ సీఈవో సతీశ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



స్వీయ రక్షణతో సింగరేణి ఆస్తులను రక్షించాలి

- సింగరేణి సెక్యూరిటీ జీఎం చందా లక్ష్మీనారాయణ
- జీఎం జేవీఆర్, కిష్టారం ఓసీల సందర్శన

నవతెలంగాణ-సత్తుపల్లి

సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ సిబ్బంది స్వీయ రక్షణ పాటించాలని ఆ సంస్థ రక్షణ విభాగం జనరల్ మేనేజర్ చందా లక్ష్మీనారాయణ కోరారు. బుధవారం సత్తుపల్లిలోని జేవీఆర్, కిష్టారం ఓసీలను జీఎం సెక్యూరిటీ సందర్శించారు. సెక్యూరిటీ నిర్వహించే వివిధ ప్రాంతాలను జీఎం తనిఖీ చేశారు. సెక్యూరిటీ సిబ్బందికి వారు విధులు నిర్వహించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజినీర్ శ్రీనివాసరావు, సేఫ్టీ ఆఫీసర్ రమాకాంత్, వెల్ఫేర్ ఆఫీసర్ దేవదాస్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ అజముద్దీన్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాజయ్య, సీనియర్ సెక్యూరిటీ గార్డ్ కనకయ్య రాంబాబు, సురేశ్, ప్రయివేట్ సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ శ్రీనివాస్, సురేశ్, కరుణాకర్ పాల్గొన్నారు. ఓసీల సందర్శనకు వచ్చిన సెక్యూరిటీ జీఎంకు ప్రాజెక్టు ఆఫీసర్ ప్రహ్లాద్ సాదరంగా ఆహ్వానించారు.

కమిటీల పేరుతో వర్గీకరణ కాలయాపన

- ఎమ్మార్పీఎస్‌టీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు లంకా
- 19న ఛలో హైదరాబాద్ కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-సత్తుపల్లి

కమిటీల పేరుతో ఎస్సీ వర్గీకరణను రేవంత్‌రెడ్డి సర్కారు కాలయాపన చేస్తోందని ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు, కోర్ కమిటీ సభ్యుడు లంకా వెంకటేశ్వర్లు అన్నారు. జనవరి 19న ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం సత్తుపల్లిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్గీకరణకు అనుకూలమని అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కమిటీల పేరుతో కాలయాపన చేయడం తగదన్నారు. వర్గీకరణ అంశం తేలేంత వరకు ఏ విధమైన ఉద్యోగ నోటిఫికేషన్లను జారీ చేయొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగిందన్నారు. సొంత స్థలాలు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ఆ సంఘ సత్తుపల్లి మండల ఇన్‌ఛార్జి హెచ్చు వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 19న సత్తుపల్లి మండలం నుంచి మోటారు సైకిలు ర్యాలీ జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కల్లూరు, వేంసూరు మండలాల అధ్యక్షులు వేల్పుల జాని, మేకల వెంకటేశ్వర్లు, నాగరాజు, అశోక్, కృష్ణమూర్తి, రాజేశ్ పాల్గొన్నారు.



రబీకి నీరు ఇవ్వటం ఖాయం

- ఎంఎల్ఏ రాందాస్ నాయక్

నవతెలంగాణ-వైరా

వైరా ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని భూములకు రబీ సాగుకు నీరు ఇస్తామని, నీటిపారుదల శాఖ ఎస్ఈ సమావేశానికి రానందున వారితో కూడా సంప్రదించి నీరు విడుదలకు కృషి చేస్తానని ఎంఎల్ఏ మాలోథ్ రాందాస్ నాయక్ రైతులకు హామీ ఇచ్చారు. బుధవారం ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో శీలం వెంకట నర్సిరెడ్డి అధ్యక్షతన జరిగిన రైతులు, అధికారుల సమావేశంలో ఎంఎల్ఏ మాట్లాడారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రయోజనం కోసమే కృషి చేస్తుందన్నారు. వైరా ప్రాజెక్టు ఆయకట్టుతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లో సాగునీరు అందించేందుకు సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయుటకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. వైరా ప్రాజెక్టు ఆయకట్టు రైతులు ఆందోళన పడవలసిన అవసరం లేకుండా నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నో పోరాటాల ద్వారా రైతులు ప్రాజెక్టుకు అనేక సార్లు నీటిని విడుదల చేయించుకున్న చరిత్ర ఉన్నదని వివరించారు. చైతన్యవంతమైన రైతులు ఉన్న ఈ ప్రాంతంలో రైతుల పక్షమే తానూ ఉంటానని ఎంఎల్ఏ అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, జిల్లా రైతుసంఘం కార్యదర్శి బొంతు రాంబాబు, వైరా సొసైటీ అధ్యక్షులు బొర్రా రాజశేఖర్, తెలుగుదేశం సీనియర్ నాయకులు మండడపు మధుసూదన్‌రావు, మచ్చా నరసింహారావు, మట్టూరి వెంకటేశ్వరరావు, పారుపల్లి కృష్ణారావు, చింతనిప్పు మురళీ, దాసరి దానెలు, కట్లా రంగారావు, నీటిపారుదల శాఖ ఈఈ, డిఈ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఏడిఎ తుమ్మలపల్లి కరుణ శ్రీ, ఏఓ మంజూ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో వర్షం.... రైతన్నలకు నష్టం

నవతెలంగాణ- కల్లూరు

కల్లూరు మండలంలో బుధవారం రాత్రి ఆకస్మికంగా వర్షం పడింది. మండలంలో ముమ్మరంగా వరి కోతలు కోస్తున్న సమయంలో వర్షం పడటం వల్ల రెండు మూడు రోజులు కోతలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. అదే విధంగా ధాన్యం రోడ్ల పైన, కల్లాల్లో ఆరబోసి ఉన్నాయి. మంగళవారం నుండి వాతావరణంలో మార్పు రావడంతో రైతులు అప్రమత్తంగా ఉండి ఆరబోసిన ధాన్యం కుప్పలు చేసుకుని పట్టాలు కప్పుకున్నారు. దీంతో రైతులు ఇంతటితో ఆగిపోతే ఎలాంటి భారీ నష్టం ఉండదు. వర్షం మళ్ళీ వస్తేనే భారీ నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని చంద్రుపట్ల, రఘునాథగూడెం, చెన్నూరు, ఎర్రబోయినపల్లి, లింగాల, వాచ్య నాయక్ తండ, బత్తులపల్లి, కప్పల బంధం, లక్ష్మీపురం, పుల్లయ్య బంజర తదితర గ్రామాల్లో వర్షం పడింది.

పత్తి రైతు..చిత్తు

- మద్దతు ధర కోసం ఎదురుచూపు
- ప్రయోజనం లేని సీసీఐ కేంద్రాలు
- అడ్డగోలుగా తేమశాతం నిబంధన
- అందిన కాడికి దోచుకుంటున్న దళారులు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

పత్తికి మద్దతు ధర దక్కక రైతు చిత్తవుతున్నాడు. పంట అడ్డగోలు రేటుకు అమ్ముకోవడం తప్ప వేరే గత్యంతరం లేక ఆత్మహత్య తప్ప వేరే దారి కనిపించడం లేదని పత్తి రైతులు ఆవేదన చెందుతున్నారు. మండల పరిధిలో సుమారు 12 వేల ఎకరాల పైచిలుకు పత్తి పంటను సాగు చేశారు. ఇటీవల వచ్చిన వర్షాలకు, వరదలకు మండలంలో సుమారు మూడు వేల ఎకరాలలో పత్తి పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం పంట నష్టం అందిస్తానని ప్రకటించడంతో వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం అందించే పంట నష్టంతో నైనా కొంత ఊరట పొందవచ్చుని ఆశించిన రైతుల ఆశలు నిరాశలయ్యాయి.కొంతమంది రైతులకు మాత్రమే పంట నష్టం అందిందని విమర్శలున్నాయి. రై తు రుణమాఫీ రైతులకు పూర్తిగా అందకపోగా పంట నష్టం రాకపోగా రైతు భరోసా వేయకపోవడంతో రైతులు ఆర్థికంగా నానా ఇబ్బందులు పడుతున్నారు. గత మూడేళ్ల క్రితం10 వేల రూపాయల పైచిలుకు అమ్మిన పత్తి గత రెండు మూడేళ్లుగా ఆరు ఏడు వేలకు మించి కొనుగోలు జరగక పోవడంతో మూడేళ్లుగా పత్తి రైతులు పండిన పంటను అడ్డగోలుగా అమ్మి అప్పుల పాలవు తున్నారు. ఏ ఏడాదికా ఏడాది పెట్టుబడి పెరిగిపోవటంతో పాటు గతంలో చేసిన బాకీలు వడ్డీలు పెరిగి రైతు నడ్డి విరుస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. ప్రజా ప్రభుత్వం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతు మద్దతు ధరను 7,521 రూపాయలు ప్రకటించినా సీసీఐ కేంద్రాలలో గతంలో 18 శాతం ఉన్న తేమ శాతాన్ని 12 శాతానికి తగ్గించటంతో సీసీఐ కేంద్రానికి వెళ్లిన రైతుకు మద్దతు ధర దక్కటం లేదని ఆక్రోషిస్తున్నారు. మద్దతు ధర దక్కపోవటంతో రైతులు చేసేది లేక తమ సొంత గ్రామాలలోనే ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముదామన్నా ఇది ఆసరాగా తీసుకొని క్వింటా పత్తి ఐదు వేలకు మించి కొనే పరిస్థితి లేదని రైతులు దిగాలు పడుతున్నారు. సీసీఐ కేంద్రాల వద్ద పేరుకు మాత్రమే బోర్డులు పెట్టి ప్రదర్శన కోసం కనిపిస్తున్నాయి తప్ప ఎక్కడా కొనుగోలు జరుగుతున్న తీరు కనపడటం లేదని రైతులు తెలిపారు. ప్రభుత్వం పత్తి రైతుల గోడును ఆలకించి సీసీఐ కేంద్రాలలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కొనుగోలు జరిగేలాగా చూడాలని రైతులు కోరుతున్నారు. సంబంధిత అధికారుల అలసత్వాన్ని విడనాడి పత్తి రైతుకు న్యాయం జరిగేలాగా చూడాలని కోరుకుంటున్నారు.



నేటితో ముగియనున్న జోనల్ గేమ్స్

ముగింపు కార్యక్రమానికి హాజరుకానున్న డిప్యూటీ సీఎం

నవతెలంగాణ-వైరా

తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం వైరాలో గత మూడు రోజులుగా నిర్విఘ్నంగా కొనసాగుతున్న సంక్షేమ గురుకులాల జోనల్ స్పోర్ట్స్ మీట్ గురువారంతో ముగియనున్నది. మూడవరోజు పోటాపోటీగా జరిగిన పలు గేమ్స్ మరియు స్పోర్ట్స్ ఈవెంట్స్‌లో పలువురు విద్యార్థులు గెలుపును అందుకున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ డి.సమత తెలిపారు. లాంగ్ జంప్, హై జంప్, 400 రిలే రన్నింగ్, క్యారమ్స్, చదరంగం తదితర క్రీడాంశాలలో విద్యార్థులు నువ్వా నేనా అన్నట్లు తలపడి ఫైనల్స్‌కు చేరుకున్నట్లు స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఓవరాల్ ఇన్చార్జ్ కె.శ్రీదేవి వెల్లడించారు. బుధవారం సాయంత్రం జరిగిన ప్రత్యేక సమావేశంలో వైరా తహసీల్దార్ కె.వి శ్రీనివాసరావు చేతుల మీదుగా మూడవరోజు పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా వైరా కళాశాల విద్యార్థిని నాగ సుష్మ నృత్యం అలరించింది. తహసీల్దార్ నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్స్ చాలా జ్యోతి, పివి పద్మావతి, ఎం.పద్మావతి, లిల్లీ, మైథిలి, గంటేల సుజాత, ఐనాల సైదులు తదితరులు పాల్గొన్నారు.





ప్రతిస్పందించిన హృదయాలు

- భారత్‌ని గొప్పగా చూడాలనేదే నా ఆశ
- తులసి గ్రూప్ ఆఫ్ చైర్మెన్ రామచంద్ర ప్రభు

నవతెలంగాణ-చెర్ల

నిరుపేదలను ఆదుకోవడానికి ఎందరో హృదయాలు ప్రతిస్పందించడం చాలా ఆనందదాయకం.. నా భారతదేశాన్ని ఉన్నత స్థాయిలో చూడాలని నా హృదయం ఆశపడుతుంది.. దానికి అనుగుణంగా ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి ఉత్తమ ఫలితాలను తెచ్చుకోవాలని తులసి గ్రూప్ ఆఫ్ చైర్మెన్ రామచంద్ర ప్రభు అన్నారు. బుధవారం స్థానిక దేవ భక్తుని నందీశ్వరుడు కళాభవంలో ఎస్‌కే షాజహాన్ అధ్యక్షతన జరిగిన ఉపకార వేతనాల వితరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉన్నత చదువులు చదువుకునే పేద విద్యార్థుల కోసం 2007 సంవత్సరంలో స్థాపించబడిన ప్రతిస్పందన ఎడ్యుకేషనల్ సొసైటీ నానాటికి దినదినాభివృద్ధి చెందుతూ నాటి నుండి నేటి వరకు వందల మంది నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇచ్చి సహకారం అందించడం అభినందనీయమన్నారు. 2007 సంవత్సరంలో స్థాపించబడిన ప్రతిస్పందన పలువురి హృదయాల స్పందనతో సుమారు 803 మంది విద్యార్థులకు చదువుల నిమిత్తం రూపాయలు 30 లక్షల పేద విద్యార్థినీ విద్యార్థులకు సహాయం చేయడం జరిగింది. సుదూర ప్రాంతం నుండి వచ్చిన రామచంద్ర ప్రభు ఈ ప్రాంత విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వడం హర్షించ తగిన విషయం అని పలువురు వక్తలు కొనియాడారు. ఈ ప్రాంతం వారు ఎంత వితరణ చేస్తే అంత నేను ఒక్కడినే విద్యార్థుల కోసం ఉపకార వేతనాలు సమకూరుస్తానని తులసి రామచంద్ర ప్రభు హామీ ఇచ్చారు. ఈ ప్రాంతాన్ని తొలిసారిగా పరిచయం చేసిన జవాది కుటుంబీకులు నాకు అత్యంత ఆత్ములని ఆయన అన్నారు. ఈ ఏడాది సుమారు 200 మంది విద్యార్థిని విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం జరిగిందని ప్రతిస్పందన నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జవ్వాది రాంబాబు, ఆర్టీవో సంఘం పుల్లయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ నరేందర్, రౌతు నరసింహారావు, చింతూరి వెంకట్రావు, దొడ్డి తాతారావు, సీడీపీవోఓ చైతన్య, కేజీబీవీ ప్రత్యేక అధికారి భాను ప్రియాంక, ప్రతిస్పందన నిర్వాహకులు నీలి ప్రసాద్, చింత నాగబాబు, చిట్టిబోతుల వేణు, శ్రీరాముల సాంబమూర్తి, జవ్వాది రవి, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.



భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్

- బక్కి వెంకటయ్యకు స్వాగతం పలికిన అర్చకులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని బుధవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈవో రమాదేవి, అర్చక స్వాములు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. బలపీఠం వద్ద పూజలు జరిపి గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీ తాయారు అమ్మ వారిని శ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చక స్వాములు స్వామివారి విశిష్టతను తెలిపి పట్టు వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఏవో రాంబాబు, ఏఈఓ శ్రవణ్ కుమార్, ఏసీఎంఓ రమణయ్య, డీఎస్ఓ ప్రభాకర్ రావు, ఏటీడీవో చంద్రమోహన్, తహసీల్దార్ శ్రీనివాస్, దేవస్థానం పర్యవేక్షకుడు సాయిబాబా, ఆర్ఐ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



30 పడకల ఆసుపత్రి కోసం స్థలం పరిశీలన

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రమైన ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పిహెచ్సి)లో 30 పడకల ఆసుపత్రికి కోసం తాసిల్దార్ కె.సునీత ఎలిజిబెత్ బుధవారం క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ స్థలంలో సర్వే నిర్వహించారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గతంలో ముదిగొండలో పర్యటించినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రి స్థాయి పెంచి 30 పడకల ఆసుపత్రిగా చేయాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లిన విషయం విదితమే. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అంకం అరుణాదేవి, ఆర్ఐ ప్రసన్నకుమార్, సర్వేయర్ పి.ఉమామహేష్, హెల్త్ సూపర్వైజర్ లత, పిహెచ్ఎన్ జీఎ రాణి, మాజీ జెడ్పిటిసి మందరపు నాగేశ్వరరావు(బుల్లెట్ బాబు) వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ప్రజావసరాలు తీర్చటం పరిశ్రమల సామాజిక బాధ్యత

ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

నవతెలంగాణ-కారేపల్లి

ప్రభావిత ప్రాంతాల ప్రజావసరాలను తీర్చటం పరిశ్రమల సామాజిక బాధ్యత అని దానిని విస్మరించవద్దని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో మాధారం డోలమైట్ మైన్స్ సీఎస్ఆర్ నిధుల రూ.6.75 లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లను డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి వైరా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీడీవో జీ.సురేందర్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ మాట్లాడుతూ మైన్స్ నష్టాలలో ఉందని ప్రభావిత ప్రాంతాల సమస్యలు వదిలివేయవద్దన్నారు. రేగులగూడెం, రామకృష్ణాపురం, కారేపల్లిలో తాగునీటి సమస్య ఉందని ఆ గ్రామాలలో ఆర్వో ప్లాంట్ నిర్మించాలని డోలమైట్ అధికారులను కోరారు. కారేపల్లి – మాధారం రోడ్ డబల్ రోడ్ కానుందని దానికి రూ.4 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. కారేపల్లి–రొట్టమాకురేవు–మాధారం రోడ్ మరమ్మత్తులు చేయాలని గ్రామస్తులు కోరగా దానికి సానుకూలంగా స్పందించారు.

ఆటో డ్రైవర్లకు సన్మానం

కారేపల్లి బస్టాండ్ ప్రాంతం ఆక్రమణలకు గురకాగా దానిని ఆటో డ్రైవర్లు పోరాటంతో ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని కాంగ్రెస్ జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. స్థలం కోసం పోరాడి ఆప్రాంతంలో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి అవకాశం కల్పించి ఆటోడైవర్ల నాగవెల్లి ప్రభాకర్, ఎండీ.ఖలీలూల్లాఖాన్, నాగయ్య, తొగరు శ్రీను, బొందల పెంటయ్యలకు శాలువలు కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో మైన్స్ అధికారులు జయరాజు, బీఎస్.రాజు, చిట్టిరాజు, ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, సోసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనినాసరావు, కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్, మేదరి వీరప్రతాప్, సురేందర్‌మనియార్, అడ్డగోడ ఐలయ్య, బానోత్ హిరాలాల్, ఎండీ.యాకూబ్‌అలీ, గుగులోత్ భీముడు, బండారి మోహన్‌రావు, వాంకుడోత్ గోపాల్, ఆదెర్ల రాములు, మేదరి రాజా, బానోత్ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉన్నతాధికారుల నిర్లక్ష్యంపై రైతుల మండిపాటు

నష్టపోయామని ఫిర్యాదు చేసినా పట్టించుకోరా?

నవతెలంగాణ - బోనకల్

ఆళ్లపాడు గ్రామంలో సెప్టెంబర్ నెలలో తుఫాను కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన పంట పరిహారంలో స్థానిక వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనేక మంది రైతులకు క్షేత్రస్థాయిలో పంట నష్టం జరిగినప్పటికీ సర్వేలో అవకతవకలకు పాల్పడి నష్టపోయిన రైతుల పేర్లు నమోదు చేయలేదని ఆళ్లపాడు కాంగ్రెస్ నాయకులు పారా వెంకట మోహన్‌రావు, తోటకూర వెంకటేశ్వరరావు, బుంగ రాములు, మల్లాది లింగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్ట నమోదులో అక్రమాలకు పాల్పడిన ఏఈఓపై చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మధిర ఏడిఏకు 30 మంది రైతులు రెండుసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగి ఫిర్యాదు చేశామని తెలిపారు. ప్రధానంగా నష్టపోయిన తమకు పరిహారం అందించాలని, అదే విధంగా పక్షపాతంగా వ్యవహరించి అక్రమాలకు పాల్పడిన ఏఈఓపై చర్యలు తీసుకోవాలని తాము ఫిర్యాదు చేసి నెల రోజులు పైగా గడుస్తున్నా స్పందించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నియోజకవర్గమైన మధిర ఏడిఏ పరిధిలో బోనకల్ మండలంలో ఆళ్లపాడుతో పాటు మరికొన్ని గ్రామాలలో ఏఈవోలు ఇదేవిధంగా వ్యవహరించారని తెలిపారు. తాము రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన స్పందించి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినప్పటికీ అధికారులు ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. వ్యవసాయ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోతే జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని వారు హెచ్చరించారు.

బీమా చెక్కు అందజేసిన మాజీ ఎమ్మెల్యే కందాళ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండల పరిధిలోని పోలేపల్లి గ్రామానికి చెందిన కొండం వీరబాబు ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతంతో మృతి చెందాడు. మృతుడు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం కలిగి ఉన్నాడు. దీంతో వీరబాబుకి బీమా సొమ్ము రూ.2 లక్షలుమంజూరయ్యాయి. రూ.2 లక్షల బీమా చెక్కును పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు గోపాల్, మాజీ జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఎంపీ రఘురాం రెడ్డి క్యాంపు కార్యాలయంలో నెహ్రూ జయంతి

నవతెలంగాణ-ఖమ్మం

భారత తొలి ప్రధాని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని నగరంలోని గట్టయ్య సెంటర్ లో ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించనున్నారని ఒక ప్రకటన లో తెలిపారు. ఉదయం 10:15 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు ,పార్టీ శ్రేణులంతా సకాలంలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

షుగర్ వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం



- సూర్య హాస్పిటల్ లో ఉచితంగా వ్యాధి పరీక్షలు
- డాక్టర్ ఎన్ ఎస్ పవన్ రెడ్డి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

మారుతున్న జీవన శైలితో శారీరక శ్రమ కంటే మానసిక ఒత్తిడి పెరగడంతో పాటు ఆహారపు అలవాట్లు వస్తున్న మార్పుల నేపథ్యంలో షుగర్ వ్యాధి ఎక్కువమందికి వస్తుందని సూర్య హాస్పిటల్ డాక్టర్ ఎన్ఎస్ పవన్ రెడ్డి అన్నారు. షుగర్ వ్యాధి పట్ల అత్యంత అప్రమత్తత అవసరమని వ్యాధి ప్రారంభంలోనే వైద్యుల సలహాలు సూచనలు తీసుకుంటే శ్రేయస్కరమని చెప్పారు. గురువారం ప్రపంచ షుగర్ వ్యాధి దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని బ్రిడ్జి రోడ్డులో గల సూర్య హాస్పిటల్‌లో ఉచిత చక్కెర వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించి డాక్టర్ సలహాలను కూడా అందిస్తున్నామని ఆయన నవతెలంగాణకు తెలిపారు. షుగర్ వ్యాధిగ్రస్తులు భయాందోళనకు గురికాకుండా సకాలంలో వైద్యుల సలహాలతో మందులు వాడుతూ తమ జీవనశైలిని డాక్టర్ సూచనలతో మార్పులు చేసుకొని సంతోషంగా జీవించవచ్చని అన్నారు. భద్రాచలం పట్టణంలో సూర్య హాస్పిటల్స్ ప్రారంభించి సంవత్సర కాలంలోపే ఎంతోమంది చక్కెర వ్యాధి రోగులకు చికిత్స అందించి ఉప సమితిని కల్పించామని స్పష్టం చేశారు. వ్యాధిని సరైన సమయంలో గుర్తించి వైద్యం పొందకపోతే ఆ ప్రభావం కిడ్నీలతోపాటు శరీరంలో ఇతర భాగాలపై పడే అవకాశం ఉందని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రపంచ షుగర్ వ్యాధి దినోత్సవం సందర్భంగా భద్రాచలంలో ఏర్పాటు చేస్తున్న ఈ ఉచిత వైద్య పరీక్ష శిబిరాన్ని భద్రాచలం పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాలలో ఉన్న షుగర్ వ్యాధి బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. భద్రాచలం ఏజెన్సీలో డాక్టర్ గీతా పావని నేతృత్వంలో కిడ్నీ రోగులకు వైద్య సేవలు అందిస్తున్న సూర్య హాస్పిటల్ ఏజెన్సీ ప్రాంత ప్రజల కోసం ఉచిత చక్కర వ్యాధి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు.



డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడానికి తోడ్పడాలి : ఎస్ఐ సాయికిషోర్

నవతెలంగాణ-దమ్మపేట

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ బి.సాయి కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. మండల పోలీసు శాఖ ఆధ్వర్యంలో దమ్మపేట హైస్కూల్ విద్యార్థులతో మాదకద్రవ్యాల వాడకం నిషేధించడానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు పాల్వంచ డిఎస్పి సూచనల మేరకు అశ్వారావుపేట సీఐ ఆధ్వర్యంలో బుధవారం దమ్మపేటలో ఈ ర్యాలీని నిర్వహించారు. గంజాయి అమ్మినా, కొన్నా, వినియోగించిన చట్టరీత్యా నేరమని అన్నారు. యువత డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను పాడుచేసుకోవద్దని అన్నారు. ఎవరైనా నిషేధిత గంజాయిని రవాణా చేస్తున్నట్లు గాని, విక్రయిస్తున్నట్లు గాని, సేవిస్తున్నట్లు గాని తెలిస్తే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించి డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడానికి అందరు తోడ్పడవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి, బాలస్వామి, కానిస్టేబుళ్లు నాగముత్యం, రాజులు, నరసింహారావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కొంగసాయి చంద్రరావుకు సీపీఐ(ఎం) నివాళి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అసోం రాష్ట్ర సరిహద్దుల్లో పహారా కాస్తూ మరణించిన వీర సైనికుడు కొంగ సాయి చంద్రరావు సేవలకు సీపీఐ(ఎం) భద్రాచలం పట్టణ కమిటీ ఘన నివాళి అర్పించింది. బుధవారం పట్టణంలో జరిగిన సాయి చంద్రరావు సంస్మరణ సభలో పార్టీ పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు బండారు శరత్‌బాబు మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన చంద్రరావు సేవలు చిరస్మరణీయమని అన్నారు. కొంగ సాయి చంద్రరావు తాత కొంగ సూర్యారావు మార్క్సిస్టు పార్టీ నేతగా ప్రజలందరికీ సుపరిచితులని, నిత్యం ప్రజలకు సేవ చేయాలనే తపన కలిగిన కుటుంబమని చెప్పారు. ఆ కుటుంబం నుంచి సాయి చంద్రరావు కూడా సైనికునిగా దేశానికి సేవ చేయాలనే దృక్పథంతో సైన్యంలో చేరి 12 సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల్లో సేవలందించారని తెలిపారు. ఇటీవల అసోం సరిహద్దుల్లో ఏనుగుల గుంపు దాడిలో గాయపడి వీరమరణం పొందారని అన్నారు. ఆయన స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు పి.సంతోష్ కుమార్, నాదెళ్ల లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు డి.సీతాలక్ష్మి, యు.జ్యోతి, జీవనజ్యోతి, నకిరికంటి నాగరాజు, శాఖ కార్యదర్శులు డి.రామకృష్ణ, జి. నాగలక్ష్మి జి.రాధ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో డాక్టర్లతో సమావేశం


- సమస్యలు పరిష్కరిస్తా : మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్వరలో డాక్టర్లతో సమావే శం నిర్వహించనున్నట్టు వైద్యారో గ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యకులు డాక్టర్ నరహరి, సెక్రెటరీ జనరల్ డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ రవూఫ్ నేతృత్వంలో ఆ సంఘం నాయకులు మంత్రిని కలిసి వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మంత్రికి ఆఫీస్ బేరర్లను పరిచయం చేశారు. త్వరలో జనరల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. డాక్టర్ల ప్రధాన సమస్యలైన 142 జీవో రద్దు, పీజీ చేసిన వారి సరెండర్స్, రెగ్యులర్ ప్రమోషన్స్, వీవీపీని సెకండరీ హెల్త్ గ్రేడ్ సర్వీసెస్‌గా మార్పు, సుదూర ప్రాంతాలలో పని చేస్తున్న వైద్యులకు పెరిఫెరల్ అలవెన్సు, డీహెచ్ పరిధిలో పని చేస్తున్న వైద్యులకు టైం బౌండ్ ప్రమోషన్లు తదితర డిమాండ్లపై గంటకుపైగా మంత్రితో చర్చించారు. వీటిపై మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించారు. డాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ దీనదయాళ్, నాయకులు డాక్టర్ రామ్ సింగ్, డాక్టర్ రాజు, డాక్టర్ కవి రమేష్, డాక్టర్ వినోద్, డాక్టర్ సంతోష్, డాక్టర్ రాధిక, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్య నేపథ్యంలో కేసు నమోదు

పోలీస్ స్టేషన్ ఎదుట తండ్రీ, కొడుకుల ఆత్మహత్యాయత్నం



నవతెలంగాణ-చేర్యాల

తమ బంధువులతో ఉన్న భూ సమస్యపై కేసు నమోదు కావడంతో చేర్యాల పోలీస్ స్టేషన్ ఎదుట బుధవారం సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన తండ్రీ, కొడుకులు అవుశెర్ల సత్యనారాయణ, వెంకటేష్ ఆత్మహత్యకు యత్నించిన ఘటన సంచలనం సృష్టించింది. కుమారుడు వెంకటేష్ విలేకరులతో మాట్లాడుతూ.. గత కొనేండ్లుగా తమ పెద్దనాన్నతో భూ సమస్య ఉందని, సమస్యను పరిష్కరించుకొనేందుకు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరుగుతున్నాయని తెలిపారు. కానీ, కొన్ని నెలలుగా ఈ సమస్యపై కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇరువురు నాయకులు తమపై పెద్ద నాన్నతో పోలీసులకు ఫిర్యాదు చేయించినట్టు చెప్పారు. వెంటనే భూ సమస్యను పరిష్కరించాలని అధికార పార్టీ నాయకులు పోలీసులపై ఒత్తిడి తీసుకురావడంతో పోలీసులు తమను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారన్నారు. దాంతో తీవ్ర మనస్తాపానికి గురై ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పు అంటించు కునేందుకు యత్నించామని తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ పి.నీరేష్ మాట్లాడుతూ.. తమపై ఎవరి ఒత్తిడి లేదని, భూమిని దున్నేందుకు వెళ్లిన ట్రాక్టర్‌ను తిప్పి పంపారని ఫిర్యాదు రావడంతో విచారణ కోసం వారిని స్టేషన్‌కు పిలిపించామన్నారు. ఇంతలోనే ఒంటిపై డీజిల్ పోసుకున్నారని తెలిపారు.

మరో నేత కార్మికుడు ఆత్మహత్య

- సిరిసిల్లలో వారం రోజుల్లో రెండో ఘటన



(ఫైల్)

నవతెలంగాణ - సిరిసిల్ల

ఆర్థిక ఇబ్బందులు తాళలేక సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కార్మిక క్షేత్రంలో మరో నేతన్న ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్డర్లు, పని లేక సిరిసిల్ల మగ్గాలు మూలన పడటంతో కార్మికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వరుసగా ఆత్మహత్యలు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

సిరిసిల్ల పట్టణంలోని 22వ వార్డు గణేష్‌నగర్‌కు చెందిన ఎర్రం కొమురయ్య(55) 8 నెలల నుంచి ఉపాధి లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెంది మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. కాగా సిరిసిల్లలో నేతన్నల వరుస ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. ఇటీవల పట్టణంలోని వెంకంపేటలో నేత కుటుంబానికి చెందిన అమర్-స్రవంతి దంపతులు ఆత్మహత్య చేసుకోగా, నాలుగు రోజులు గడవకముందే మరో నేత కార్మికుడు కొమురయ్య ఆత్మహత్య చేసుకోవడంతో సిరిసిల్లలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించాలి

- ఆత్మహత్యలను నివారించాలి : తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వస్త్ర పరిశ్రమపైనే ఆధారపడి బతుకుతున్న పవర్‌లూమ్ కార్మికుల పట్ల సర్కారు నిర్లక్ష్యం తగదనీ, వారికి సరైన ఉపాధి చూపి ఆదుకోవాలని తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే సిరిసిల్ల ప్రాంతంలో 16 మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్న విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. రెండు రోజుల వ్యవధిలోనే బైరి అమర్, స్రవంతి దంపతులు, ఎర్రం కొమురయ్య అనే పవర్‌లూమ్ కార్మికుడు ఆత్మహత్య చేసుకోవడం సమస్య తీవ్రతను తెలుపుతున్నదని తెలిపారు. ఇంతమంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. సిరిసిల్ల ఉరిసిల్లగా మారుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పవర్‌లూమ్ కార్మికుల చావులకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గతంలో బతుకమ్మ చీరల పథకం వల్ల కార్మికులకు ఉపాధి కలిగేదనీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల పథకాన్ని రద్దు చేసిందని వాపోయారు. దీనివల్ల కార్మికులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బతుకమ్మ చీరల స్థానంలో మహిళా స్వయం సహాయక బృందంలోని మహిళలకు రెండు చీరలు చొప్పున ఇస్తామనీ, దీని ద్వారా కార్మికులకు ఉపాధి కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందిగానీ ఉత్పత్తిని మాత్రం ప్రారంభించలేదని తెలిపారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యల తీవ్రతను అర్థం చేసుకొని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చీరలను ఉత్పత్తిని ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. వర్కర్ టు ఓనర్ పథకం కోసం నిర్మించిన 44 వర్క్‌షెడ్‌లను ఇతర సంస్థలకు అద్దెకిస్తూ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తున్నదని పేర్కొన్నారు. కార్మికులకే షెడ్లను కేటాయించాలని కోరారు.

రామాలయ అభివృద్ధికి అడుగులు

- పుష్కరకాలం తర్వాత ఏర్పడనున్న 14వ పాలకమండలి
- నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఊహల పల్లకిలో ఆశావహులు
- ఆదివాసీనే చైర్మెన్‌గా నియమించాలి : గిరిజన సంఘాలు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచల రామయ్య ఆలయ అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం పాలకమండలి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. చివరి 13వ పాలకమండలి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2010 నవంబర్ 26న కురిచేటి పాండు రంగారావు చైర్మెన్‌గా ఏర్పడి 2012 నవంబర్ 25 వరకు రెండేండ్ల పాటు కొనసాగింది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పాలకమండలికి నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. దాంతో ఆలయ అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగటం లేదని విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం పాలకమండలిని ఏర్పాటు చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో పాటు ఆలయ కమిటీని ఏర్పాటు చేసేందుకు కసరత్తులు ముమ్మరం చేసింది. 1960లో భద్రాద్రి దేవస్థానం రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్లింది. మొదటిసారి పాలక మండలి చైర్మెన్‌గా ఉన్న కల్లూరి చంద్రమౌళి మూడేండ్లు బాధ్యతలో కొనసాగారు.

అనంతరం బండి శోభనాచలం, ఎం.యతి రాజారావు, అల్లూరి మూర్తిరాజు, ముల్లపూడి హరిచంద్ర ప్రసాద్, కోనేరు నాగేశ్వరరావు, బొల్లా వెంకటేశ్వర్లు, కత్తుల శాంతమ్మ, కొండబాల కోటేశ్వరరావు, తాలూరి వెంకటేశ్వం రావు, ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, చివరిగా కుడిచేటి పాండురంగారావు బాధ్యతలు నిర్వహించారు.

ఆదివాసీ గిరిజనులకే అవకాశం ఇవ్వాలి

భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి పాలకమండలి ఏర్పాటుకు ఓ పక్క ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుండగా మరోపక్క ఆలయ కమిటీ సభ్యులతోపాటు చైర్మెన్ పదవి సైతం ఆదివాసీ గిరిజనులకే ఇవ్వాలని పలు ఆదివాసీ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఈ ప్రాంత ఆదివాసీ సంస్కృతి, సంప్రదా యాలు, ఆచార వ్యవహారాల్లో దేవస్థానానికి విడదీయలేని బంధం ఉన్న నేపథ్యంలో శబరి స్మృతి యాత్ర, దమ్మక్క ఉత్సవాలు వంటి గిరిజన సంప్రదాయ ఉత్సవాలను కాపాడేందుకు ఆదివాసీ గిరిజనులకే పాలకమండలిలో చోటు కల్పించాలని ఆయా సంఘాలు కోరుతున్నాయి. ఏదేమైనప్పటికీ 12 ఏండ్ల తర్వాత ఏర్పడనున్న పాలక మండలిలో ఈ ప్రాంత నాయకులతో పాటు రాష్ట్రంలోని ప్రముఖులు సైతం చోటు దక్కించుకోవాలనే ప్రయత్నాలు చేస్తున్నారు. దాంతో రామాలయ పాలకమండలి ఏర్పాటులో రసవత్తర పోటీ నెలకొంది.

ఊహల పల్లకిలో ఆశావహులు

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల జాప్యంతో నామినేట్ పదవులపై ఆశలు పెంచుకుంటున్న ఆశావహుల సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. ప్రత్యేకించి భద్రాచలం వంటి ఏజెన్సీ ప్రాంతంలో మెజార్టీ స్థానిక సంస్థల స్థానాలు రిజర్వుడు కావడంతో నామినేటెడ్ పదవి అయిన దేవస్థాన పాలకమండలి సభ్యులతోపాటు చైర్మెన్ పదవికి గిరిజనేతరుల నుంచి తీవ్ర పోటీ నెలకొన్నది. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఎంపీ బలరాం నాయక్‌ల ప్రధాన అనుచరులు ఈ పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అలాగే, అటవీశాఖ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ పొదెం వీరయ్య సైతం పాలకమండలిని తన అనుచరులకే అప్పజెప్పాలని అధిష్టానంపై ఒత్తిడి చేస్తున్నట్టు తెలిసింది. అంతేకాకుండా ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు సైతం భద్రాచలం పాలకమండలిపై ప్రత్యేక దృష్టి పెట్టి తమ అనుచరులకు కమిటీలో చోటు కల్పించేందుకు పావులు కదుపుతున్నట్టు సమాచారం.

లగచర్ల ఘటనలో అరెస్టుల పర్వం

(మొదటిపేజీ తరువాయి)

16 మందిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు బుధవారం మరో ఐదుగురిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. రాళ్లదాడి కారణంగా కలెక్టర్, ఇతర అధికారులతోపాటు పోలీసులకు సైతం గాయాలయ్యాయని రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్

లగచర్ల దాడి ఘటనలో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, మరో నలుగురిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. దాడి ఘటనలో ప్రధాన నిందితుడైన సురేష్ నరేందర్‌రెడ్డి అనుచరుడు కావడంతో ఆయన ఫోన్ కాల్ డేటా, సంభాషణలపై పోలీసులు దర్యాప్తు చేయగా.. ప్రధాన నిందితుడు సురేష్‌తో మాట్లాడినట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో పోలీసులు బుధవారం హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కు వద్ద పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేసి వికారాబాద్ డీటీసీకి తరలించారు. అక్కడ విచారణ అనంతరం కొడంగల్‌కు తీసుకెళ్లి అక్కడి ప్రాథమిక వైద్య కేంద్రంలో పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరు పరిచారు. విచారణ అనంతరం మాజీ ఎమ్మెల్యేతో పాటు నలుగురు రైతులకు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. అనంతరం పోలీసులు ఆయనను, రైతులను చర్లపల్లి జైలుకు తరలించారు. పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేసిన సమాచారం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు కోర్టు అవరణకు పెద్ద ఎత్తున చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా, కొండగల్‌లో ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏ 1గా నరేందర్ రెడ్డి : మల్టీ జోన్ టు ఐజీ వి. సత్యనారాయణ

జిల్లా అధికారుల దాడిలో ఏ1గా పట్నం నరేందర్‌రెడ్డి పేరు నమోదు చేసినట్టు మల్టీ జోన్ 2 ఐజీ వి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ కె. నారాయణరెడ్డితో కలిసి సత్యనారాయణరెడ్డి విలేకరులతో మాట్లాడారు. జిల్లా అధికారుల దాడి కేసులో ఇప్పటివరకూ 47 మందిని అరెస్టు చేశామని, వీరిలో 21 మందిని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు. వారిలో ప్రధాన నిందితుడైన సురేష్ వాళ్ల సొంత తమ్ముడితో పాటు పట్నం నరేందర్‌రెడ్డి కూడా ఉన్నారు. మిగతా వారి కోసం నాలుగు బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు. గ్రామానికి చెందిన వ్యక్తులు కొందరు అధికారులపై జరుగుతున్న దాడిని అడ్డుకున్నారని తమ విచారణ తేలినట్టు చెప్పారు. దాడిలో పాల్గొన్న 19 మందికి అసలు భూమే లేదని, మరికొంతమందికి భూమి ఉన్నా.. భూసేకరణ పరిధిలోకి రాదని తెలిపారు. అధికారులపై దాడి చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని స్పష్టంచేశారు. కాగా, మంగళవారం వరకు ఏ 1గా సురేశ్ అనుకున్నాం. బుధవారం ఏ 1గా నరేందర్‌రెడ్డి అనుకున్నట్టు తెలిపారు. అధికారులను తప్పుదోవ పట్టించిన సురేష్‌పై గతంలో కొన్ని కేసులున్నాయని తెలిపారు.

లగచర్లకు ఎంపీ డీకే అరుణ.. అడ్డగింత

బీజేపీ ఎంపీ డీకే అరుణ లగచర్ల పర్యటనకు వెళ్లగా.. ఉద్రిక్తత చోటుచేసుకుంది. లగచర్లకు వెళుతుండగా పూడూరు మండలం మన్నెగూడ వద్ద పోలీసులు ఆమె కాన్వాయ్ ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. జిల్లా కలెక్టర్‌ను కలిసేందుకు వెళుంటే అడ్డుకోవడమేంటని పోలీసులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో అక్కడి నుంచే వికారాబాద్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడించగా.. ఆయన అనుమతించారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకున్న డీకే అరుణ.. లగచర్ల ఘటనపై కలెక్టర్‌తో మాట్లాడి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎం ప్రతిష్టలను దిగజార్చాలని చేసిన ఘటన : కాంగ్రెస్ కొడంగల్ ఇన్‌చార్జి ఏ. తిరుపతిరెడ్డి

జిల్లా కలెక్టర్, అధికారులపై దాడి చేసి సీఎం, రాష్ట్ర ప్రభుత్వ పేరు ప్రతిష్టలను దిగజార్చాలని చేసిన కుట్ర అని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను పరామర్శించి లగచర్ల దాడి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. జిల్లా ఉన్నతాధికారులపై దాడి బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డిని బద్నం చేయడానికే హరీశ్‌రావు, కేటీఆర్ పథకం ప్రకారం ప్లాన్ చేశారని ఆరోపించారు. దాడిలో సంబంధం లేని రైతుల జోలికి వెళ్లబోమని తెలిపారు. రైతులకు ఎలాంటి భిన్నాభిప్రాయాలు ఉన్నా ఉన్నతాధికారులకు చెప్పుకోవచ్చుని, దానికి ఎవరూ అభ్యంతరం చెప్పరని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ విషయంలో వందలాది మంది రైతులను తీవ్రంగా కొట్టారని, భయభ్రాంతులకు గురిచేసి భూసేకరణ చేశారని, ఈ ప్రభుత్వంలో అలాంటి చర్యలు చేపట్టడం లేదని తెలిపారు. అమాయక ప్రజలను రెచ్చగొట్టి రౌడీలతో దాడి చేయించారని ఇది మంచి పద్ధతి కాదని అన్నారు.

ప్రజాకవి కాళోజీ సేవలు చిరస్మరణీయం

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- ఘనంగా కాళోజీ వర్ధంతి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు సేవలు చిరస్మరణీయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కాళోజీ నారాయణ రావు వర్ధంతి సందర్భంగా బుధవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం (ప్రజా భవన్)లో కాళోజీ చిత్రపటానికి స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అస్తిత్వాన్ని, సాహిత్య సాంస్కృతిక గరిమను ప్రపంచానికి చాటిన మహోన్నతమైన వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. కవిగా.. తన కలం, గళంతో పాటు తన జీవితాన్నే తెలంగాణ కోసం అర్పించిన వ్యక్తి కాళోజీ అని తెలిపారు. ఆయన గుర్తుగా నిర్మించిన కాళోజీ నారాయణరావు కళాక్షేత్రాన్ని ఈ నెల 19న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించుకుంటున్నట్టు చెప్పారు. నక్కలగుట్ట ప్రధాన రహదారిలో ఉన్న కాళోజీ నారాయణరావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై ఇలాంటి దారుణం ఎప్పుడూ జరగలే..

- మంత్రి దామోదర రాజనర్సింహ
- కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మెన్ వెంకట్‌రెడ్డికి పరామర్శ



నవతెలంగాణ-హస్తినాపురం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ అధికారులపై ఇంత దారుణమైన దాడులు ఎన్నడూ జరగలేదని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఈ ఘటన రాజకీయ కుట్రలో భాగంగా కనిపిస్తోందన్నారు. వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామస్తుల దాడిలో గాయపడిన కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మెన్ వెంకట్‌రెడ్డిని హైదరాబాద్ హస్తినాపురం డివిజన్ పరిధి ఇంద్రప్రస్థ కాలనీలో వారి నివాసంలో బుధవారం మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ.. కొడంగల్ నియోజకవర్గంలో జరిగిన ఘటనలో అధికారులు గాయపడటం బాధాకరమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. అధికారులపై దాడి విధానాన్ని బీఆర్‌ఎస్ నాయకులు ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. హింస మార్గం ద్వారా ఏదీ సాధ్యం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఏనాడూ అధికారులపై ఇలాంటి దాడులకు ఉసిగొల్పలేదని గుర్తు చేశారు. దాడుల సంస్కృతిని ప్రోత్సహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు నిజంగానే అన్యాయం జరిగే అవకాశం ఉంటే ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు వెళ్లాలని, అంతేకానీ ఇలా అధికారులపై దాడులకు పాల్పడటం సమంజసం కాదని అన్నారు. మంత్రుల వెంట కాంగ్రెస్ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మధుయాష్కీ, తదితరులున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో అదనపు ఎస్పీ భుజంగరావు బెయిల్ రద్దు

- ఆదేశాలు జారీ చేసిన నాంపల్లి కోర్టు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడైన అదనపు ఎస్పీ భుజంగరావు బెయిల్‌ను నాంపల్లి కోర్టు బుధవారం రద్దు చేసింది. గురువారం లోగా ఆయన వెంటనే చంచల్‌గూడ జైలుకు వెళ్లాలని ఆదేశించింది. తనకు పూర్తిగా బెయిల్ మంజూరు చేయాలంటూ భుజంగరావు తన న్యాయవాది ద్వారా నాంపల్లి కోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. అయితే, కేసు విచారణ కీలక దశలో ఉన్నందున భుజంగరావుకు బెయిల్ మంజూరు చేయరాదనీ, ప్రస్తుతం ఆయనకు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను కూడా రద్దు చేయాలని ఈ కేసు దర్యాప్తు చేస్తున్న జూబ్లీహిల్స్ స్పెషల్ టీమ్ పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది వాదించారు. మధ్యంతర బెయిల్‌ను రద్దు చేస్తూ వెంటనే జైలుకు వెళ్లాలని కోర్టు ఆదేశించింది. అనారోగ్య కారణంగా వైద్యపరీక్షల నిమిత్తం ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. తాజాగా బెయిల్ రద్దు కావడంతో గురువారం భుజంగరావు చంచల్‌గూడ జైలుకు వెళ్లి రిపోర్టు చేయనున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

- పంటంతా దళారులపాలు
- పత్తి రైతుల పరిస్థితి అధ్వానం
- సీఎంకు ఎక్సైజ్ శాఖ మీద ఉన్న సోయి రైతులపై లేదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



నవతెలంగాణ-మర్రిగూడ

ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాలో గత సంవత్సరం 4 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగితే, ఈ సంవత్సరం కృష్ణా నదిలో నీరు రావడం, సాగర్ ప్రాజెక్టు నిండటం వల్ల దాదాపు ఐదున్నర లక్షల ఎకరాల్లో వరి సాగైందని తెలిపారు. దాదాపు ఏడున్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు, ప్యాక్స్ కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశారన్నారు. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ధాన్యమంతా దళారుల పాలైందని విమర్శించారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామన్న ముఖ్యమంత్రి నేటికీ ఆ ఊసే ఎత్తటం లేదన్నారు. ఎన్నికల హామీలో రైతులకు అన్ని పంటలకు బోనస్, రూ.15 వేల రైతు భరోసా, రెండు లక్షలు రుణమాఫీ చేస్తానన్న కాంగ్రెస్.. అధికారంలోకొచ్చి 11 నెలలు అవుతున్నా అమలు చేయకుండా రైతులను మోసం చేస్తోందన్నారు. సివిల్ సప్లై మంత్రి ఉన్న నల్లగొండ జిల్లా రైతులే దాదాపు నాలుగైదు సార్లు రోడ్డు ఎక్కారని చెప్పారు. ఆరు గ్యారంటీల అడ్రస్సే లేదని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే పెట్టి ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు.

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. కొనుగోళ్లు జరగక, మద్దతు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయని చేతలు మాత్రం గడప దాటడం లేదని, ఆయనకు ఎక్సైజ్ శాఖ మీద ఉన్న సోయి రైతులపై లేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతే రాజుగా ఉన్నారని, కరోనా సమయంలో కూడా రైతులకు పెట్టుబడి సహాయం అందిందని, 11 సార్లు రైతుబంధు సహాయం అందిందని గుర్తు చేశారు. ప్రభుత్వం తక్షణమే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు పొనుగోటి అంజన్‌రావు కుటుంబాన్ని హరీశ్‌రావు పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు పాల్వాయి స్రవంతి, మాజీ ఎంపీపీ మెండు మోహన్ రెడ్డి, మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ దంటు జగదీశ్వర్, ఎఫ్‌ఎస్‌సిఎస్ చైర్మెన్ బాల నరసింహ, ప్యాక్స్ చైర్మెన్ పందుల యాదయ్య గౌడ్, బచ్చు రామకృష్ణ, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు చెరుకు లింగంగౌడ్, మాజీ ఎంపీటీసీ ఊరుపక్క సరిత నగేష్, మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య ఉన్నారు

సుకినీతండా కుర్రోడు సూపర్

- జాతీయ స్థాయిలో గిరిజన కీర్తి పతాక.. కార్తీక్
- మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఎగ్జామ్‌లో ర్యాంక్
- పేటెంట్స్ అండ్ డిజైన్స్ ఎగ్జామినర్‌గా ఎంపిక
- ఆన్‌లైన్ కోచింగ్‌తోనే సక్సెస్



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

'పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది' అన్నట్టు గిరిజన ఆణిముత్యం మాలోత్ కార్తీక్ చిన్ననాటి నుంచి చదువులో రాణిస్తున్నారు. తాను జన్మించింది.. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మారుమూల గిరిజన తండాలోనైనా అతని చదువులో రాణిస్తున్న తీరుతో స్వగ్రామం సుకినీతండాకు పేరు ప్రఖ్యాతలు దక్కుతున్నాయి. మూడేండ్ల క్రితం ఇంజనీరింగ్ సర్వీస్ ఎగ్జామ్‌లో జాతీయస్థాయి 27వ ర్యాంక్ సాధించిన కార్తీక్ లిగ్నైట్ ఇండియా లిమిటెడ్‌లో డీఈగా ఉద్యోగం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఐఈఎస్‌లో ఎలక్ట్రానిక్స్, టెలి కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగంలో ఆరుగురిని ఎంపిక చేయగా కార్తీక్ నాలుగో స్థానం పొందటం గమనార్హం. ఇప్పుడు అదే పట్టుదలతో ఆన్‌లైన్‌లో విద్యనభ్యసిస్తూ మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పేటెంట్స్ అండ్ డిజైన్స్ ఎగ్జామినర్'గా ఎంపికయ్యారు. ఈ పరీక్షలో మాలోత్ కార్తీక్ జాతీయ స్థాయిలో 515వ ర్యాంక్ సాధించారు. గతేడాది డిసెంబర్‌లో ప్రాథమిక పరీక్ష, ఈ ఏడాది జనవరి 25న నిర్వహించిన మెయిన్స్ పేపర్-1, ఫిబ్రవరి 5న మెయిన్స్ పేపర్-2, ఏప్రిల్ 1 నుంచి 26 మధ్య నిర్వహించిన ఆఫ్‌లైన్ ఇంటర్వ్యూలకు కార్తీక్ హాజరయ్యారు. ఇందులో ఆయన ప్రతిభ చాటి జాతీయ స్థాయిలో 515వ ర్యాంక్ పొందారు. గ్రూప్-ఏ గెజిటెడ్ స్థాయి ఉద్యోగం సాధించి ఆదర్శంగా నిలవడంతో కార్తీక్ తల్లిదండ్రులు పార్వతి, బాషా హర్షం వెలిబుచ్చారు.

మాలోత్ కార్తీక్ చిన్ననాటి నుంచి చదువులో మేటి. కార్తీక్ ఖమ్మంలో పదో తరగతి, హైదరాబాద్‌లో ఇంటర్, గౌహతి ఐఐటీ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌ను 2019లో పూర్తి చేశారు. చిన్ననాటి నుంచి నేటి వరకు ప్రతి పరీక్షల్లోనూ టాపర్‌గానే నిలుస్తున్నారు. సివిల్స్‌లో ర్యాంకు సాధించి ఐఏఎస్, ఐపీఎస్, ఇంజినీరింగ్ సర్వీసులకు ఎంపిక కావడమే తన లక్ష్యమని మాలోత్ కార్తీక్ తెలిపారు. కష్టపడి చదవడంతో పాటు అన్ని సబ్జెక్ట్‌లపై పట్టు సాధిస్తే ఏ పరీక్ష అయినా సక్సెస్ కావొచ్చని, జాతీయ స్థాయిలో ఇప్పటికీ రెండు, మూడు పర్యాయాలు ర్యాంకులు సాధించడం ఆనందంగా ఉందని అన్నారు. కాగా, జాతీయ స్థాయి పరీక్షలో ర్యాంకు సాధించిన కార్తీక్‌ను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, అక్కడే రెసిడెన్షియల్ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న అతని తల్లి పార్వతి, వైరాలోనే ఎక్సైజ్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న అతని తండ్రి బాషా, అక్క మౌనిక, వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ నర్సింహారావు, తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం తదితరులు అభినందించారు. కుటుంబసభ్యులతో పాటు వీరంతా ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపారు.

పిల్లల పెంపకంలో ప్రత్యేకత

ఆనాటి పిల్లల పెంపకం వేరు.. ఈనాటి పిల్లల పెంపకం వేరు. ఆనాటి ఉమ్మడి కుటుంబాలు నేడు ఒంటరి కుటుంబాలు. తాతయ్యలు, అమ్మమ్మలు లేని ఇల్లు ఒంటరిగా మిగిలిపోతోంది. తల్లిదండ్రులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో బిజీగా గడుపుతూ పిల్లలకి ఎలాంటి నడవడికలు నేర్పాలి, అన్నం ఎలా తినిపించాలి, కమ్యూనికేషన్ స్కిల్స్ ఎలా నేర్పించాలి, నలుగురుకి ఆత్మీయతలు ఎలా పంచాలో తెలపటం లేదు. పిల్లలేమో ఒంటరిగా లాప్టాప్‌లు, సెల్ ఫోన్లతో జీవిస్తున్నారు. ఇలాంటి తల్లిదండ్రులకు నేడు బాలల దినోత్సవం సందర్భంగా నేను చెప్పే ఈ మాటలు ఉపయోగపడతాయని భావిస్తున్నాను.



పిల్లల పెంపకంలో కమ్యూనికేషన్స్ స్కిల్స్ చాలా ముఖ్యం. అమ్మానాన్న ఉద్యోగాలు చేస్తూ తీరికలేకుండా బతికేస్తున్నారు. పిల్లల చేతిలో సెల్‌ఫోన్ పెట్టేసి తమ పని చూసుకుంటున్నారు. ఆ సెల్ ఫోను, టీవీనే తమ ప్రపంచం అనుకుంటున్నారు పిల్లలు. దీని వల్ల నర్సరీలోనో, ఎల్‌కేజీలోనో పిల్లలని జాయిన్ చేసినప్పుడు మిగిలిన పిల్లలతో ఎలా కలవాలో వారికి తెలియటం లేదు. పిల్లలతో కలిసి ఎలా ఆడుకోవాలో తెలియటం లేదు. ఎక్స్ట్రీమ్‌గా బిహేవ్ చేస్తున్నారు. కాబట్టి పిల్లలని ప్రతి రోజు ఓ గంట పార్కులకు తీసుకెళ్లి వారి వయసున్న పిల్లలతో మాటలు కలుపుతూ ఆడుకునేలా చేయాలి. ప్రతిరోజూ వీలుకాకపోతే కనీసం వారానికి ఒక రోజైనా తీసుకెళ్లాలి.

ఆడించండి పాడించండి

నేటి తరం కాళ్ళకి చెప్పులు లేకుండా నడవటం లేదు. కళ్ళకి అద్దాలు లేకుండా గడవడం లేదు. నీటిలో ఆటలు అసలే లేవు. సూర్య కిరణాలు పసిపిల్లల దేహానికి తగలటం లేదు. ఆకాశాన్ని చూసిన పాపాన పోవటమే లేదు. మరి ఇలాంటి పరిస్థితుల్లో పసిపిల్లల రేపటి భవిష్యత్తు ఏమవుతుంది? కనుక ప్రతి తల్లి, తండ్రి తెలుసుకోవలసిన ముఖ్య విషయాలు ఏమిటంటే అప్పుడప్పుడు కాళ్ళకి చెప్పులు లేకుండా కనీసం ఓ 20 నిమిషాలైనా మట్టిలో పిల్లలని నడిపించాలి. టబ్బులో కానీ బకెట్లో కానీ నీరు పోసి ఆ నీటితో 20 నిమిషాలు ఆడించాలి. తర్వాత స్నానం పోయాలి. ప్రతిరోజూ ఉదయం, సాయంకాలం సూర్య కిరణాలు పిల్లల దేహాన్ని తాకేటట్టుగా బయట ఉంచాలి, ఆడించాలి. ప్రతిరోజూ ఆకాశాన్ని కళ్ళకు అద్దాలు లేకుండా చూపించాలి. నాలుగు గోడల మధ్య ఏసీలో కాకుండా ఆరుబయట 20 నిమిషాలు పిల్లలను చల్లగాలికి తిప్పాలి. స్వచ్ఛమైన గాలి, నీరు పిల్లలకు అందేలా చూడాలి.

ప్రకృతిలో గడపనివ్వండి

ఆకాశం, భూమి, నీరు, గాలి, సూర్య కిరణాలు... వీటితో కనక పిల్లలకి అనుబంధం ఏర్పడితే వారి ఆరోగ్యానికి ఎంతో మంచిది. లేదంటే పిల్లలు అనేక జబ్బుల బారిన పడతారు. నా కౌన్సెలింగ్‌లో పసిపిల్లలకి కళ్ళు కనిపించకుండా వస్తారు. ప్రకృతి సృష్టించిన రంగులన్నీ మన కళ్ళతో చూడాలి. కొన్ని రంగులు చూడకపోతే రాను రాను కళ్ళ సమస్య ఏర్పడి గుడ్డివాళ్ళం అవుతాం. నిరంతరం ఎక్కువ గ్రావిటీ ఉన్నటువంటి సెల్ ఫోన్, ల్యాప్టాప్‌లను స్క్రీన్ మీద చూడటం వల్ల కళ్ళజబ్బులు, చెవులు వినపడకపోవటం జరుగుతున్నాయి. కనుక తల్లిదండ్రులు ఈ చిన్న సూచనలను పాటించి మన పిల్లల్ని ప్రకృతి ఒడిలో ఆడుకునేలా చేయాలి. వారి రేపటి భవిష్యత్తు అందంగా తీర్చిదిద్దాలి. పిల్లలు ప్రకృతితో గడిపేలా చేయడం వల్ల ఖర్చు అయ్యేది ఏమీ లేదు. కానీ మీ పిల్లలు ఆరోగ్యంగా, ఆనందంగా, సంతోషంగా చక్కగా ఎదుగుతారు. వారి మానసిక ప్రవృత్తిలో చాలా మార్పు వస్తుంది. ఈ విషయాన్ని నేను ప్రాక్టికల్‌గా చెబుతున్నాను. నేటి బాలలే రేపటి పౌరులు. ఆడుదాం పాడుదాం. అల్లరి చేసేద్దాం. నవ్వుతూ నవ్విస్తూ నలుగురిలో జీవించేద్దాం.

ఒంటరిగా వదలొద్దు

పిల్లల్ని ఒంటరిగా వదిలి పెట్టినప్పుడు ఒంటరితనానికి అలవాటు పడిపోయి ఆటిజం వస్తోంది. ఇటీవల ఆటిజం కేసులు పెరుగుతున్నాయి. అలాగే హైపర్ యాక్టివ్‌నెస్ కూడా చాలా పెరుగుతుంది. దీనికి కారణం వారు ఒంటరిగా జీవించడమే. పసి మనసులకు ఆత్మీయత, ప్రేమ, అక్కున చేర్చుకునే భావన చాలా ముఖ్యం. పని ఒత్తిడితో తల్లిదండ్రులు ఒకరినొకరు దూషించుకోవడం, తిట్టుకోవడం, మాట్లాడుకోకపోవటం, వారి కోపాన్ని పసిపిల్లల మీద చూపించడం వల్ల వారిలో హైపర్ యాక్టివ్‌నెస్ పెరిగి అది ఆటిజంకు దారి తీస్తోంది. ఇది ప్రస్తుత పరిస్థితుల ద్వారా వస్తున్నదే కానీ జీన్స్ వల్ల కాదు. కనుక తల్లిదండ్రులు మీ పిల్లలకు ఆత్మీయతలను, ప్రేమను పంచి గొప్ప పౌరులుగా తీర్చిదిద్దండి. రేపటి తరానికి ఆరోగ్యవంతమైన పిల్లలను అందివ్వండి. కుటుంబం అనేది చాలా గొప్ప వ్యవస్థ. అందులో ఆనందం అనుభవిస్తే కానీ తెలియదు. అందుకే కుటుంబ వ్యవస్థను పటిష్టం చేద్దాం.

- డాక్టర్ లక్కరాజు నిర్మల

పిల్లల పెంపకంలో కొన్ని ముఖ్యమైన అంశాలు



- **ప్రేమ-ఆత్మీయత:** పిల్లలకు ప్రేమ, ఆత్మీయత చాలా అవసరం. వారికి సరైన మార్గదర్శకత్వం, ప్రేమతో కూడిన వాతావరణాన్ని అందించాలి. అప్పుడే పిల్లలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతారు.
- **కమ్యూనికేషన్:** పిల్లలతో సత్సంబంధాలు ఏర్పరచుకోవడానికి తల్లిదండ్రులు వారితో సంభాషించడం, వారు చెప్పేది ఓపిగ్గా వినడం, వారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం చాలా ముఖ్యం.
- **సమయం:** పిల్లలతో గడిపే సమయం చాలా విలువైంది. పనుల ఒత్తిడితో వారితో తక్కువ సమయం గడిపినా నాణ్యమైన సమయం కేటాయించండి.
- **మార్గదర్శకత్వం:** పిల్లలు సరైన మార్గంలో పెరగడానికి వారికి సరైన మార్గదర్శకత్వం అవసరం.
- **ధైర్యం:** పిల్లలు ప్రతి విషయానికి భయపడకుండా ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ఉండేలా తీర్చిదిద్దాలి.

గంటల తరబడి కూర్చుని పనిచేస్తున్నారా..?

ఇటీవల వర్క్ ఫ్రమ్ హోమ్‌లు ఎక్కువయిపోయాయి. కంటిన్యూగా గంటల తరబడి కూర్చుని పనిచేయడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. సిట్టింగ్ జాబ్స్ ప్రాణాంతకంగా మారుతున్నాయనే హెచ్చరికలు ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. చాలామంది ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయంలో కూర్చొని పనిచేస్తుంటారు. లేదంటే ఇంట్లో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లతో గంటలతరబడి కుస్తీలు పడుతుంటారు. అయితే, ఒకేచోటు అలా కూర్చుని పనిచేయడం వల్ల రక్త ప్రసరణ సరిగా లేక డీప్ వీన్ త్రాంబోసిస్ (డీవీటీ) అనే వ్యాధికి గురయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రోజంతా కార్యాలయం పనిలో నిమగ్నమయ్యి, పని ఒత్తిళ్లను ఎదుర్కొన్నా రోజుకు కనీసం 40 నిమిషాల పాటు వ్యాయామం తప్పక చేయాలని నిపుణులు చెబుతున్నారు. వ్యాయామం, నడక లాంటి వ్యాపకాలతో మంచి ఫలితాలు అందుతాయని నిపుణులు అంటున్నారు. రోజులో గంటలతరబడి ఒకేదగ్గర కూర్చుని పనిచేయడం వల్ల ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొవాలంటే వ్యాయామమే దానికి సరైన మార్గమని నిపుణులు సూచిస్తున్నారు.

గంటల తరబడి కదలకుండా కూర్చుని చేసే ఉద్యోగాల వల్ల అనారోగ్య సమస్యలు ఉంటాయని, వాటివల్ల ఎదురయ్యే దుష్ఫలితాలకు సంబంధించి నిర్వహించిన వివిధ పరిశీలనను 'మెటా అనాలిసిస్'చేసింది. డబ్ల్యూహెచ్‌వో మార్గదర్శకాలకు అనుగుణంగా మెరుగైన ఆరోగ్యం కోసం బిజిలైఫ్‌లో రోజువారీ జీవన విధానాన్ని కొంత మార్చుకుని, దినచర్యలో భాగంగా ఫిజికల్ యాక్టివిటీస్ వంటివి చేర్చితే మెరుగైన ఫలితాలు వస్తాయని నిపుణులు భావిస్తున్నారు.

అనారోగ్య సమస్యలు ఇవే..

- గంటలతరబడి కూర్చుని ఉండడం వల్ల కదలికలు లేక కాళ్లలో రక్తం, ద్రావకాలు ఒకేచోట చేరడం వల్ల గుండెజబ్బులు వచ్చే సమస్యలు అధికంగా ఉన్నాయి.
- ఇది రక్తప్రసారంలో మార్పులకు కూడా కారణమవుతుంది దీంతో అధిక రక్తపోటుకు దారితీస్తుంది.
- ఎక్కువసేపు ఒకేచోట కూర్చుని పనిచేయడం వల్ల మధుమేహ సమస్యలు కూడా వచ్చే అవకాశాలున్నాయి.
- గంటల తరబడి కూర్చోవడం వల్ల కొన్నిరకాల కేన్సర్‌ల బారిన పడే అవకాశం కూడా ఉంది.
- మానసిక ఒత్తిళ్లతో పాటు ఆందోళనలు, చిరాకు వంటివి కూడా పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

వీటిని చేయండి..

- ఎక్కువ సేపు కూర్చోకుండా మధ్యమధ్యలో లేచి నిల్చోవాలి.
- కొంత దూరం అటు ఇటు నడిస్తే మంచిది.
- చేస్తున్న పని నుంచి కొంతసేపు విరామం తీసుకోవాలి.
- కూర్చునే పనిచేయకుండా కాసేపు వీలును బట్టి నిల్చోవాలి.

'బుల్డోజర్ న్యాయం' రాజ్యాంగ విరుద్ధం..

(మొదటిపేజీ తరువాయి)

ఇలాంటి అధికార దుర్వినియోగానికి పాల్పడితే వారికి జరిమానా విధించాల్సి ఉంటుంది. హక్కుల విషయంలో దుర్మార్గంగా ప్రవర్తించిన వారిని న్యాయస్థానం విడిచిపెట్టదు" అని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఆర్టికల్ 142 ప్రకారం కీలక మార్గదర్శకాలు

కూల్చివేత ఉత్తర్వులు ఆమోదించిన తరువాత కూడా అవసరమైతే వాటిని సవాలు చేయడానికి బాధిత పక్షానికి సమయం ఇవ్వాలి. రాత్రిపూట ఇండ్లు ఖాళీ చేయించి మహిళలు, పిల్లలను రోడ్లపై నిలబెట్టడం సరైన చర్యకాదు. షోకాజ్ నోటీసు లేకుండా కూల్చివేయొద్దు. దానికి మున్సిపల్ చట్టాలలో ఇచ్చిన సమయం ప్రకారం లేదా నోటీసు తేదీ నుంచి 15 రోజులలోపు ఏది ఆలస్యమైతే దానికి సమాధానం ఇవ్వాలి. మునుపటి తేదీ నుంచి ఎలాంటి ఆరోపణలు వచ్చినా కూల్చివేతలను నిలిపి వేయాలని కలెక్టర్ ద్వారా షోకాజ్ నోటీసు పంపబడుతుంది. నేటి నుంచి నెల రోజుల్లోగా నిర్మాణాల కూల్చివేతలకు నోడల్ అధికారిని డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ (డీఎం) నియమించనున్నారు. నోటిసు ఉల్లంఘన రకం, వ్యక్తిగత విచారణ తేదీ, విచారణకు రావాల్సిన వారి వివరాలు అందులో తెలియజేయాలి. నిర్దిష్ట డిజిటల్ పోర్టల్లో దానిని అందుబాటులో ఉంచాలి. అథారిటీ వ్యక్తిగా విచారణను నిర్వహిస్తుంది. అది రికార్డు చేయబడుతుంది. ఆ తరువాత తుది ఉత్తర్వు జారీ చేయబడుతుంది. ఇది చట్టవిరుద్ధమైన నిర్మాణం చర్చించదగినదేనా అని సమాధానం ఇవ్వాలి. కూల్చివేత ఉద్దేశం ఏమిటో చెప్పాలి. కూల్చివేతలను వీడియో తీసి నివేదికను డిజిటల్ పోర్టల్ లో ఉంచాలి.

కూల్చివేతల నిబంధనలు ఉల్లంఘించిన అధికారులదే బాధ్యత

కూల్చివేత నిబంధనలను ఉల్లంఘించిన అధికారులు బాధితుల ఆస్తులకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. నష్టపరిహారం చెల్లించడంతో పాటు వారి వ్యక్తిగత ఖర్చుల బాధ్యత కూడా వారిదే. నోటీసు బ్యాక్-డేటింగ్ ఆరోపణలను నిరోధించడానికి యజమాని/ఆక్రమణదారుకు షోకాజ్ నోటీసు అందిన వెంటనే, కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయానికి సమాచారం పంపబడుతుంది. స్వయంచాలక రసీదు వారి కార్యాలయం ద్వారా ఉండాలి. ప్రతి మున్సిపల్ స్థానిక అధికారం ఇప్పటి నుంచి మూడు నెలలలోపు నిర్దేశించబడిన డిజిటల్ పోర్టల్‌ను కేటాయించాలి. అందులో సేవకు సంబంధించిన వివరాలు, నోటీసును అతికించడం, ప్రత్యుత్తరం ఆమోదించబడిన ఆర్డర్ మొదలైన వివరాలు ఉండాలి.అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

కూల్చివేతలు చేపట్టే అధికారం ఎవరికీ లేదు

(మొదటిపేజీ తరువాయి)

జరిగినా లేదా న్యాయస్థానం ద్వారా కూల్చివేతకు ఆదేశించినా తమ ఆదేశాలు వారికి వర్తించవని కోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగం, క్రిమినల్ చట్టాల ప్రకారం నిందితులు, దోషులకు కూడా కొన్ని హక్కులు ఉంటాయని వాటిని రక్షించాల్సిన అవసరం ఉందని తెలిపింది.

పట్నం నరేందర్‌రెడ్డి కుటుంబానికి కేటీఆర్ పరామర్శ

నవతెలంగాణ - బంజారాహిల్స్

కలెక్టర్‌పై దాడి ఘటనలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. దాంతో హైదరాబాద్ ఫిలింనగర్‌లోని పట్నం నరేందర్‌రెడ్డి నివాసానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ వెళ్లారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రజాకవి కాళోజీ నిత్య స్మరణీయుడు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

'అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి, అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి, అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకు ఆరాధ్యుడు' అని ప్రకటించిన ప్రజాకవి కాళోజి నారాయణరావు నిత్య స్మరణీయుడని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. కాళోజి నారాయణరావు వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం నాడిక్కడ తుగ్లక్ రోడ్‌లోని తన అధికారిక నివాసం కాళోజి నారాయణరావు చిత్రపటానికి సీఎం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ ప్రోగ్రాంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సీఎం మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ముంబయి బయలుదేరి వెళ్లారు.

ముగిసిన తొలి విడత పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

రాంచీ/ వాయనాడ్: జార్ఖండ్ అసెంబ్లీ తొలి విడత ఎన్నికలతో పాటు పలు రాష్ట్రాల్లో ఉప ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జార్ఖండ్‌లో మొత్తం 81 స్థానాలకు గానూ 43 అసెంబ్లీ స్థానాలకు బుధవారం మొదటి విడత పోలింగ్ జరిగింది. పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీఎం హేమంత్ సోరెన్ తన సతీమణి కల్పనతో కలిసి రాంచీలో ఓటు వేశారు. టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ తన సతీమణి సాక్షితో కలిసి రాంచీలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ధోనీ రాకతో పోలింగ్ కేంద్రం వద్ద సందడి నెలకొంది.

కేరళలోని వాయనాడ్ లోక్‌సభ స్థానంతో పాటు దేశంలోని 10 రాష్ట్రాల్లో 31 అసెంబ్లీ స్థానాలకు నిర్వహించిన ఉప ఎన్నికల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటర్ టర్నవుట్ యాప్ ప్రకారం.. బుధవారం సాయంత్రం ఐదు గంటల వరకు జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో 64.86శాతం పోలింగ్ నమోదైంది. వాయనాడ్‌లో 60.79 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ సమయం ముగిసినా క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లకు ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. దీంతో పోలింగ్ శాతం మరింతగా పెరిగే అవకాశముంది.

అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలు

రాజస్థాన్‌లో ఏడు సీట్లు కాగా.. పశ్చిమ బెంగాల్‌లో ఆరు, అసోంలో ఐదు, బీహార్‌లో నాలుగు, కేరళలో మూడు, మధ్యప్రదేశ్‌లో రెండు, మేఘాలయ, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, కర్నాటకల్లో ఒక్కో సీటుకు చొప్పున బుధవారం ఉప ఎన్నికలు జరిగాయి. జార్ఖండ్‌లో తొలి విడత నిర్వహించిన ఎన్నికల్లో జేఎంఎం నుంచి 23 మంది పోటీ చేయగా.. మిత్రపక్షాలైన కాంగ్రెస్ నుంచి 17 మంది, ఆర్జేడీ నుంచి ఐదుగురు బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి 36 మంది అభ్యర్థులు బరిలో దిగగా.. జేడీయూ నుంచి ఇద్దరు పోటీ చేశారు. బీఎస్పీ నుంచి ఏడుగురు అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు.

బరిలో ఉన్న కీలక నేతలు వీరే

కేరళలోని వాయనాడ్ లోక్‌సభ సీటు నుంచి కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకా గాంధీ వాద్రా బరిలో నిలిచిన విషయం తెలిసిందే. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ సీఎం చంపాయీ సోరెన్, ఆయన తనయుడు బాబూలాల్ సోరెన్, మాజీ సీఎం అర్జున్ ముండా సతీమణి మీరా ముండా, మధు కోడా సతీమణి గీతా కోడా, రఘుబర్ దాస్ కోడలు పూర్ణిమ సాహు వంటి ప్రముఖులు బరిలో ఉన్నారు. జార్ఖండ్‌లో రెండో విడత ఎన్నికల పోలింగ్ 20న జరగనుంది. నవంబర్ 23న ఓట్ల లెక్కింపుతో ఫలితాలు వెల్లడికానున్నాయి.

దలాల్ స్ట్రీట్‌కు ద్రవ్యోల్బణం సెగ

(మొదటిపేజీ తరువాయి)

నిరాశజనక ఫలితాలు, విదేశీ ఇన్వెస్టర్ల వాటాల విక్రయంతో దేశీయ ఈక్విటీ మార్కెట్లు విశ్వాసాన్ని కోల్పోయాయి. మంగళవారం రూ.3,024 కోట్ల విలువైన ఎఫ్ఐఐలు విక్రయించారు. ఇక గత అక్టోబర్ నెలలో ఏకంగా రూ.1.14 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకోగా.. ఈ నవంబర్ నెలలో ఇప్పటి వరకు రూ.23,911 కోట్లు తరలించుకుపోయారు. ద్రవ్యోల్బణం పెరుగుదల వల్ల కీలక వడ్డీ రేట్ల తగ్గింపును ఆర్‌బీఐ మరికొద్ది కాలం వాయిదా వేయనుందనే అంచనాలు, అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ పతనం తదితర పరిణామాలు దలాల్ స్ట్రీట్‌కు సవాళ్లుగా నిలిచాయి.

అన్ని రంగాలు ధమాల్..

అన్ని రంగాలు నష్టాలను చవి చూశాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆటోమొబైల్ రంగాల షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. రియాల్టీ 3.23 శాతం నష్టపోగా.. పారిశ్రామిక రంగం 2.95 శాతం, కాపిటల్ గూడ్స్ 2.72 శాతం, సర్వీసెస్ 2.54 శాతం, లోహ సూచీ 2.54 శాతం, కమోడిటీస్ 2.45 శాతం చొప్పున నష్టపోయాయి. బీఎస్ఈలో 3,299 షేర్లు నేల చూపులు చూడగా.. 670 మాత్రమే రాణించగా.. మరో 98 స్టాక్స్ యథాతథంగా నమోదయ్యాయి.

స్విగ్గీ బంఫర్ లిస్టింగ్..

ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ లిస్టింగ్ తొలిరోజే అదరగొట్టింది. ఇష్యూ ధర రూ.390తో పోల్చితే 8 శాతం ప్రీమియంతో రూ.420 వద్ద లిస్టింగ్ అయ్యింది. కొనుగోళ్ల మద్దతుతో కొద్ది సమయంలోనే కంపెనీ విలువ రూ.లక్ష కోట్ల మైలురాయిని సాధించింది. మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఈలో షేరు విలువ 16.92 శాతం లాభంతో రూ.456 వద్ద ముగిసింది.

లగచర్ల ఘటనకు సీఎం బాధ్యుడు

(మొదటిపేజీ తరువాయి)

విక్రమార్క... ఫార్మాసిటీ వల్ల గ్రామాలన్నీ కాలుష్యంతో నిండిపోతాయంటూ దుష్ప్రచారం చేశారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దాన్ని రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా రైతుల భూములను వారికే తిరిగి అప్పగిస్తామంటూ నమ్మబలికారని విమర్శించారు. అదే రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని 20 ప్రాంతాల్లో ఫార్మా విలేజ్ ఏర్పాటు చేస్తామంటూ కొత్త పల్లవి ఎత్తుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పేరిట భూములు గుంజుకోవటమనేది కొడంగల్ ప్రాంతంలో గత ఏడెనిమిది నెలల నుంచి కొనసాగుతోందని అన్నారు. కొందరు రైతులు తాము భూములివ్వబోమంటూ చెబితే...సీఎం సోదరుడు వారిపై బెదిరింపులకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. కొడంగల్ అంతా తమ సామ్రాజ్యమన్నట్టు రేవంత్ కుటుంబం వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు. అక్కడ రైతులు తిరగబడితే 16 మందిని జైలుకు పంపారని వాపోయారు. తన సొంత నియోజకవర్గంలో ఇంత పెద్ద ఎత్తున ఆందోళన జరుగుతుంటే స్థానిక ఎమ్మెల్యే అయిన రేవంత్...మహారాష్ట్రలో ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు మూటలు మోసేందుకే ఆయన అక్కడకు వెళ్లారంటూ ఎద్దేవా చేశారు. మరోవైపు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి కొడంగల్ ఘటనలతో సంబంధముందంటూ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే, కుటుంబ సభ్యులకు చెప్పకుండానే దొంగచాటుగా అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనేమైనా దేశద్రోహా? లేక టెర్రరిస్టా? అని నిలదీశారు. పోలీసులు నరేందర్‌ను అరెస్టు చేసిన తీరును కేటీఆర్ కిడ్నాప్‌గా అభివర్ణించారు. తమ పార్టీకి చెందిన సురేశ్... కలెక్టర్‌తో మాట్లాడితే తప్పేంటని ప్రశ్నించారు. తమ భూములను లాక్కోవద్దంటూ ఆయన అభ్యర్థించటం తప్పా? అని అడిగారు. లగచర్ల ఘటనకు ముందు అనేక నెలల క్రితమే బాధితులు కలెక్టర్‌ను, సీఎం సోదరుడు తిరుపతిరెడ్డిని కలిశారని వివరించారు. అయినా న్యాయం జరక్కపోవటంతో వారి ఆగ్రహం కట్టలు తెంచుకున్నదని తెలిపారు. కొడంగల్‌లో దళితులు, గిరిజనులు, బీసీల భూములను ప్రభుత్వం అక్రమంగా గుంజుకుంటోందని అన్నారు. తన అల్లుడు సత్యనారాయణరెడ్డి డైరెక్టర్‌గా ఉన్న మ్యాక్స్ బియన్ ఫార్మా కంపెనీ కోసమే సీఎం రేవంత్ ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. ఫోర్త్ సిటీ పేరిట ముఖ్యమంత్రి కుటుంబం రియల్ ఎస్టేట్ దందాకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రభుత్వం ఎంత నిర్బంధం విధించినా, ఎన్ని కేసులు పెట్టినా, బీఆర్ఎస్‌గా తాము కొడంగల్ రైతుల తరపున పోరాడతామని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. వారికి న్యాయం జరిగేదాకా అండగా నిలబడతామని భరోసానిచ్చారు. అరెస్టు చేసిన నరేందర్‌రెడ్డిని, 16 మంది రైతులను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

రైతు భరోసా అందేనా..?

(మొదటిపేజీ తరువాయి)

గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2018-19లో రైతు బంధు పథకం అమల్లోకి వచ్చాక 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు గత ప్రభుత్వం రైతు బంధు అమలు చేసింది. 2018-19లో 50 లక్షల మంది రైతులకు రూ.10486.36 కోట్లు, 2019-20లో 52 లక్షల మందికి రూ.10532.02 కోట్లు, 2020-21లో 59 లక్షల మందికి రూ.14656.01 కోట్లు, 2021-22లో 63 లక్షల మంది రైతులకు రూ.14772.99 కోట్లు, 2022-23లో 65 లక్షల మందికి రూ.14743.02 కోట్లు, 2023-24లో 69 లక్షల మందికి రూ.15262.92 కోట్ల మేరకు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 11 విడతల్లో కలిపి 65,99,091 మంది రైతుల ఖాతాల్లో రూ.8771 కోట్ల నిధుల్ని జమ చేశారు. ఇందులో సంగారెడ్డి జిల్లాలో 31,95,960 మందికి రూ.3619.54 కోట్లు, సిద్దిపేట జిల్లాలో 29,33,494 మందికి రూ.3124.82 కోట్లు, మెదక్ జిల్లాలో 24,69,637 మంది రైతులకు రూ.2027.37 కోట్లు రైతు బంధు కింద జమయ్యాయి.

సాగు భూములకైనా ఇవ్వండి

పంటలు పండించే భూములకైనా వెంటనే రైతు భరోసా సాయం ఇవ్వాలనే డిమాండ్ ఉంది. గత ప్రభుత్వంలో పడావు (సాగవ్వని) భూములకు కూడా రైతు బంధు ఇచ్చినట్టు తేలింది. 11 విడతల్లో కలిపి రూ.25,672.18 కోట్లు.. పంటలు సాగు చేయని పడావు భూములకు ఇచ్చినట్టు ప్రభుత్వం గుర్తించింది. అదే విధంగా పదెకరాలకు పై బడి భూములున్న రైతులు 1,16,722 మంది (1.80 శాతం) ఉన్నట్టు తేల్చారు. పడావు భూములు, అధిక భూములన్న వాళ్లను మినహాయించి పదెకరాల్లోపు ఉన్న 60,93,433 (97.83 శాతం) మంది రైతులకు వెంటనే రైతు భరోసా కింద రూ.15 వేల ఆర్థిక సహాయం ఖాతాల్లో జమ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా అమలు చేస్తే ప్రభుత్వంపై ఏడాదికి రూ.2260 కోట్ల అదనపు భారం పడుతుందని వ్యవసాయ శాఖ అధికారులిచ్చిన నివేదికలో పేర్కొన్నారు. పదెకరాల్లోపు ఉన్న రైతులకు మాత్రమే రైతు భరోసా ఇస్తే ప్రభుత్వానికి రూ.1385 కోట్లు ఆదా అవుతాయని కూడా అదే అధికారులు పేర్కొన్నారు.

యాసంగి పెట్టుబడులకు భరోసా అందించాలి

రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద ఆర్థిక సహాయం అందిస్తదన్న గంపెడాశతో అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో పండించిన వివిధ పంటల దిగుబడులు చేతికొచ్చాయి. ముఖ్యంగా రెండు ప్రధాన పంటలుగా ఉన్న వరి, పత్తి దిగుబడులొచ్చాయి. వీటిని అమ్ముకునేందుకు మార్కెట్‌కు తీసుకెళ్లారు. సీసీఐ నిర్లక్షం వల్ల పత్తి కొనుగోళ్లు సాగట్లేదు. జిన్నింగ్ మిల్లుల సమ్మె, దళారుల దోపిడి, సీసీఐ అనాసక్తితో రైతులు పంటను అమ్ముకోలేకపోతున్నారు. మరో పక్క వడ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇక్కడ కూడా బ్యాంకు గ్యారంటీ పేరిట ధాన్యం కేటాయింపుల్లో కొనసాగుతున్న తాత్సారం వల్ల ధాన్యం అమ్ముడుపోవట్లేదు. మిల్లర్లకు అమ్మి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలాంటి పరిస్థితి వల్ల రైతుల చేతుల్లో చిల్లిగవ్వలేకుండా పోయింది. మరో పక్క యాసంగీ పంటల సాగు సమయం సమీపిస్తుంది. యాసంగీ నీటి ఎద్దడి, కరెంట్ కోతలు, అకాల వర్షాల వంటి ఇబ్బందుల రీత్యా వరి సాగు చేసే రైతులు ముందస్తు సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నార్లు పోసేందుకు దుక్కులు దున్నుకుంటున్నారు. విత్తనాలు, ఎరువుల్ని తెచ్చుకోవాలి. ఖరీఫ్‌లో దుక్కులు దున్నిక ట్రాక్టర్ల కిరాయి డబ్బులివ్వకపోవడంతో నార్ల కోసం దుక్కులు దున్నేందుకు ట్రాక్టర్ల యజమానులు సతాయిస్తున్నారు. విత్తనాలు, ఎరువులిచ్చే ఫర్టిలైజర్ వ్యాపారులు దుకాణం ముందుకే రానిస్తలేరని పలువురు రైతులు వాపోతున్నారు.

యువతి దారుణ హత్య

నవతెలంగాణ-జూలూరుపాడు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం మాచినేని పేట తండాలో ఓ యువతి దారుణ హత్యకు గురైంది. ఓ వ్యక్తి ఆ యువతిని అతి కిరాతకంగా చంపి గ్రామ సమీపంలోని పత్తి చేనులో పాతిపెట్టాడు. మూడ్రోజుల తర్వాత హత్యా ఘటన వెలుగులోకి రావడంతో పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాచినేనిపేట తండాకు చెందిన బానోత్ వీరభద్రం.. కొత్తగూడెం పట్టణంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో పని చేసేవాడు. ఆ సమయంలో మణుగూరు మండలం తోగ్గూడెం గ్రామానికి చెందిన స్వాతి(32)తో పరిచయం ఏర్పడింది. అది కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. అయితే స్వాతితో పరిచయానికి ముందే వీరభద్రానికి మాచినేనిపేట తండాకు చెందిన నందినితో వివాహమైంది. స్వాతి ఆరేండ్లుగా వీరభద్రంతో సహజీవనం చేస్తూ తండాలోనే ఉంటోంది. రెండు నెలల కిందట సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పిస్తానని వీరు మండలానికి చెందిన ఓ దంపతుల వద్ద రూ.16 లక్షలు తీసుకున్నారు. వారికి ఉద్యోగం ఇవ్వకపోవడంతో ఆర్థికంగా నష్టపోయామని ఆ దంపతులు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నారు.

ఈ కేసులో వీరభద్రం ప్రధాన నిందితునిగా ఉన్నాడు. ఈ కేసులో స్వాతి హస్తం కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. ఆర్థిక లావాదేవీలు, కుటుంబ తగాదాలతోపాటు పలు కేసుల్లో వీరభద్రం నిందితునిగా ఉన్నాడు. ఈ క్రమంలో స్వాతి అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశంతో ఈనెల 9న స్వాతిని.. వీరభద్రం ఇంట్లోనే హత్య చేసి తల్లి సహకారంతో గ్రామ సమీపంలోని తన పత్తి చేనులో పూడ్చిపెట్టాడు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా పోలీసుల వరకు చేరింది. వీరభద్రాన్ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించడంతో నేరాన్ని ఒప్పుకున్నాడు. బుధవారం ఉదయం కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహమాన్, సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ రాణా ప్రతాప్ హత్యకు పాల్పడిన వీరభద్రంను సంఘటనా స్థలం వద్దకు తీసుకువెళ్లి తహసీల్దార్ స్వాతి బిందు సమక్షంలో మృతదేహాన్ని వెలికి తీయించి పంచనామా నిర్వహించారు. ఈ హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణమని తెలిసింది. పోలీసులు వివరాలు వెల్లడించాల్సి ఉంది.

నవచిత్రం

పక్కా మాస్ కమర్షియల్ సినిమా


కరుణ కుమార్

'ఒకప్పటి వైజాగ్ గురించి చాలా ఆసక్తికర విషయాలు తెలుసుకున్నాను. ఒక కథకుడిగా దీన్ని 'వాడిపోయిన పువ్వులు' పేరుతో ఒక షార్ట్ స్టోరీగా రాయాలనుకున్నాను. కానీ రాస్తున్నప్పుడు ఇది సినిమా మెటీరియల్ అని అర్థమైంది. దాని ఫలితమే 'మట్కా' సినిమా' అని అన్నారు దర్శకుడు కరుణ కుమార్. వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'మట్కా'. కరుణ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మించారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం నేడు (గురువారం) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ కరుణ కుమార్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- మన దగ్గర అద్భుతమైన కథలు, సాహిత్యం ఉంది. మనం తీసినన్నీ గొప్ప సినిమాలు ఎవరూ తీయలేదు. 'మాలపిల్ల' అనే సినిమా అందరికంటే ముందు మనం తీశాం. గొప్ప సాహిత్యం, కథలు, కల్చర్ ఉన్న తెలుగు నేల మనది. తమిళం, మలయాళం కంటే సూపర్ రూటెడ్ కథలు మన దగ్గర ఉన్నాయి. 'మట్కా' నా స్టయిల్ ఆఫ్ స్టోరీ టెల్లింగ్‌తో అందరినీ అలరించేలా తెరకెక్కించాను. ఇది పక్కా కమర్షియల్ సినిమా. చాలా స్టయిలిష్ ఫిల్మ్ మేకింగ్‌లో చేసిన సినిమా కూడా.
- ఇది ఒక మనిషి లైఫ్ జర్నీ. బర్మా నుంచి వైజాగ్‌కి వాసు ఒక శరణార్థిగా వస్తాడు. వైజాగ్‌లో ఉన్న పెద్ద పెద్ద పవర్‌ఫుల్ పర్సన్స్ అంతా బయట నుంచి వచ్చిన వాళ్లే. అప్పటి వైజాగ్ వెనుక ఉన్న క్రైమ్, గ్లామర్, కాస్మోపాలిటన్ కల్చర్ ఇవన్నీ కథలో భాగమే. అలాగే మట్కా ఎలా వచ్చింది.. దాన్ని ఎలా కొనసాగించారు?, సెల్‌ఫోన్ లేని రోజుల్లో దేశం మొత్తానికి ఒక నెంబర్‌ని పంపించడం అనేది ఈ కథలో చాలా ఇంట్రెస్టింగ్ పాయింట్. వాసుగా వరుణ్ తేజ్‌ది వన్ ఆఫ్ ది ఫైనెస్ట్ పెర్ఫార్మెన్స్. 20 ఏళ్ల తర్వాత కూడా ఈ సినిమా గురించి ప్రస్తావిస్తారు. కథానుగుణంగా జీవీ ప్రకాష్‌కుమార్ ఇచ్చిన నేపథ్య సంగీతం అత్యద్భుతంగా ఉంది. మేకింగ్ విషయంలో మా నిర్మాతలు ఎక్కడా రాజీపడలేదు.

నూతన ప్రతిభకు ప్రోత్సాహం


దిల్‌రాజు

కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించేందుకు 'దిల్ రాజు డ్రీమ్స్'ను నిర్మాత దిల్ రాజు లాంచ్ చేశారు. త్వరలోనే వెబ్ సైట్‌ను కూడా ఆయన లాంచ్ చేయబోతున్నారు.

దీని గురించి దిల్‌రాజు మాట్లాడుతూ, 'కొత్త వాళ్లను, కొత్త కంటెంట్‌ను ఎంకరేజ్ చేసేందుకు ఈ దిల్ రాజు డ్రీమ్స్‌ను ప్రారంభించాను. దర్శక, నిర్మాతలు, హీరో, హీరోయిన్లు ఇలా ఎవరైనా సరే ఇంట్రెస్ట్ ఉన్న వాళ్లు, కంటెంట్ ఉన్న వాళ్లు మా టీమ్‌ని అప్రోచ్ అవ్వొచ్చు. మా వెబ్ సైట్ ద్వారా మీ కంటెంట్ మా టీమ్‌కు చేరుతుంది. వారంలో ఒక రోజు ఈ టీమ్ తెచ్చిన స్క్రిప్ట్‌లను నేను వింటాను. నా బర్త్ డే సందర్భంగా లేదా న్యూయర్ సందర్భంగా ఈ కొత్త వెబ్ సైట్‌ను లాంచ్ చేస్తాం. నాకు సన్నిహితులైన స్టార్ హీరోలను, దర్శకులందరినీ పిలిచి ఆ వెబ్ సైట్‌ను గ్రాండ్‌గా లాంచ్ చేస్తాం. ఇప్పటికే ఇద్దరు ఎన్నారై నిర్మాతలు దిల్ రాజు డ్రీమ్స్ ద్వారా రెండు ప్రాజెక్టులు చేస్తున్నారు. కొత్త వాళ్లందరికీ ఇదొక ప్లాట్ ఫామ్‌గా ఉండాలనేది మా లక్ష్యం' అని తెలిపారు.

పవర్‌ఫుల్ కంటెంట్‌తో 'జీబ్రా' : చిరంజీవి


చిరంజీవి, సత్యదేవ్

హీరో సత్య దేవ్, డాలీ ధనంజయ నటించిన మల్టీ స్టారర్ 'జీబ్రా'. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పద్మజ ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్, ఓల్డ్ టౌన్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, ఎస్ పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మించారు. ఈ మూవీ ఈనెల 22న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను చిరంజీవి లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'కంటెంట్ బాగుండాలి. సినిమాలో ఎంటర్టైన్మెంట్ ఉండాలి. అది ఆస్వాదించడానికి ప్రేక్షకులు ఎప్పుడు సిద్ధంగా ఉంటారు. సినిమాలు ఆడవు, ప్రేక్షకులు ఓటీటీకి అలవాటు పడిపోయారనే మాట అవాస్తవం. సినిమా బాగుంటే ప్రేక్షకులు థియేటర్స్‌కి వస్తారు. వాళ్లని మెప్పించేలా మనం చాకచక్యంగా సినిమా తీయాలి. 'జీబ్రా' ట్రైలర్ చూసినప్పుడు మంచి కంటెంట్‌తో ఉందని అర్థమైంది. ఇందులో చాలా మంచి ఎంటర్టైన్మెంట్, స్టార్ కాస్ట్ ఉంది. అద్భుతమైన యాక్టర్స్ ఉన్నారు. కిక్ ఇచ్చే క్రైమ్ ఎలిమెంట్, ఫ్యామిలీ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. కచ్చితంగా ఈ సినిమా సూపర్ హిట్ బొమ్మ అవుతుంది. సత్యదేవ్ నాకు ఇంకో తమ్ముడు. తన సినిమాలు చూస్తున్నప్పుడు చాలా ఇంటెన్స్‌గా పెర్ఫార్మన్స్ చేస్తున్నాడు అనిపిస్తుంది. నిర్మాతలు బాల, దినేష్, ఎస్ ఎన్ రెడ్డి చాలా ప్యాషన్‌తో ఈ సినిమా తీశారు. డైరెక్టర్ ఈశ్వర్ కార్తీక్ చాలా వండర్ఫుల్‌గా తెరకెక్కించారు. టీమ్ అందరికీ ఈ సినిమా అద్భుతమైన విజయం చేకూర్చాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

'అన్నయ్య (చిరంజీవి) ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి రావడంతో మా సినిమా ఆల్రెడీ హిట్ అయిపోయిందని నమ్మకం వచ్చేసింది. ఆయనతో నటించిన 'గాడ్ ఫాదర్' సినిమా బిగ్గెస్ట్ హై ఇన్ మై లైఫ్. ఈ సినిమా నాకు డెబ్యూ లాంటిది. ఇది అన్నయ్యకి డెడికేట్ చేస్తున్నాను' అని హీరో సత్య దేవ్ చెప్పారు.

ఆటలు

గ్రూప్-3 నిర్వహణలో అలర్ట్‌గా ఉండండి

ధాన్యం కొనుగోళ్లలో వివాదాలకు తావివ్వద్దు : కలెక్టర్లు, ఎస్పీలకు సీఎస్ ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-3 పరీక్షల నిర్వహణ, ధాన్యం కొనుగోళ్లలో వివాదాలకు తావు లేకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లు, ఎస్పీలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి గ్రూప్-3 పరీక్షల ఏర్పాట్లు, వరి, పత్తి కొనుగోళ్ల పురోగతి, నర్సింగ్, పారామెడికల్ కాలేజీల ప్రారంభం, సామాజిక ఆర్థిక సర్వేపై రెవెన్యూ పోలీస్, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారులతో సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,401 పరీక్షా కేంద్రాల్లో 5.36 లక్షల మంది విద్యార్థులు గ్రూప్-3 పరీక్షకు హాజరవుతున్నట్టు తెలిపారు. కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలు అన్ని పరీక్షా కేంద్రాలను స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. పరీక్షల నిర్వహణకు కమిషన్ చేసిన ఏర్పాట్లను టీజీపీఎస్సీ చైర్మెన్ మహేందర్ రెడ్డి ఈ సందర్భంగా సీఎస్‌కు వివరించారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు కలెక్టర్లకు అవసరమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.అనంతరం వరి ధాన్యం కొనుగోలును ప్రస్తావిస్తూ.. వరి పంట దిగుబడి బాగా వచ్చినందున కోతలనుంచి మొదలుకుని రైతులు తమ పంటను అమ్ముకునే వరకు క్షేత్రస్థాయిలో అధికారులు మానిటరింగ్ చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. గోదాములకు ధాన్యం రవాణా చేయడంతో పాటు రైతులకు డబ్బులు త్వరగా చెల్లింపు జరిగేలా చూడాలని కోరారు. ప్రత్యేక అధికారులు నిర్దేశిత జిల్లాల్లో వరి తరలింపును ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు సిబ్బందికి అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. కొత్తగా మంజూరైన నర్సింగ్, పారామెడికల్ కాలేజీలకు సంబంధించి మిగిలిపోయిన మరమ్మత్తు పనులను గడువులోగా పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. సామాజిక, ఆర్థిక సర్వే సజావుగా జరిగినందుకు కలెక్టర్లను ఆమె అభినందించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ జితేందర్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టైటాన్స్ కోచ్‌గా పార్థీవ్



అహ్మదాబాద్ : భారత మాజీ వికెట్ కీపర్ పార్థీవ్ పటేల్ ఐపీఎల్ ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్‌కు సహాయక కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ముంబయి ఇండియన్స్‌కు ప్రతిభాన్వేషణుడిగా మూడు సీజన్ల పాటు పని చేసిన పార్థీవ్ పటేల్.. ముంబయి ఎమిరేట్స్‌కు 2023లో బ్యాటింగ్ కోచ్‌గా ఉన్నాడు. భారత్‌కు 25 టెస్టులు, 38 వన్డేల్లో ప్రాతినిథ్యం వహించిన పార్థీవ్ పటేల్ ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ సహాయక, బ్యాటింగ్ కోచ్ బాధ్యతలు చేపట్టనున్నాడు. గత సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ ఎనిమిదో స్థానంలో నిలువగా.. రానున్న ఆటగాళ్ల వేలంలో గెలుపు గుర్రాలను దక్కించుకునే వ్యూహంలో పటేల్ భాగస్వామి కానున్నాడు.

జాతీయ ఎస్‌జిఎఫ్ టోర్నీకి తన్మయి



హైదరాబాద్ : జాతీయ స్థాయి ఎస్‌జిఎఫ్ చెస్ టోర్నమెంట్‌కు తెలంగాణ నుంచి పది మంది ప్లేయర్లు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్‌జిఎఫ్ చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన చదరంగ క్రీడాకారులు జాతీయ స్థాయిలో తెలంగాణ జట్టుకు ప్రాతినిథ్యం వహించనున్నారు. బాలికల విభాగంలో తన్మయి, శ్లోక, రితిక, రవళిక, అస్మాలు ఎంపికవగా, బాలుర విభాగంలో బాసిక్, సాయి, విరించి, అమర్‌నాథ్, మార్టిన్‌లు చోటు దక్కించుకున్నారు.

తన్మయ్ శతకం

హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ 244/5



నవతెలంగాణ-హైదరాబాద్ : రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బీలో ఆంధ్రపై సీనియర్ ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (124 నాటౌట్, 240 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీతో కదం తొక్కాడు. ఆంధ్ర స్పిన్నర్ త్రిపురణ విజయ్ (3/85) మాయజాలంతో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 152/4తో కష్టాల్లో కూరుకుంది. ఓ ఎండ్‌లో నిలబడిన తన్మయ్ అగర్వాల్ అజేయ సెంచరీతో ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. అభిరాత్ రెడ్డి (35), కొడిమెల హిమతేజ (36), నితేశ్ రెడ్డి (22) రాణించారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి తన్మయ్ అగర్వాల్‌కు తోడుగా రాహుల్ రాదేశ్ (22 నాటౌట్) అజేయంగా క్రీజులో నిలిచాడు. రోహిత్ రాయుడు (0), కెప్టెన్ రాహుల్ సింగ్ (1) విఫలమయ్యారు. ఆంధ్ర ఫీల్డింగ్ వైఫల్యాలు సైతం హైదరాబాద్‌కు కలిసివచ్చాయి. తొలి రోజు ఆట ముగిసేసరికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 5 వికెట్లకు 244 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌తో ఆంధ్ర జట్టు కెప్టెన్సీ పగ్గాలు యువ ఆటగాడు షేక్ రషీద్ నుంచి తిరిగి హనుమ విహారికి దక్కాయి.

విద్యుత్ జైసింహకు క్లీన్‌చిట్

మహిళల జట్టు చీఫ్ కోచ్‌గా నియామకం

హైదరాబాద్ : మాజీ క్రికెటర్ విద్యుత్ జైసింహకు హెచ్‌సీఏ ఎథిక్స్ ఆఫీసర్, అంబుడ్స్‌మన్ క్లీన్‌చిట్ ఇచ్చారు. మహిళల జట్టు చీఫ్ కోచ్‌గా టీమ్ బస్‌లో జైసింహ మద్యం సేవించినట్టు ఆరోపణలు రావటంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో అతడిపై సస్పెన్షన్ విధించారు. ఎథిక్స్ ఆఫీసర్, అంబుడ్స్‌మన్ విచారణలో జైసింహపై వచ్చిన ఆరోపణలకు ఆధారాలు లేవని నిగ్గుతేల్చింది. జైసింహను తిరిగి చీఫ్ కోచ్‌గా నియమించాలని హెచ్‌సీఏను అంబుడ్స్‌మన్ ఆదేశించారు. ఈ మేరకు సీనియర్ మహిళల జట్టు చీఫ్ కోచ్‌గా జైసింహను నియమిస్తూ హెచ్‌సీఏ కార్యదర్శి ఆర్. దేవరాజ్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 'ఆకాశరామన్న లేఖతో నాపై అసత్య ప్రచారం జరిగింది. అంబుడ్స్‌మన్ విచారణలో న్యాయమే గెలిచింది. క్లీన్‌చిట్‌తో గొప్ప సాంత్వన చేకూరింది. మహిళల జట్టు చీఫ్ కోచ్‌గా పనిచేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని జైసింహ తెలిపారు.



తెరచాటు సాధన!

కోహ్లి, బుమ్రా, పంత్ ప్రాక్టీస్

పెర్త్ (ఆస్ట్రేలియా) : బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో తొలి టెస్టు కోసం టీమ్ ఇండియా సిద్ధమవుతోంది. రెండు బృందాలుగా ఇప్పటికే పెర్త్‌కు చేరుకున్న భారత క్రికెటర్లు.. వాకా స్టేడియంలో రెండు రోజులుగా సాధన చేస్తున్నారు. తొలి టెస్టు ముంగిట భారత్-ఏతో మూడు రోజుల వార్మప్ మ్యాచ్‌ను రద్దు చేసుకున్న జట్టు మేనేజ్‌మెంట్.. భిన్న రకాల పిచ్‌లపై సాధనకు మొగ్గు చూపించింది. మంగళవారం రిషబ్ పంత్, కెఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ ముమ్మర సాధన చేయగా.. బుధవారం స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లి, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్‌లు రంగంలోకి దిగారు. వాకా స్టేడియంలో నల్ల తెరల నడుమ టీమ్ ఇండియా క్రికెటర్లు సాధన చేస్తున్నారు. అభిమానులకు, మీడియాను ప్రాక్టీస్ సెషన్‌కు అనుమతించటం లేదు. ఎటువంటి ఫోటోలు, వీడియోలు తీయకుండా వాకా స్టేడియం సిబ్బంది నిషేధం విధించింది.

బుధవారం మధ్యాహ్నం ప్రాక్టీస్ సెషన్లో విరాట్ కోహ్లి గంట పాటు చెమటోడ్చాడు. అందుబాటులో ఉన్న నాలుగు నెట్స్‌లో సాధన చేశాడు. ప్రధానంగా బ్యాక్ ఆఫ్ లెంగ్త్, ఫుల్ లెంగ్త్ బంతులను ఎదుర్కొనేందుకు విరాట్ కోహ్లి శ్రద్ధ వహించాడు. ఈ సమయంలో సహాయక సిబ్బంది నెట్స్‌ను పర్యవేక్షించారు. రిషబ్ పంత్, యశస్వి జైస్వాల్ సైతం నెట్స్‌లో బ్యాటింగ్ సాధన చేశారు. భారత్,ఆస్ట్రేలియా తొలి టెస్టు ఈ నెల 22 నుంచి పెర్త్ ఓపస్ స్టేడియంలో ఆరంభం కానుంది. తొలి టెస్టుకు కెప్టెన్ రోహిత్ శర్మ అందుబాటులో ఉండేది అనుమానంగా ఉండగా, వైస్ కెప్టెన్ జస్‌ప్రీత్ బుమ్రా నాయకత్వ పగ్గాలు అందుకునే అవకాశం ఉంది. ఓపెనర్‌గా రోహిత్ శర్మ స్థానం కోసం శుభ్‌మన్ గిల్, కెఎల్ రాహుల్, అభిమన్యు ఈశ్వరన్ పోటీపడుతున్నారు.

విజేత ఉస్మానియా మెడికల్ కాలేజ్

మెడికల్ కాలేజ్ ఇంటర్ క్రికెట్ టోర్నీ



హైదరాబాద్ : వైద్య కళాశాలల అంతర క్రికెట్ టోర్నమెంట్‌లో ఉస్మానియా మెడికల్ కాలేజ్ విజేతగా అవతరించింది. పుదుచ్చేరి జిప్‌మర్ వేదికగా జరిగిన టోర్నమెంట్‌లో ఆతిథ్య జట్టుపై ఉస్మానియా జట్టు 31 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. తొలుత ఉస్మానియా మెడికల్ కాలేజ్ 20 ఓవర్లలో 135/7 పరుగులు చేసింది. అభిశ్యామ్ (57), అమర్‌నాథ్ రెడ్డి (32) రాణించారు. ఛేదనలో జిప్‌మర్ 19.5 ఓవర్లలో 104 పరుగులకు కుప్పకూలింది. ఉదయ్ కిరణ్ (2/10), ప్రణయ్ (2/15), తరుణ్ (2/27) రెండేసి వికెట్లతో అదరగొట్టారు. క్రికెట్ టోర్నీ విజేతగా నిలిచిన జట్టును, ఫిజికల్ డైరెక్టర్ సందీప్ కుమార్ జాదవ్‌ను ఉస్మానియా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.నరేందర్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డా. పద్మావతి, డా. నాగార్జున చారి, వైద్య సిబ్బంది తదితరులు అభినందించారు.

సింధు శుభారంభం

జపాన్ మాస్టర్స్ 2024



కుమమోటో (జపాన్) : భారత స్టార్ షట్లర్ పి.వి సింధు జపాన్ మాస్టర్స్ సూపర్ 500 టోర్నీలో శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఎనిమిదో సీడ్ బుసానన్ (థాయ్‌లాండ్)పై పి.వి సింధు వరుస గేముల్లో గెలుపొందింది. 21-12, 21-8తో 38 నిమిషాల్లోనే బుసాననను చిత్తు చేసింది. తర్వాతి మ్యాచ్‌లో కెనడా షట్లర్ మిచెలీ లీతో సింధు తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్‌కు నిరాశ ఎదురైంది. 22-20, 17-21, 16-21తో లియోంగ్ (మలేషియా) చేతిలో పోరాడి ఓడాడు. మహిళల డబుల్స్‌లో గాయత్రి, ట్రెసా జంట సైతం తొలి రౌండ్లోనే నిష్క్రమించిన సంగతి తెలిసిందే.

విండీస్, ఐర్లాండ్‌లతో ఢీ

ముంబయి : భారత మహిళల జట్టు స్వదేశంలో వెస్టిండీస్, ఐర్లాండ్‌లను ఎదుర్కొనుంది. న్యూజిలాండ్‌తో సిరీస్ అనంతరం హర్మన్‌ప్రీత్ కౌర్ సేన షెడ్యూల్‌ను బీసీసీఐ బుధవారం ప్రకటించింది. వెస్టిండీస్‌తో మూడు టీ20లు, మూడు వన్డేల సిరీస్ ఆడనుండగా.. ఐర్లాండ్‌తో మూడు మ్యాచుల వన్డే సిరీస్‌లో తలపడనుంది. వెస్టిండీస్, భారత్ టీ20 సిరీస్ డిసెంబర్ 15న నవీ ముంబయిలో ఆరంభం కానుంది. చివరి రెండు వన్డేలు సైతం నవీ ముంబయిలోనే జరుగుతాయి. టీ20 సిరీస్‌కు బరోడా ఆతిథ్యం ఇవ్వనుంది. డిసెంబర్ 27న మూడో టీ20తో భారత్‌లో వెస్టిండీస్ పర్యటన ముగియనుంది. వచ్చే ఏడాది జనవరి 10న ఐర్లాండ్‌తో తొలి వన్డే, 15న చివరి వన్డే జరుగనుంది. ఐర్లాండ్‌తో వన్డే సిరీస్‌కు రాజ్‌కోట్ వేదికగా నిలువనుంది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886